
CP03 F196.

డాక్టర్ భల్లా రాధాకృష్ణ కర్ణ



894.827
R12

తెలుగు లిపి

Blank Page

CR03F-196.

తెనుగు విందు

రచన:

డా. చల్లా రాధాకృష్ణ శర్మ

సి. ఎల్. ఎస్. పబ్లికేషన్స్

118

THE CHRISTIAN LITERATURE SOCIETY
POST BOX 501, PARK TOWN, MADRAS 3
Telugu Publications:
C.L.S. BOOKSHOP, HYDERABAD 1

© THE AUTHOR

First published, 1971

PRINTED AT THE DIOCESAN PRESS, MADRAS—1971. A2093

మనవి మాటలు

ఆప్పుడప్పుడు నేను భారతి, సంస్కృతి, ప్రవంతి, జమీన్‌రైతు మొదలైన పత్రికలకు వ్రాసిన వ్యాసములను, ఆకాశవాణి మదరాసు కేంద్రమునుండి చేసిన ప్రసంగములను ఇప్పుడు తెనుగు విందులో అందాలు దిద్దుకొన్నవి. వీనిని వ్రాయునప్పుడు సుప్రసిద్ధులైన రచయితల గ్రంథములను, వ్యాసములను సంప్రతించితిని. ఆయా పత్రికా సంపాదకులకును, రచయితలకును, ఆకాశవాణి మదరాసు కేంద్రము వారికిని నా కృతజ్ఞతను సవినయముగ తెలుపుకొనుచున్నాను.

ఈ వ్యాససంపుటిని సర్వాంగసుందరముగ ప్రచురించిన సి. ఎల్. ఎస్. వారికి మిక్కిలి కృతజ్ఞుడను. ముఖ్యముగా నా మిత్రులు, సత్యదూత సంపాదకులు నైన శ్రీ జి. యి. డేవిడ్ గారి సహృదయతకు నా కృతజ్ఞత. శ్రీ డేవిడ్ గారి ప్రోత్సాహమే, ఈ ప్రచురణకు కారణమన్నను సాహసము కాదు.

ఈ వ్యాసములన్నియు తెనుగు పాఠక లోకమును అలరించునని ఆశించుచున్నాను.

చల్లా రాధాకృష్ణ శర్మ.

విషయసూచిక

		పుట
1.	తేనెసోనల తెనుగుభాష ...	... 1
2.	తమిళ వాఙ్మయములో ఆంధ్ర ప్రశంస	... 5
3.	ఎఱ్ఱన సోమనల హరివంశము—ఒక పరిశీలన	... 12
4.	పాల్కురికి సోమనాథుని తమిళభాషా వైదుష్యము	... 20
5.	శ్రీనాథ మహాకవి ...	... 26
6.	శ్రీనాథుని చాటువులు ...	... 34
7.	పెద్దనగారి పెద్దతీకము ...	... 43
8.	చేమకూరవారి సుభద్ర ...	... 61
9.	పరవస్తు చిన్నయసూరి ...	... 91
10.	పద్యకావ్యములైన పామరగాథలు	... 102
11.	నాటక పితామహుని చిత్రాంగి ...	... 111
12.	రాబర్ట్ డి. నొబిలి ...	... 117
13.	వీరమాముని ...	... 126
14.	బెంజమిన్ షూల్జి ...	... 137
15.	ఎల్లిస్ ...	... 141
16.	జె. సి. మారిస్ ...	... 149
17.	విలియం కేరీ ...	... 160

తేనెసోనల తెనుగుభాష

అభిప్రాయ ప్రకటనకు ప్రబల సాధనముగా మానవుడు భాష నుపయోగించుచున్నాడు. అర్థవంతములైన వాక్స మువ్చయమునకు నామాంతరమే భాష. వాగర్థసంకలితమైన యీ భాష మనీషాంచితుడైన ఒక్క మానవునకు మాత్రమే హస్తగత మైనది. ఈ విశేషాంశము పిపీలికాది బ్రహ్మ పర్యంతముగల ఈశ్వర సంతానములో అతనికి మహోన్నత స్థానమును సమకూర్చినది.

అవయవనిర్మాణములో సర్వమానవులలోను సారూప్య సాన్నిహిత్యము లున్నట్లు ప్రస్ఫుటమైనను సాంఘికాచార వ్యవహారములు, మత విషయక సంప్రదాయములు మొదలగు నవి మానవజాతిని కొన్ని వర్గములుగా విభజించినవి. అటులనే వ్యవహారోద్దిష్టములైన విభిన్నభాషలు మానవాళిలో వివిధ వర్గముల స్థాపనమునకు దోహద మొసగినవి. ఆంగ్లమును వ్యవహరించువారు ఆంగ్లేయు లయిరి. తమిళమును మాట లాడువారు తమిళు లనబడుచున్నారు. తెలుగు నుపయోగించు వాము తెలుగులుగా వ్యవహృతు లగుచున్నారు. కనుక భాషలనుబట్టి ఆయా జాతులకు వ్యవహార నామము లేర్పడుచుండుటచే, మానవ సమాజమున భాషకు ప్రచుర ప్రాధాన్యము గలదని వ్యక్త మగుచున్నది.

ఉదాత్త సాహితీ వైభవముగల నాగరక భాషలలో తెనుగు ఒకటి. జనసంఖ్యను బట్టి మనదేశభాషలలో రెండవ స్థాన మును సంపాదింపగలిగిన యీ భాషకు తెలుగు, త్రిలింగము, ఆంధ్రము మున్నగు నామాంతరములు గలవు. తెనుగు ప్రాచీనమైన భాష. మధురమైన భాష. సజీవభాష. ఇక తెనుగుసుందరి మాధుర్యమునకు ముగ్ధులై పలువురు సహృద యులు పలికిన సరసోక్తులను చవి చూచెదము.

సుధాకరుడను నొక సంస్కృత కవి. తెలుగు భాషా మాధుర్యము నిట్లు ప్రస్తుతించెను:

'యోవేత్త్యాంధ్రమయీం వాణీం
శిరీష కుసుమపేశలామ్
కిం తస్య సుధయా కార్యం
మాధుర్య రస నిర్ణయే.'

తెనుగు శిరీషకుసుమపేశల మట!

శ్రీనాథ మహాకవి కృతిగా చెప్పబడు క్రీడాభిరామము నందు:

'జనని సంస్కృతంబు సకల భాషలకును
దేశ భాషలందుఁ దెలుఁగు లెస్స
జగతిఁ దల్లికంటె సౌభాగ్యసంపద
మెచ్చు టాఁడు బిడ్డ మేలు గాదె'

అను నొక పద్య మున్నది. ఇందు సంస్కృతాంధ్ర భాషలకు జన్యజనక సంబంధము పేర్కొనబడినది. అయినను దేశభాషలందు తెనుగు లెస్స అని కవి లెస్సగా నిరూపించినాడు. సౌభాగ్య సంపత్సమేత అయిన ఆడుబిడ్డను చూచి మురిసి

పోవుట మాతృధర్మము. ఎంత సహజమైన వర్ణనము! ఇంతకు 'పుత్రా దిచ్ఛేత్ పరాజయం' అని కదా ఆర్యోక్తి.

దేశభాషలందు తెలుగు లెస్స అని సంస్కృతాంధ్ర ద్రవిడ కర్ణాట భాషాభిజ్ఞుడైన శ్రీ కృష్ణదేవరాయలవారు వ్యక్త మొనర్చియుండుట గమనింపదగిన అంశము.

'తెలుఁగదేల యన్న' దేశంబు తెలుఁగేను
దెలుఁగు వల్లభుండఁ దెలుఁగొకండ
యెల్ల పృథులుఁ గొలువ నెఱుఁగవే బాసాడి
దేశ భాషలందుఁ దెలుఁగు లెస్స.'

శతాధిక గ్రంథకర్త అయిన అప్పయ దీక్షితులు 'ఆంధ్రత్వ మాంధ్రభాషాచ నాల్పస్య తపసః ఫలమ్' అని చెప్పినట్లు ప్రతీతి. ఆంధ్రుడై పుట్టుటయు, ఆంధ్రభాష మాటాడుటయు మహా తపఃఫల మని దీని తాత్పర్యము.

కన్నడములో రుచికరమైన నానుడి ఒకటి ఉన్నది. అది కూడ తెలుగుభాషా మాధుర్యమును సుస్పష్ట మొనర్చుచున్నది. 'కన్నడ కత్తురి, తెలుగు తేఁటె...' అనునదేఁ లోక్తి. కన్నడ మేమో కస్తూరి యట! తెలుగు తేటగానుండునట!

ఇక తమిళనవయుగ ప్రవక్తగా పథిత యశస్కుడైన సుబ్రహ్మణ్య భారతి ఆంధ్రభాషా ప్రాశస్త్యమును కొనియాడిన తీరు కొనియాడదగినది.

'సిందునదియిన్ మిశై నిలవినిలే
చేరనన్నాట్టిళం పెణ్ గళుడనే
సుందర తెలుంగినిట్ పాట్టినై త్తు
త్రోణిగళోట్టి, విళైయాడి వరువోం.'

('భారతదేశం' అను గేయములోనిది)

తెలుగు సుందరమైన భాష అనియు, గానానుకూలమైన భాష అనియు భారతి పేర్కొనినాడు.

'విరియగాచిన వెన్నెల రాత్రిలో
చేరదేశపు చెలులు వెంటరాగా
సుందరాంధ్ర పదమ్ము పాడుచున్
సింధునదిని పడవ నడిపెదము.'

తేనెసోనల తెనుగుభాష ఒక్క మన దేశమువారినే కాదు, విదేశీయులనుకూడ ముగ్ధులనుగా చేసెను. శ్రవణ సుభగత్వము గల తెనుగును విని ముగ్ధులై కాబోలు, తెనుగును 'పాచ్య ఖండపు ఇటలీ భాష' అని పాశ్చాత్య పండితులు ప్రశంసించినారు.

ద్రావిడ భాషలలో—ముఖ్యముగా తమిళమునందు—అపార పరిశ్రమ సలిపిన బిషప్ కాల్డువెల్ తన అమూల్యాభిప్రాయము నిట్లు వ్యక్త మొనర్చెను: 'ప్రాచీన సంస్కృతి విషయమునందును, పదబాహుళ్యము విషయమునందును తమిళమునకు పిమ్మట తెలుగును పేర్కొనదగినను, భాషా మాధుర్యములో మాత్రము తెలుగు అగ్రస్థానము నలంకరించుచున్నది.'

హెన్రీ మారిస్ ఇట్లు ప్రస్తుతించెను:

'తెలుగు తీయని భాష. ద్రావిడ భాషలలో తెలుగువలె తీయనిభాష మరియొకటి లేదు. నిరక్షరాస్యుల నూటలలో కూడ తెలుగు మధురముగానే వినిపించును. తెలుగును పాచ్యఖండపు ఇటాలియన్ భాష అనుట సమంజసమే . . .'

తెనుగునకు మాధుర్యగుణమేకాక అన్యభాషా శబ్దములను తనవిగా మలచుకొను శక్తి కూడ కలదని పేర్కొనిరి. తెనుగు మలచుకొనుటకు వీలైన భాష అనియు, అన్యభాషా శబ్దముల నుపయోగించునప్పుడు కూడ మధురముగా వినిపించుననియు, సంకుచితమైన రాష్ట్ర దురభిమానమునకు పాల్పడలే దనియు హోమ్ ఫీల్డ్ మెక్‌లియోడ్ పేర్కొనెను. సుప్రసిద్ధ విజ్ఞాన శాస్త్రవేత్త అయిన జె బి. యస్. హాల్డేన్, ఈ విషయమునే యిటుల వ్యక్త మొనర్చెను:

'విదేశ వస్తువులను బహిష్కరించునట్లుగా, అన్యభాషా శబ్దములను బహిష్కరింపలేము. బహుశః భారతీయ భాష లన్నిటిలోను తెలుగు ఒక్కటే అన్యభాషా శబ్దములను సులభముగా స్వీకరించునని పేర్కొనదగును. ఈ కారణమున విజ్ఞానశాస్త్రము, వైద్యశాస్త్రము, ఇంజనీరింగు మున్నగువాటిని బోధించుటకు తెలుగు హిందీకి ప్రతిస్పర్థి కాగలదు.'

ఈ విధముగా సహృదయు లెందరో తేనెసోనల తెనుగు భాషను ప్రస్తుతించియుండుట గమనింపదగిన విషయము!

తమిళ వాఙ్మయములో ఆంధ్ర ప్రశంస

దక్షిణాపథమున వ్యవహృతము లగుచున్న తెలుగు, తమిళము, కన్నడము మొదలగు నాగరక భాషలు ద్రావిడ భాషా కుటుంబమునకు చెందినవని భాషాతత్త్వ శాస్త్రజ్ఞులు పలువురు విశ్వసించుచున్నారు. ఈ భాషలు చాల ప్రాచీనము లనుట

నిర్వివాదము. కాని తమిళభాషా వాఙ్మయములు బహు ప్రాచీనము లనియు, క్రీస్తునకు పూర్వమే తమిళమున పెక్కు రసవత్కావ్యములు వెలువడె ననియు తమిళ పండితుల అభిప్రాయము. ఈ అభిప్రాయమునందలి సత్యాసత్యము లెట్లున్నను, తమిళభాషా సాహిత్యములు మాత్రము బహు ప్రాచీనములని భావింపవచ్చును. తెలుగు కన్నడములందు లభించిన ప్రాచీన సాహిత్యము తమిళ సాహిత్య మంత ప్రాచీనము కాకపోయినను, తెలుగు, కన్నడ భాషలు మాత్రము తమిళమువలె ప్రాచీనములని నుడువదగును. తమిళ కన్నడము లందు జైన బౌద్ధులు సృష్టించిన సాహిత్యము లభించినది. తెలుగున మాత్రము వారు సృష్టించిన వాఙ్మయము నేటికిని లభ్యము కాలేదు. దేశభాషలను ఆదరించి, వానిలోనే రచన లొనర్చిన జైన బౌద్ధులు తెలుగునందును రచన చేసియుందురను టకు జైన బౌద్ధ కవి కర్తృకములుగా భావింపబడు కావ్యము లందలి కొన్ని పద్యములైనను ఉపలబ్ధ మగుటయే ప్రబలకారణ మనవచ్చును. నిజమునకు తమిళమున వెలసిన తొలి రచనలలో ముక్కాలు ముప్పీసము జైన బౌద్ధులు సంతరించిన రచనలే గలవు. తమిళ పంచ కావ్యములని పేరు పెంపులు గడించిన సిలప్పదిగారము, మణిమేకలై, జీవకచింతామణి మున్నగు మహాకావ్యములు జైన బౌద్ధ కవి కర్తృకములే! తొలి నాళ్లలో తమిళ సాహిత్యమును పరిపుష్టము చేసిన చిరయశస్సు వారికే లభించుచున్నది. కాని ఒక్క తెలుగు భాషలో మాత్రము ఎందువలననో జైన బౌద్ధులు సంతరించిన కావ్యములు కాలగర్భమున కలసిపోయినవి. కనుక లభించిన సాహిత్య మును పురస్కరించుకొని తెలుగు కన్నడములు తమిళమువలె

బహు ప్రాచీనములు కావని తలచుట సాహసమే కాగలదు. అతి ప్రాచీనమగు తమిళ సాహిత్యములో ఆంధ్ర ప్రశంస కనబడుచున్న కారణమున, తెలుగు బహు ప్రాచీనమగు భాష అని సాధికారముగ నుడువదగును.

క్రీస్తుశకము పదునొకండవ శతాబ్దమున వెలుగులోనికి వచ్చిన కలింగత్తుప్పరణి అను నొక చారిత్రక కావ్యమున తత్కర్త యగు జయంగొండార్ కన్నడ భాషను గురించి యిట్లనెను:

'మళలైక్కు మొళిత్ సిలవడుగుం పల తమిళుం కుళత్తిరు కరునాడియర్.....' తొక్క పలుకుల కన్నడ భాషలో కొన్ని నడుగు మాటలును (తెలుగు మాటలు), పలు తమిళ శబ్దములును కానవచ్చుచున్నవని పై పంక్తులలో వ్యక్తము చేయబడినది. అనగా పెక్కు తమిళ శబ్దములయు, కొన్ని తెలుగు మాటలయు కలయికవలన కన్నడ మేర్పడెనని ఆ కవి అభిప్రాయము. ఈ వాదమును కన్నడిగులు అంగీకరించరు. అయినను ఈ సందర్భమున సుప్రసిద్ధ పరిశోధక విద్వాంసులగు ము. రాఘవయ్యంగారు తెలుగు, కన్నడములను గురించి వెలిబుచ్చిన అభిప్రాయము నిట నుదాహరించుచున్నాను:

'... . అది (కన్నడము) తెలుగు తమిళ భాషలలోని శబ్దముల కలయికవలన ఏర్పడిన భాష అని ప్రాచీన తమిళ పండితుల అభిప్రాయము ... ఈ విషయములను పురస్కరించుకొని చూడగా తెలుగునకు తమిళమున కున్నంత ప్రాచీనత గలదని తెలియుచున్నది...' కనుక తెలుగు, కన్నడములు తొలుత కలసి యుండెడివనియు, కాలక్రమమున అవి విడివడి పోయి వేర్వేరు భాష లయ్యెననియు భావించుట సమంజసము కాదేమో!

ఈ విషయమున పర్యాప్తమగు పరిశీలన మొనర్పవలసిన అవసర మెంతేని గలదు. ఏది యెట్లున్నను ప్రాచీన తమిళ విద్వాంసులమతము ననుసరించి తెలుగు, తమిళమునలె, బహు ప్రాచీనమగు భాష అనదగునను.

ఇక తమిళ వాఙ్మయమునందు తెలుగును గురించియు, తెలుగులను గురించియు చెప్పబడిన విషయములను రేఖా మాత్రముగ పరిశీలింతము.

తెలుగువారు తమిళభాషను అరవ మనియు, తమిళులను అరవ లనియు పేర్కొనుచున్నట్లుగా, తమిళులు ప్రాచీన కాలమున తెలుగును వడుగు అనియు, తెలుగువారిని వడుగు లనియు వ్యవహరించిరి. తమిళ వాఙ్మయమున తొలియుగముగా సంభావింపబడుచున్న సంగ (ఘు) కాలమునసే వడుగుశబ్దము ప్రచారమున నుండినట్లు తెలియుచున్నది. కనుక వడుగు శబ్దము చాల ప్రాచీన మయినది. తరువాతి కాలమునసే తమిళులు తెలుగువారిని తెలుంగర్ అనియు, తెలుగును తెలుంగు అనియు పేర్కొనిరి. నేటికిని బలిజకులస్థులను తమిళులు వడుగులను పేరున వ్యవహరించుచున్నట్లు తెలియు చున్నది. ఇది గమనింపదగు నంశము.

సంగకాలమున సంతరింపబడిన కావ్యములగు అగనానూఱు, పుఱనానూఱు మొదలగు వానిలో వడుగుశబ్దము తొమ్మిది చోట్ల ప్రయుక్తమైనది. వడుగులు తమిళమునకు భిన్నమగు భాషను మాటాడువారనియు, బలసంపన్నులనియు పేర్కొన బడెను. సంగకాలపు గ్రంథములలో తెలుగు సేనానాయకుల పేర్లు కొన్ని పేర్కొనబడినవి.

కొన్నిచోట్ల వడుగుశబ్దము తెలుగు, కన్నడములను సూచించు సమష్టినామముగా వాడబడినను, కాలక్రమమున వడుగుశబ్దము తెలుగును, తెలుగువారిని సూచించుటకే వాడబడెను.

ప్రాచీనకాలమున తమిళము వ్యవహృత మగుచున్న దేశమును పండ్రెండు భాగములుగ విభజించిరి. తమిళనాడు నకు ఉత్తర సరిహద్దుగా తెలుగునాడు ఉండెనని తమిళ విద్వాంసు లెల్లరు నంగీకరించిన విషయమే. తమిళమున తొలి లాక్షణికుడగు తొలాక్కాప్పియనార్ సమకాలికుడగు పనంపార నార్ 'వడవేంగడం తెన్ కుమరి యా యిడై త్తమిళ్ కూఱు నల్లులగం' అని పేర్కొనెను. ఉత్తరమున నున్న వేంకట శైలము నకును, దక్షిణమున నున్న కన్యాకుమారికిని నడుమగల ప్రదేశ మున తమిళము మాట్లాడబడుచుండె నని పనంపారనార్ మాటలవలన స్పష్ట మగుచున్నది. తరువాతి తమిళ పండితు లెల్లరు నిటులనే నుడివిరి.

కంబకవి చక్రవర్తి 'వడకలై, తెన్కలై వడుగు కన్నడం . .' అనియు, కాక్కైపాడినియార్ అను ప్రాచీనకవి 'వడదిశై మరుంగిన్ వడుగువరంబాగ' (తెలుగునాడే తమిళ దేశపు ఉత్తరపు సెల్ల) అనియు, సిలప్పదిగార కావ్యకర్తయగు ఇళంగో పూజ్యపాదులు, 'కొంగణర్, కలింగర్ కొడుం కరునాడర్' అనియు పేర్కొనిరి.

మైసూరు రాజ్యపుట్టుత్తర భాగమును, బళ్లారి అనంత పురం జిల్లాలను బడగనాడను పేరున తమిళులు వ్యవహరించు చుండిరని తెలియుచున్నది. తరువాతి కాలమున ఈ బడగ నాడు వడుగునాడుగా మారి యుండనోపును. ఆంధ్ర దేశపు

ఉత్తర భాగమును తెలుగునాడనియు, దాని దక్షిణ భాగమును వడుగునాడనియు ప్రాచీన తమిళులు వ్యవహరించినట్లు కీర్తి శేషులు ము. రాఘవయ్యంగారు విశ్వసించుచున్నారు.

తమిళులు, తెలుగువారిని వడుగులని పేర్కొనినట్లు, తెలుగు వారును తమిళులను అరువలని (అరవలు) పేర్కొనుచుండిరి. వడుగు శబ్దము తెలుగువారి కందరకు వర్తింపనట్లు, ఈ అరువ శబ్దము కూడ తమిళులు కెల్లరకు వర్తించదు. కోయంబుత్తూరు జిల్లాకు అరువనాడను వ్యవహార నామముండెనని విదిత మగు చున్నది. ఆచారకోవై అను నొక తమిళ గ్రంథమునం దీ అరువనాటివాకు, వడుగులు, కర్ణాటకులు ఇంకను మరికొన్ని దేశములందు నివసించువారు పరిహసింపబడిరి. వీరి ఆచార వ్యవహారములు తమిళుల ఆచార వ్యవహారములకు విభిన్న ముగ నుండుటచే తమిళులు వీరిని పరిహసించిరి. కనుక అతి ప్రాచీన కాలమున వడుగులును, అరువనాటివారును ఆచార వ్యవహారములందు దగ్గరి చుట్టరికము కలిగియుండిరనియు, కనుకనే వారు సన్నిహితులై మెలగుచుండిరనియు మనము ఊహింపవచ్చును. నిజమునకు తెలుగు వారును, తమిళులును తొలుత స్నేహభావమున సంచరించుచుండిరి.

పై విషయాదికమును పరిశీలించిన ఈ క్రింది విషయము సుస్పష్టము కాగలదు. వడుగు అనుమాట చాల ప్రాచీన మైనదనియు, తొలుత అది బళ్ళారి, అనంతపురము మండలము లందు నివసించు తెలుగువారిని సూచించుటకే వాడబడినను, కాలక్రమమున అది తెలుగు వారినందరను సూచించు శబ్దముగా ప్రయుక్త మయ్యె ననియు, అటుపిమ్మట తెలుగులలోని బలిజ కులస్థులను మాత్రమే సూచించుట కుపయోగింపబడుచున్న

దనియు నుడువదగును. అంతేకాక ఆంధ్రులును, కన్నడిగులును వడుగర్ అను పేరున తొలుతొలుత వ్యవహరింపబడినను, పిమ్మట వడుగుశబ్దము ఒక్క తెలుగువారికే పరిమిత మయ్యెనని యు పేర్కొనవలసియున్నది. అందువలన వడుగు, తెలుగు-ఈ రెండు మాటలును తమిళుల దృష్టిలో సమానార్థకము లనియే భావించవచ్చును. కాని తెలుగువారు తమ్ము వడుగులని వ్యవహరించుకొనినట్లు మాత్రము తెలియవచ్చుట లేదు.

తెలుగువారగు నాయకరాజులు తమిళనాడును కైవసమొనర్చుకొని దొరతనము సాగించిన కాలములో తమిళదేశమున తెలుగు శబ్దమునకు ప్రచుర ప్రచార మేర్పడెను. ఆనాళ్లలో తెలుగు భాషకు రాజగౌరవము కూడ లభ్యమయ్యెను. ఈ నాయకరాజుల కాలమున తమిళనాడున తెలుగు మాటకును తెలుగు పాటకును ఒక క్రొత్త చెలువము, నొక క్రొత్త సోయగము చేకూరినవి. తత్ఫలితముగ తమిళులు పలువురు తెలుగు నభ్యసించిరి. తెలుగున రచనలు చేయసాగిరి. తెలుగు కావ్యములను తమిళము చేసికొనిరి. ఈ అనువాద భాగ్యమునకు నోచుకొనిన వానిలో రామరాజ భూషణుని వసుచరిత్రను, వేమన పద్యములు ముఖ్యములు.

ఆధునిక తమిళ సాహిత్య వీధులను సువిశాల మొనర్చిన మహాకవి సుబ్రహ్మణ్య భారతి తెలుగును గానానుకూలమైన భాష అనియు, సుందరమైన భాష అనియు ప్రశంసించెను. విరియగాచిన వెన్నెలరాత్రిలో చేరదేశపు చెలులతో కూడి సుందరాంధ్ర పదమును పాడుచు సింధునదిలో పడవ నడుపుచు కాలము గడపవలెనని భారతి ఆశించెను. ఆంధ్ర మహాసభ

అను వ్యాసములో భారతి తెలుగువారి రాజనీతిజ్ఞతను, కొండా వేంకటప్పయ్యగారి ప్రతిభను కొనియాడెను. మరి యొక వ్యాసరాజమున మహాభక్తుడు, మహాకవియు నైన పోతనామాత్యుని, రాల్గరగించు గాంధర్వమున రామచంద్రుని సందర్శించిన త్యాగరాజును భారతి సంస్తుతించెను. చంద్రిక అను నవలికలో కందుకూరి వీరేశలింగము పంతులును సుబ్రహ్మణ్య భారతి బహుధా ప్రశంసించెను.

ఇటుల తమిళ వాఙ్మయములో తెలుగు భాషయు, తెలుగు జాతియు ప్రశంసింపబడుట గమనింపదగు విషయము. తమిళ కావ్యములను సునిశితముగ పరిశీలించిన ఇంకను మరికొన్ని అంశములు బయల్పడు ననుటలో సందేహము లేదు. భావైక్యమును సాధింప నభిలషించుచున్న, యీ దినములలో తెలుగు తోబుట్టు భాషలను, ముఖ్యముగా తమిళ భాషను, అధ్యయనము చేయవలసిన అవసరము ఎంతేని గలదనుట చర్విత చర్వణమే కాగలదు.

ఎఱ్ఱన సోమనల హరివంశము– ఒక పరిశీలన

తెలుగు సాహిత్యమును సుసంపన్నము చేసిన విద్వత్కవులలో ప్రబంధ పరమేశ్వర బిరుదాంకితుడైన ఎఱ్ఱనయు, నవీన గుణ సనాథుడైన నాచన సోమనాథుడును సుప్రసిద్ధులు. వీరిద్దరు సమకాలికులు. అంతేకాదు. భారతమునకు ఖిలమైన హరి వంశమును వీ రిరువురును వ్రాసిరి. ప్రతిభావంతులైన కవులగు

టచే పేరి కావ్యములు - హరివంశము, ఉత్తర హరివంశము - సాహితీ జిజ్ఞాసువుల ఆదరమును చూరగొనుటయేకాక, తరువాతి కవులకు మార్గదర్శకములు నైనవి. కాని యీ కావ్యముల రచనా కాలమును గురించి పండిత లోకములో అభిప్రాయ భేదములు కొన్ని యేర్పడినవి. ఎఱ్ఱనను చూచి సోమన రచన చేసియుండవచ్చునని కొంద రన్నారు. ఈ వాదము సరి కాదని కొందరి అభిప్రాయము. విద్వత్కవులు వేలూరి శివ రామశాస్త్రిగారు ఏమన్నారో చూడుడు: 'నాచన సోముని యుత్తర హరివంశమును నెఱ్ఱా ప్రగ్గడ హరి వంశమును నొకే మారు క్రమక్రమముగా జదువుచూ, బోవగా, సోమననే యెఱ్ఱన యనుకరించి నటుల నాకు దోచినది.' అటులనే ఉత్తర హరివంశమును గురించి కూడ రెండు వాదములు లేక పోలేదు. ఒక వాదము ననుసరించి అది రసవద్రచన. సరసత్వము లోపించిన కావ్య మని మరొక వాదము. ఈ రెండు నిజము నకు దగ్గరి చుట్టములే. ఏది యెట్లున్నను నాచన సోముడు ప్రతిభావంతుడైన కవి అనియు, అతని కావ్యము ఒక విలక్షణ మైన రచన అనియు పేర్కొనుట సాహసము కాదు.

సమానేతివృత్తములగల రెండు కావ్యములలో కథాగత విషయములు ఒక్కటిగా ఉండవచ్చును గాని, కథా కథనము మాత్ర మొకే విధముగా ఉండదు. కొద్దిగానో, గొప్పగానో భేదము కనిపించుచునే ఉండును. అటుల కనిపించినప్పుడే ఆ రచనలలోని వైశిష్ట్యమును తెలిసికొనవచ్చును. అంతేకాక ఆ రచయితలలోని ప్రతిభ కూడ స్పష్ట మగును. సమానేతి వృత్తముగల రచనలను, ఈ దృష్టితో పరిశీలించుట అవసరము.

ఎఱ్ఱన మహా పండితుడు. పైపెచ్చు గొప్ప భక్తుడు. ఆయనలో తాత్త్విక దృష్టి బహుధా కనిపించును. ఆయన చేసిన వర్ణనలే ఇందుకు ప్రబల సాక్ష్యము. చూడుడు, హరివంశము ఉత్తర భాగములో శ్రీకృష్ణుడు కావించిన శివుని మాహాత్మ్య వర్ణన:

'భూత విధాయకుడ, నఖిల
భూత నియామకుడ వీవు, భూతనిధివి స
ద్భూతిదుడవు నమ్రులకును
భూతేశ్వర, నీ మహిమ ప్రభూతంబు శివాఁ:'

'అతి సౌమ్యము, లతి ఘోరము,
లతి సూక్ష్మము, లతి విపులము లద్భుతములు నీ
వ తదాకారంబులు త
ద్గత హృదయముల కేఁగవచ్చు కందర్పహరా!'

ఈ పద్యములలో ఎఱ్ఱయగారి అప్పటమైన భక్తిభావము అందాలు దిద్దుకొన్నది. ఆ మహాకవిలో ఉన్న గొప్ప తనము ఏమనగా నిగ్రహ శక్తి. తాను శంభుదాసుడైనను, శివుని ప్రస్తుతించు అవకాశము కలిగినను అదే పనిగా పార్వతీ పతిని ప్రస్తుతింపలేదు. ఆ చేసిన స్తుతి కూడ నిరాడంబరముగాను, భక్తి ప్రధానముగాను ఉన్నది.

నాచన సోమన చేసిన స్తవమున బహుముఖమైన ఆయన విజ్ఞానమును ప్రౌఢోక్తియు ప్రధానముగా కనిపించును. కాని కొన్ని చోట్ల ఆయన చేసిన రచనను చూడగా, ఎంత ప్రౌఢముగా చెప్పగలడో అంత లలితముగా కూడ చెప్పగలశక్తి ఆయన కున్నట్లు తెలియకపోదు. ఈ పద్యమును పరిశీలింపుడు:

'నీ యంద జనియించె, నీయంద నిఖిలంబు
నడగె, నీ వాది మధ్యాంతమగుట
నేను నీవన, నీవ నేనన వర్తింతు
మిరువుర శబ్దార్థ మేకరీతి
నీ నామములు నాకు, నా నామములు నీకు,
నీకు చేసిన పూజ నాకు పూజ,
నిన్ను నొల్లని వారు నన్ను నొల్లని వార,
లెచ్చట నీ యునికి నా కచట ననికి.

చెల్లినది చెల్లుచున్నది చెల్లనున్న
యది సమస్తంబు నీవ, నీ కనభి గమ్య
మేదియును లేదు వేదంబు లెఱుగునవియు
నీవ, నా నమస్కారంబు నిన్ను జేరు.'

శివుడు కృష్ణుని ప్రస్తుతించిన విధ మిది. శివకేశవు లిద్దరును ఒక్కరే అనియు, భిన్నులు కారనియు తేట తెలుగు మాటలతో వివరించుచున్న, ఈ పద్యము హృదయ రంజకముగా ఉన్నది.

నాచనసోముడు వర్ణనాపరుడైన కవిగా కనిపించును. మూలమునందలి కథలను తు. చ. తప్పకుండ చెప్పుటకు ఆయన యత్నించలేదు. అసలు ఆయన ఉద్దేశము అది కాదేమో అనిపించును. ఎందుకనగా, మూలమును ఆయన యథాతథముగా అనుకరించలేదు. అందులో కొన్ని కథలను మాత్రమే స్వీకరించినాడు. ప్రథమాశ్వాసములో నరకాసుర వధ, రెండవ ఆశ్వాసమున విప్రకుమార రక్షణ, ఘంటా కర్ణుని వృత్తాంతము మొదలైనవి, మూడవ ఆశ్వాసములో

పౌండ్రక వాసుదేవుని వధ, చతుర్థాశ్వాసములో హంసడిభకుల కథ, అయిదారు ఆశ్వాసములలో బాణాసుర వృత్తాంతము, ఉషాపరిణయమును వర్ణింపబడినవి.

ఎఱ్ఱన హరివంశము పూర్వభాగము తొమ్మిది ఆశ్వాసముల గ్రంథము, యయాతి మహారాజు కథ, కాలనేమి వృత్తాంతము, కృష్ణుని బాల్య క్రీడలు, కంస వధ మొదలైనవి పూర్వ భాగములో చోటు చేసికొనిన కొన్ని కథలు, ఉత్తర భాగములో పది ఆశ్వాసము లున్నవి. వీనిలో జరాసంధుని కథ, రుక్మిణీదేవి పరిణయము, నరకాసుర వృత్తాంతము, ఘంటాకర్ణుని కథ, కృష్ణుని కైలాస సందర్శనము, బాణాసురుని కథ మొదలైనవి చెప్పబడినవి. కాని ఎఱ్ఱన హంస డిభకోపాఖ్యానమును వ్రాయలేదు. నాచన సోమనాథుడు జరాసంధుని వృత్తాంతము, రుక్మిణీ పరిణయము మొదలైన కథలు చెప్పలేదు.

ఇటుల మూలమునంతటినికాక, అందలి కొన్ని కథలను మాత్రమే గ్రహించి ఒక ప్రత్యేక కావ్యమును వెలయించిన కవులలో సోముడు ప్రథముడు. సోముడు నపేక్షించిన గుణ సనాథుడని కీర్తి వహించుటకు కారణములలో కావ్యనిర్మాణమునకు సంబంధించిన, ఈ నూతన ప్రక్రియ కూడ ఒకటి కావచ్చును. ఈ ప్రక్రియ తరువాతి కవులను బహుళముగా ఆకర్షించుటవలననే ప్రబంధము లెన్నో ప్రచారమునకు వచ్చినవి.

కథాగత విషయములను వివరించుటలో ఎఱ్ఱన సోమనల వైఖరులలో కొంత భేదము కనిపించుచున్నది. ఉదాహరణమునకు ఊర్వశీ నరకాసురుల సంభాషణ ఎఱ్ఱన హరివంశములో రెండు పద్యములలో పూర్తికాగా, ఈ కథా ఘట్టము సుమారు ముప్పది పద్య గద్యములలో సాగినది, సోముని ఉత్తర హరి

వంశములో. ఎఱ్ఱన కథనములో గాంభీర్యము కనిపించుచున్నది. కాసి సోమునికి రచనలో సరసత్వము కనిపించదు. ఎంత రాక్షసుడైనను, నరకుడు నలుగురిలోను అంత సభ్యతారహితముగా మాటలాడియుండునా అనిపించును.

ఈ కథాఘట్టమును పురస్కరించుకొని సోమనాథుని కవితను మరీ తూర్పారపట్టుట భావ్యము కాదని నా అభిప్రాయము. ఎందుకనగా, కొన్ని ఘట్టములలో ఆయన కథను నడిపించిన తీరు, ఆయా భావములను కండ్లకు కట్టినట్లు చెప్పిన పద్ధతియు కొనియాడదగినవి.

హరివంశములోను, ఉత్తర హరివంశములోను పౌండ్రక వాసుదేవుని కథ ఇంచుమించు ఒకేవిధముగా నడిచినది. పౌండ్రుడు 'విహీన వివేకతజేవ' యెక్కినవాడు - అని సోమన మొదటనే చెప్పుట సరసముగా ఉన్నది. బలగర్వితుడైన ఆ భూపతి ఎటువంటివాడో మన మూహించుకొనవచ్చును, ఈ మాటలనుబట్టి.

పౌండ్రుడు స్వోత్కర్ష చేసికొనుచున్న సమయములో అచ్చటికి నారదుడు విజయంచేయును. ఆయన రాకను సోముడు ఇటుల దర్శించినాడు:

'ప్రాలే యాంశు మరీచినిర్మలతనూ
భాగంబు, గృష్ణాజిన
వ్యాలోలామల యజ్ఞసూత్రములు,
సంసాసక్త వీణాలతా
లాలిత్యంబు లలాటికారుచులుఁ
గ్రాలన్ నారదుఁ డిచ్చటుఁ

గైలాసంబున నుండి వచ్చెఁ గలహో
త్కస్వాంతు డచ్చోటికిన్.'

సోమనది ప్రౌఢోక్తియే అయినను, ఈ వర్ణన హృద్యముగా ఉన్నది. నారదుడు మన కండ్ల ఎనుట సంచరించుచున్నట్లే కనిపించును. అంత సజీవముగా ఉన్నది యీ వర్ణన. ఇక ఎట్టిన చెప్పిన పద్యమును పరిశీలింతము.

'చారు శరీర ద్యుతిజిత
శారద నీరదుడు, ధీవిశారదుడు, భవో
త్తారకు డాశ్రిత వితతికి
నారదుడు తదీయగృహమునకు నేతెంచెన్.'

సహజ సౌందర్యమును సంతరించుకొన్న, ఈ పద్యము నారదుని బాహ్యస్వరూపమునేకాక, ఆయన మనస్సును కూడ తెలియ జేయుచున్నది. భవోత్తారకుడు ఆశ్రిత వితతికి నారదుడు—అనుటలో విశేషమున్నది. ఆశ్రితులకు అయన భవోత్తారకుడు. కానివారికి కయ్యాలక్రచ్చ. అటులనే శివుని గురించి చెప్పుచు 'సద్భూతిదుడవు నమ్రులకు' అనును ఎట్టిన.

సూటిగా హృదయమునకు హత్తుకొనునట్లు చెప్పుటలో ఎట్టినది పైచెయ్యి. సోమన వర్ణన కూడ గుండెను కదిలించునట్లు ఉండును. కాని అలంకారికముగా చెప్పుటలో ఎట్టినకు చాల ఇష్టమని చెప్పనచ్చును. మూర్తిని కండ్లకు కట్టునట్లు వర్ణించును. ఇందుకు నిదర్శనముగా, ఈ ఇద్దరు మహా కవులు చేసిన అరుణోదయ వర్ణనమును పేర్కొనవచ్చును. 'దీప రుచులతోడ తిమిరంబు దోడ్తోడఁ దలగ... తెల్లనయ్యె తూర్పు దిక్కు—' అని అతి సహజముగా ఎట్టిన వర్ణింపగా, కనుల పండువైన

భానుబింబమును వీనుల విందుగా చిత్రించినాడు సోమన, 'కుంకుము హస్తించి కొనగోరదీర్చిన పురుహూతు నిల్లాలి బొట్టు నంగ' అను పద్యములో.

ప్రకృతి దృశ్యములనే కాక మానవ ప్రకృతిని వివరించుటలో కూడ సోముడు చూపిన నైపుణి ప్రశంసార్హము. కృష్ణుడు హంసుని యమునా జలములలో అడుగంట త్రొక్కినపుడు, ఆ విషాద దృశ్యమును చూచి సహించలేక, అతని తమ్ముడు డిభకుడు ప్రకటించిన వివిధ భావములు సహజముగా ఉండుటయే కాక హృదయమును ఆర్ద్రము చేయుచున్నవి కూడ. డిభకుడు మూఢుడే కావచ్చును. కాని అతని భ్రాతృ ప్రేమ ఎంతైన కొనియాడదగినది. అతని దీనావస్థను సోముడిట్లు వర్ణించినాడు:

'వ్రేలెడు వెండ్రుక లిరుగడ
దూలగ దలయూచు తొప్పు తొప్పున నోరుం
గేల నడచికొను సెలవుల
లాలలు దొరుగంగ నన్న లాయని యెఱిలున్.
కేలం దల యడచికొనున్
నేలంబడి పొరలు లేచు నెత్తురు లుమియుం
గేలిబడి గిపులు చూడగ
నాలుక పెరికికొనుఁ, జావునకుఁ దన్నికొనున్.'

హంసడిభకోపాఖ్యానము హరివంశములో లేకపోవుట మన దురదృష్టమే!

ఇక చపీ చకఁన గల తెలుగు పలుకుబడులు, సామెతలు మొదలైన వానిని వాడుటలో, ఈ కవులిద్దరును సిద్ధహస్తులే.

ఒక్క మాటలో చెప్పవలెనన్నచో, ఈ రెండు కావ్యములు తెలుగు సాహిత్యములో స్థానము సంపాదించుకొన్న గొప్ప రచనలు. మాతృక బహుశః ఒక్కటే అయినను వీరి రచనలలో భేదము కనిపించుచున్నదనగా, అందులకు కారణము వీరి దృష్టి భేదము కావచ్చును.

పాల్కురికి సోమనాథుని తమిళ భాషా వైదుష్యము

మహాకవి పాల్కురికి సోమనాథుడు బహుభాషాభిజ్ఞుడు. ఆనాళ్లలోనే కాదు, ఈ రోజులలో కూడ, ఆయనవలె బహు భాషాభిజ్ఞులైన పండిత కవులు చాలమంది కనిపించరు.

వృషాధిపశతకములో సోమనాథుడు సంస్కృతాది పెక్కు భాషలలో 'బసవా, బసవా, బసవా, వృషాధిపా' అనుచు పరమశివుని ప్రస్తుతించిన విషయము సాహితీ జిజ్ఞాసువులకు తెలిసినదే. ద్రావిడభాషలో ఆ మహాకవి యిటుల స్తుతించినాడు:

'పరమనె యన్నెయాండవనె పన్నగతానె యనాథనాథనే
పెరియవనే పుళిందవనె పేరుడయానె పిరానె యప్పనే
తరిమురియయ్యనే యనుచు ద్రావిడభాష నుతింతు మన్ననో
వర కరుణావిధేయ బసవా బసవా బసవా వృషాధిపా.'

ఈ పద్యములో ప్రయుక్తములైన తమిళ శబ్దము లన్నియు శివపరముగా చెప్పబడినవని స్థూలదృష్టికి కూడ తెలియకపోదు.

కాని కొన్ని శబ్దముల స్వరూపము తెలుగులో కొంతవరకు మారిపోవుటచే, పద్యము సరిగా అర్థమగుటలేదు. అయినను, చిన్ని మార్పులతో చెన్నైన అర్థములను సాధింపవచ్చును. ఉదాహరణమునకు, పుళిందవనె అన్నప్పుడు తమిళమునగాని తెలుగునగాని అర్థము స్ఫురింపదు. పొలిందవనె అన్నచో ప్రకాశించుచున్నవాడా! అను చక్కని అర్థము తమిళమున స్ఫురించును. అటులనే పన్నగత్తానె అన్నప్పటికంటె పన్నగత్తానె అనుచో నాగభూషణుడా అని స్పష్టముగా అర్థమగును. కాని యీ మార్పువలన ఛందోభంగ మేర్పడుచున్నది. అయినను, సులభముగా అర్థమగుటకు, ఈ పద్యము నీ క్రింది విధముగా సంస్కరింపదగును:

పరమనె, ఎన్నైన్న ఆండవనె, పన్నగత్తానె, అనాథనాథనే, పెరియవనే, పొలిందవనె, పేరుడైయానె, పిరానె, అప్పనే, తరిమురియయ్యనే (?) . . .

పరమనె = శివుడా లేక పరమాత్ముడా
ఎన్నైన్న ఆండవనె = నా పాలి దైవమా
పన్నగత్తానె = నాగభూషణుడా
అనాథనాథనె = దిక్కులేనివారికి దిక్కుగా నుండువాడా
పెరియవనె = మహాత్ముడా
పొలిందవనె = ప్రకాశించుచున్నవాడా
పేరుడైయానె = జ్ఞానసంపన్నుడా
పిరానె = ఈశ్వరుడా
అప్పనె = తండ్రీ
తరిమురి యయ్యనే = (సరిగా అర్థమగుట లేదు. తమిళ శైవ గ్రంథములలో ఒక చోట 'తరియేన్, ముడల్వా!' అని గలదు. పరమాత్ముడా! నేను భరింప లేను—అని ఇందుకు అర్థము చెప్పవచ్చును. 'తరియేన్' తరిమురి అయ్యెనేమో!)

పండితారాధ్య చరిత్రలో[1] కూడ ఎనిమిది తమిళ ద్విపదలు చోటు చేసికొన్నవి. ఆనాటి తమిళ భక్తులు శ్రీ శైల మల్లికార్జునుని ఎటుల స్తుతించిరో తెలిసికొనుట కీ పదునారు పంక్తులు బహుధా తోడ్పడుచున్నవి. ఈ ఉద్గ్రంథం మిప్పటికి మూడుసార్లు ప్రచురింపబడినది.

‘అరులు గిరితియెన్నె యరనే పిరానె
చిరిగిరి నిలయనే చివనె యాణ్డవనె
అంగమాఱుందానె యా యిరుందవనె
మంగయర్ పాంగనే మల్లికార్జునన
యానునక్కడియనే నఖిలనాయకనె
యేనమిల్లాలా(దా)నె యిల్లవిల్లియనె
అఱువత్తుమూవరు క్కాత్తనాయకనె
మఱునాలు మరియాద మలికారునన
ఆలాలగండనే యాది యత్రనె
చూలియే మల్లికార్జుననె యాణ్డవనె
యెల్లయిల్లాదానె యెజ్గుముళ్లనన
చొల్లనల్లాదానె మల్లికార్జుననె

---

[1] పండితారాధ్య చరిత్రను తొలుత శ్రీ శివగర్భవర్ధనీ గ్రంథమాలవారు (వరంగల్) 1909లో ప్రకటించినారు. పిమ్మట విశాఖపట్టణములో విజయ రామచంద్ర ప్రెస్సువారు 1914లో ప్రచురించినారు. (పరిష్కర్తలు: శ్రీయుతులు పసుపుల నాగయోగి, నిడుదవోలు సుందరంపంతులు గారలు). అటుపిమ్మట 1939లో ఆంధ్ర గ్రంథమాలవారు పండితారాధ్య చరిత్రను ప్రకటించినారు. (పరిష్కర్త: డాక్టర్ చిలుకూరి నారాయణరావుగారు). ఈ మూడింటిలోను ఆంధ్ర గ్రంథమాలవారిదే ప్రశస్తమైన ప్రచురణ మనుట నిర్వివాదము.

ఆఱుమ్మిడత్తిరు నీఱుముళ్లవనె
యేఱేఱుమిూచనె యెల్లమల్లయనె
వేదియరు తుదిక్క మాదిదేవ చివనె
చోదియే మల్లికార్జుననె యన్నవనె.'[1]

'పరమనె . . .' పద్యములోవలె, ఈ ద్విపద భాగములోని తమిళశబ్దము లన్నియు శివపరముగా చెప్పబడినవే. కాని కొన్ని శబ్దములు సులభముగా అర్థమగుట లేదు. ఉదాహరణమునకు, 'మఱునాలు మరియాద మల్లికార్జుననె' అను పాదమును పరిశీలింతము. శివ ధర్మవర్ధనీ వారి ప్రచురణలో 'మరునాలు మరియాతె మల్లికార్జుననె' అనియు, విజయరామచంద్ర ప్రెస్సువారి ముద్రణములో 'మరణలు మరియాత మల్లికార్జుననె' అనియు గలదు ఇటుల ఈ పాదము మూడు ముద్రణములందును మూడు విధములుగా గ్రహింపబడినది. కాని యిది 'మఱైనాలు మఱియాద మల్లికార్జుననె' అని ఉండవలెను. అప్పుడే అర్థము కుదురును. తమిళములో మఱై అనగా వేదము. కాగా, నాలుగు వేదములకును తెలియని మల్లికార్జునుడా (వేదాతీతుడా) అని పై పాదమునకు అర్థము చెప్పవచ్చును. 'మఱైనాలు' అని వాడినచో ఛందోభంగమగును గావున సోమనాథుడు బహుశః 'మఱనాలు' అని వాడియుండవచ్చును. మఱనాలు మఱైనాలునకు సన్నిహితముగా ఉన్నది. కాని యిది కాలక్రమమున మరునాలు, మరణలు మొదలగు రూపాంతరములు పొందెనని భావింపవచ్చును. స్పష్టముగా అర్థమగుటకుగాను పై ద్విపదభాగమును ఈ క్రింది విధముగా సంస్కరింపదగును:

---

[1] ఆంధ్ర గ్రంథమాలవారి ప్రచురణము.

'అరుళుది యెన్నై అరనే, పిరానె
చి(సి)రిగిరి నిలైయనె చి(శి)వనె, ఆణ్డవనె
అంగ మాఱుందానె యూ యిరుందవనె
మంగయర్ పంగనె మల్లికార్జుననె (లేక)
మంగయోర్ పాగనె మల్లికార్జుననె
యూనుక్కడియనే నకిలనాయకనె
యేన విల్లాళనే యిల్లమిల్లియనె
అఱునత్తుమూవరు క్కాత్తనాయకనె
మఱైనాలు మఱియూద మల్లికార్జుననె
ఆలాలకంటనె ఆదియట్రననె
చూలియె మల్లికార్జునన యెన్నవనె
యెల్లైయిల్లాదానె యెఱ్ఱుముళ్ళవనె
చొల్లవల్లాదానె మల్లికార్జుననె
ఆఱుమిడత్తిరు నీరు ముళ్ళనె
యేఱేఱు మీచ(శ)నె యెల్లమల్లయనె
వేదియరు తుదిక్కు మాదియే చి(శి)ననె
చోదియే మల్లికార్జునన యెన్ననన.

[1]అరనే = శివుడా
పిరానె = ఈశ్వరుడా (నా విభుడా)
అరుళుది యెన్నై = నన్ననుగ్రహింపుమయ్య (కృపామతిం బ్రోవు మయ్య)
చిరిగిరి నిలైయనె = శ్రీగిరి నిలయుడా
చివనె = శివుడా
ఆణ్డవనె = భగవంతుడా లేక ఈశ్వరుడా
అంగమాఱుం... = షడంగములు నీవయై యుండువాడా
మంగయర్ పంగనే = అర్ధనారీశ్వరుడా
లేక

మంగయోర్ పాగనే = గంగాధరుడా

యానునక్కడియన్ – నేను నీ భృత్యుడను

ఇల్లమిల్లియనె = (సరిగా అర్థమగుటలేదు. కాని యిట్లు ఊహింప వచ్చును: ఇల్లం + ఇల్లియనె = ఇల్లూ వాకిలి లేనివాడా)

అయువత్తు . . . = అయువది మున్నూరకు (నాయన్మారులకు) ఇష్టదైవమైన వాడా

మఱైనాలు . . . = వేదాతీతుడా

ఆలాలకంటనె = హాలహాలకంఠుడా లేక గరళకంఠుడా

ఆది యట్రవనె = అభవుడా

చూలియే = శూలము ధరించినవాడా (శూలపాణి)

ఎన్నవనె = నా విభుడా

ఎల్లె యిల్లాదవనె = ఆద్యంత రహితుడా

ఎంగుమ్మిళ్లవనె = సగ్వాంతర్యామివై యుండువాడా

చొల్లవల్లాదానె = వర్ణించుటకు అలవికానివాడా

ఆయుమ్మిడత్తిరు . . . = (సరిగా అర్థమగుటలేదు—తిరునీఱనగా విభూతి; ఆయు అనగా గంగ; కనుక గంగను, విభూతిని ధరించినవాడా అని అర్థము చెప్పనచ్చును)

ఏఱుయిమీచనె = వృషభవాహనుడా

ఎల్ల = ప్రకాశించుచున్నవాడా

వేదియర్ (ఱు) = వేదవిదులైన బ్రాహ్మణులు

తుదిక్కుం = స్తుతించు

ఆదియే = ఆదిదేవుడా

చోదియే = జ్యోతిర్మయుడా[1]

సోమనాథుని గ్రంథములలో కానవచ్చు కొన్ని పదబంధములను, కథలను పరిశీలించిన, ఆ మహాకవికి సంస్కృతాంధ్ర

---

[1] కొన్ని తమిళ శబ్దములకు చక్కని అర్థములు సూచించిన తమిళ విద్వాంసులు డా॥ యం. రాజమాణిక్కం, శ్రీ యం. షణ్ముఖం పిళ్లై గారలకు కృతజ్ఞుడను.

కర్ణాటక భాషలందే కాక తమిళమునందును వైదుష్యము గల దని తేటతెల్లమగును. కనుకనే పాల్కురికి సోమనాథుడు బహు భాషాభిజ్ఞుడైన మహాకవి యనుట!

శ్రీ నాథ మహాకవి

తెలుగు సాహిత్యములో పండిత ప్రకాండులు, ప్రతిభా సంపన్నులైన కవులెందరో కనిపించెదరు. వారిలో ఏదో ఒక విశిష్టత కూడ గోచరించుచునే యుండును. కాని ఒకే వ్యక్తిలో ఎన్నో విశిష్ట గుణములు అందాలు దిద్దుకొనుట అన్నది అపూర్వ విషయమని పేర్కొన నెచ్చును. ఏ యుగ ముకైనైనను సరే, అట్టి వ్యక్తులు చాలమంది ఉండరు; కొద్ది మంది మాత్రమే కనిపింతురు. ఆ కొద్ది మందిలో ఒకడు కవి సార్వభౌమ బిరుదాంకితుడైన శ్రీనాథుడు.

శ్రీనాథుడు ఉద్దండ పండితుడు. మహాకవి. ప్రముఖ రాజోద్యోగి. ప్రౌఢ కావ్యనిర్మాత. యుగకర్త. నిర్ఝరాంభఃప్రవాహమువలె కవిత చెప్పి ఉక్కిరి బిక్కిరి చేయును. సులభ సుందరముగా కవిత చెప్పి కమ్మతేమ్మెరల హాయిని కలిగించును. అయఃపిండమును కృష్టింపగలడు; అమృత కలశమును కూడ అందింపగలడు. అంత వైవిధ్య మున్నది శ్రీనాథునిలో. ఆయన కవులకవి. ప్రజలకవి. పైపెచ్చు ఆత్మ ప్రత్యయముగల మహోన్నతి. ఎంత ఆత్మ విశ్వాసము లేకున్న, కిడగండ్లతో పోరాడినను అవసాన కాలములో 'దివిజకవివరు కండియల్ దిగ్గురనగ నరుగుచున్నాడు శ్రీనాథు

డమర పురికి' అని చెప్పగలడు? సామాన్యుడైనచో ఇంత గుండె దిటవును ప్రదర్శించి యుండలేడు. వచ్చిన కష్టములకు క్రుంగి కృశించిపోయి యుండెడివాడు. పీనినన్నిటిని పరిశీలించినప్పుడు గాని ఆ మహాకవి వ్యక్తిత్వము చక్కగా వ్యక్తము కాదు.

కవి సార్వభౌముడు పది పండ్రెండు రచనలు చేసినట్లు చెప్పబడుచున్నను, అవి యన్నియు పూర్తిగా మనకు లభింపక పోవుట శోచనీయము. పస్తుతము లభ్యమైన వానిలో పేర్కొన దగినవి శృంగారనైషధము, హరవిలాసము, భీమ ఖండము, కాశీఖండము మొదలైనవి. భీమఖండ కాశీఖండ ములు క్షేత్ర మాహాత్మ్య గ్రంథములు. శృంగార నైషధము హర్షుని కృతికి తెలుగు. హరవిలాసమును స్వతంత్ర రచన మనవచ్చును. ఇవికాక శ్రీనాథుడు చెప్పిన చాటుపద్యములు చుబ్బన చూరలు. ఆయన వ్యక్తిత్వము వీనిలో సైతము కనిపించుట పేర్కొన దగిన విషయము. ఇదే శ్రీనాథుని ప్రత్యేకత. అదేపనిగా సంతరించిన ప్రౌఢ కావ్యములలోను, అలవోకగా చెప్పిన చాటువులలోను శ్రీనాథుని ముద్ర కొట్ట వచ్చినట్లు కనిపించుచునే యుండును. శ్రీనాథుడు ఎంత ఉద్దండ పండితుడో అంత ఉద్దండుడైన కవి. ఆయనే చెప్పు కొన్నట్లుగా ఉద్దండ లీల, ఉభయ వాక్ప్రౌఢి, రసాభ్యుచిత బంధనము, సూక్తి వైచిత్రి మొదలైనవి ఆయన రచనలలో కనిపించును. ఇవి శ్రీనాథుని కవితా లక్షణములని పేర్కొన వచ్చును. కాని శ్రీనాథుని రచన అనుసరికి స్ఫురణకు వచ్చు మొదటి అంశము ఆయన అపూర్వమైన శైలి. చాలమంది ప్రాచీనాంధ్ర కవులవలె ఆయనది కూడ సంస్కృతపదభూయిష్ఠ మైనదే; దీర్ఘ సమాసములతో నిబిడీ కృతమైనదే. కాని ఆ

ప్రౌఢోక్తిలో కూడ ఏదో ఒక సొగసు కనిపించుచుండును. వట్టి నారికేళ పాకముగా తోచదు. హర విలాసములో షట్కాలశివ పూజా నిరతుడైన అగ్నిని మనోజ్ఞముగా వర్ణించినాడు. ఈ పద్యమును చదువుడు:

పంచ బ్రహ్మషడంగ బీజసహిత ప్రాసాద పంచాక్షరీ
చంచన్మంత్ర పరంపరా పరమ నిష్ఠాతత్పరత్వంబునన్
మంచుంగొండయనుంగు బెండ్లి కొడుకుక్

మధ్యాహ్నకాలంబునే
వించున్నిర్జర రాజసూనుడు మనోవీథీ సదాధ్యాసితన్.

రెండు పాదముల సంస్కృత సమాసమునకు పిమ్మట, మంచుంగొండ యనుంగు బెండ్లి కొడుకుక్ అను తెలుగు మాటల కూర్పు కనిపించుటతో రచనకొక సోయగము నేర్పడినది. ఇక్కడ పెండ్లి కొడుకు అనగా అల్లుడని అర్థము. ఈ అర్థము ఈనాము తెలుగు దేశములో ప్రచారములో లేకపోయినను, తమిళ నాడులో మాత్రము అల్లుడనెడి అర్థమున పెండ్లికొడుకు వాడబడుచున్నది. బహుశః శ్రీనాథుని కాలములో ఈ శబ్దము ఈ అర్థములో వాడుకలో ఉండియుండ వచ్చును. కనుకనే లోకజ్ఞుడైన ఆ మహాకవి, యీ మాటను తన కావ్యములో వాడి యుండను వచ్చును. ఎన్నో వల్లెలు, పట్టణములను తిరిగిన దేశ సంచారియు, పెక్కుచోట్లనుండి యేతెంచు పండితులతో చర్చలు సాగించిన విద్యాధికారియు నగుటచే, శ్రీనాథునికి కండగల తెలుగు పలుకుబడియు, నుడికారమును బాగుగా తెలియును. కాగా, కవి సార్వభౌముడు ప్రౌఢముగ రచన సాగించినను, అందు కొన్ని చోట్ల తెలుగు పలుకుబడియు,

నుడికారమును చోటు చేసికొనినవి. ఈ విషయమును శ్రీనాథుడే ఇటుల వినరించినాడు.

'ప్రౌఢి బరికింప సంస్కృత భాషయండ్రు
పలుకు నుడికారమున నాంధ్ర భాషయండ్రు
ఎవ్వరేమండ్రుగాక నా కేటికొరత
నా కవిత్వంబు నిజము కర్ణాట భాష.'

శ్రీనాథుని భాషా వైదుష్యమునకును, శాస్త్ర పరిజ్ఞానమున కును కాశీఖండము పట్టుగొమ్మ అయినను, కవితా మాధుర్య మునకు శృంగార నైషధమును ఉదాహరణముగా పేరొక్కన వచ్చును. శ్రీనాథునికి ముందు తెలుగులో వెలుగులోనికి వచ్చిన రచనలు పురాణేతిహాసములు. ఇవి కథా ప్రధాన ములు. కాని కావ్యములో అర్థ మెంత ముఖ్యమో, శబ్దము కూడ అంత ముఖ్యమైనదే. అందులోను ప్రౌఢ వాక్యాటవ మున భట్టహర్షుడు రచించి బుధలోక హితమును పొందినట్టి నైషధ సత్కావ్యమును తెనుగు చేయుట ఉభయ వాక్ప్రౌఢిగల ఒక్క శ్రీనాథ మహాకవికే చెల్లినది. నారికేళపాక మనగా ముఖము చిట్లించు కొనెడు సోమరి పోతు లా కావ్య మును కొనియాడ లేకట! ఇటువంటి ప్రౌఢ రచనను అనువ దించుటకు ముందు ఆ మహాకవి తత్కావ్యానువాదమును గురించి తనలో తాను చర్చించుకొనియుండును. చివరికి కొన్ని నియమములు చేసికొని, ఆ తర్వాత రచనకు దిగి యుండును. శబ్దము ననుసరించియు, అభిప్రాయము గురించియు, భావము నుపలక్షించియు, రసమును పోషించియు, అలంకారమును భూషించియు, ఔచిత్యము నాదరించియు,

అనౌచిత్యమును పరిహరించియు మాతృకాను సారముగ రచన సాగింతునని ఆయన పేర్కొన్నాడు. తనకు అనౌచిత్యములుగా తోచిన భాగములను, శబ్దములను పరిహరించియు, కొన్ని శ్లోకములను కుదించియు, మరి కొన్నిటిని విస్తరించియు శ్రీనాథుడు రచన చేయుటవలన, శృంగార నైషధమును, అను వాదమైనను, యథామాత్మక మని చెప్పలేము. మన ప్రాచీన కవులు, తెలుగులోను తమిళములోను, కథను అనువదించి నారుగాని ప్రతి మాటను పరినర్తింపలేదు. ప్రతి పద పరినర్తనము వారి లక్ష్యము కాదేమో!

కవిత్రయము వారి దృష్టి ప్రధానముగా కథ మీద కేంద్రీకృతముకాగా, శ్రీనాథుని చూపు కథమీదను, ఆయా శ్లోకముల లోని కొన్ని శబ్దముల మీదను కేంద్రీకరించినది. అందు వలననే మూలమునందలి కొన్ని శబ్దములను, సమాసములను తెనుగు సేతలో కూడ అటులనే ఉంచినాడు. అనువాదము నందును అని అటులనే యుండుట మంచిదని అభిప్రాయపడి శ్రీనాథు డీ పనిచేసియుండును. మహాకవియు, ప్రముఖ పండితుడును పైపెచ్చు మూలమునకే మెరుగులు దిద్దగల ప్రతిభావంతుడు నయిన శ్రీనాథ మహాకవిని డుస్సువుల కవిగా భావించుట భావ్యము కాదు. ఆయన కమ్మని కవితకును, తెలుగు నుడికారపు సొంపునకును, చక్కని భావ సంపదకును ఈ పద్యము తార్కాణము:

ఁతల్లిమదేక పుత్రక, పెద్ద, కన్నులు
గాన విప్పుడు, మూడు కాళ్ల ముసలి
యిల్లాలు గడుసాధ్వి, యేమియు నెఱుగదు
పరమపాతివ్రత్య భవ్యచరిత

వెనుక ముందర లేరు నెనరైన చుట్టాలు
లేవడి యెంతేని జీవనంబు
గానక కన్న సంతానంబు శిశువులు
జీవన స్థితి కేన తావలంబు
కృప దలంపగదయ్య యో నృపవరేణ్య.'

పద్యపు చెత్తుగడలో శ్రీనాథుడు ప్రదర్శించిన ప్రజ్ఞకును, శ్రద్ధకును, 'అడిగితి నొక్కనాడు కమలాసను తేరికి వారు వంబనై,' (శృం. ఆ. ౫౮) 'నీ యంతఃకరణంబు నిర్మలము, వర్ణింపంగ శక్యంబె నీ భూయస్త్వంబు. . (శృం. ర-౧౧౭) 'తూనిగలాడ జొచ్చె దివి ధూళి భ్రమింపగ జొచ్చె. (హర ౭-౬౩), 'ఏమో నా హృదయంబు నిన్నుగని యిట్లిచ్చా పరాధీనమై' (హర ౭-౬౩) మొదలైన పద్యముల నెన్నింటినో ఉదాహరింపవచ్చును ఆయన చేతిలో సీసము సంతరించుకొన్న అందచందాలు అనవద్య హృద్యములు. వృత్త రచనలో నైపుణ్యము ఆయన ఉద్దండుడు. ఇంత ప్రతిభావంతుడైనను శ్రీనాథుడు కథా కథనములో తగినంత శ్రద్ధ వహించలేదని ఒక అభిప్రాయము పండిత లోకములో ఉన్నది. ఇది నిజమే. అతనిని, స్వతంత్ర రచన మనదగిన హరవిలాసములో కొన్ని చోట్ల శ్రీనాథుని కథా నిర్వహణ సహృదయ రంజకముగా ఉన్నది. ఇందుకు నిదర్శనముగా చిమతొండ నంబి కథను పేర్కొన వచ్చును.

శ్రీనాథునికి ముందే హృదయమును ఆర్ద్రము కావించునట్టి యీ కథను పాల్కురికి సోమనాథుడు తన బసనపురాణములో మనోజ్ఞముగా అభివర్ణించినాడు. సోమనాథుని కథనే

శ్రీనాథుడు కూడ అనుసరించినాడు. కాని గుడ్డిగా అనుసరించ లేదు.

వృద్ధ శివయోగి వేషములో అనుదెంచిన పరమశివుడు తన నిరాహార వ్రతమును గురించి వివరించుచు, ఆ వ్రత సమాప్తికి నరపశువు కావలయునని అడుగును. అతడు చాల చిన్నవాడై, రోగశంకా విహీనుడై యుండవలెను. రూపసిగా కూడ నుండవలెను. అంతేకాక అతనిని అతని తలిదండ్రులు, పాకముచేసి వడ్డింపగా ఆ మాంసమును గృహ మేధియు, అతని కుమారుడును ఆరగింపవలెను. ఇందుకు సరే అన్నాడు చిరుతొండడు. అన్నట్లుగా వంటయు, వడ్డనయు జరిగినవి. అప్పుడా శివయోగి, 'పిన్నవాడు బంతి భోజనంబు సేయక నాకు కడి నోరికిం బోదు' అన్నాడు. ఆ తర్వాత చిరుతొండనంబి భార్య తిరువెంగనాచి కుమారు నుద్దేశించి యిట్లు పిలిచెను. కథ సుఖాంత మగును.

'రారా వణిగ్వంశ పారాశి హిమధామ
రారా వికస్వరాంభోరుహాక్ష
రారా మహాఘోర వీరశైవాచార
రారా ఘనౌదార్య రాజరాజ.

* * * *

రారా మనోహరాకార రూప విలాస
రారా యసార సంసార దూర
రారా నాచిన్ని వడుగ, రారా తనూజ రారా
సిరియాల, రారా నా ప్రాణ పదమ రారా నాకుర్ర,
నాజియ్య రార.'

* * *

తిరువెంగనాచి మాటలలో మాతృ ప్రేమ మూర్తీభవించినది. కాని సోమనాథుని రచనలో భక్త్యావేశము పొంగులు వారినది. కొన్ని ద్విపదలలో ఉదాత్త భావములు కూడ చోటు చేసికొన్నవి. ఈ ద్విపదలు వినుడు.

'పూర్వ జన్మార్జిత భూరికర్మములు గుర్వగించు నాకొడుక,
రావయ్య దివిజకన్యకలతో దివి ముక్తికన్య కవయనున్నది భక్తి
క్షాంతుండ రావె.'

శ్రీనాథునిది కరుణ రసాత్మకమైన రచన. మొత్తముమీద ఈ మహా కవులిద్దరును ఈ ఘట్టమును చక్కగా చిత్రించినను, తల్లిని ప్రేమమూర్తిగా చిత్రించుటయే సహజ సుందర మనిపించును. అంతేకాక శ్రీనాథుని వృద్ధ శివయోగి ఒకప్రక్క చిరుతొండని భక్తినేకాక అతని కుమారుని భక్తిని కూడ పరీక్షించును. అటులనే పార్వతి జోగెత వేషమును ధరించి తిరువెంగనాచి భక్తిని పరీక్షించినది. ఈ వివరములు బసవ పురాణమునందుగాని, శివభక్తుల జీవిత వృత్తాంతములను తెలియజేయు పెరియపురాణ మను తమిళ కృతిలోగాని లేవు.

సోమనాథుని చిరుతొండడు కైలాసమును చేరుకొన్న తర్వాత తనవలె తొలుత తనయుని అర్పించి, తిరిగి పొందిన భక్త శిఖామణి మరియొకడు లేడని తనలో తా ననుకొనును. అటుల మది నెంతయు గ్రొవ్వి తానహంకరించి చిరుతొండడు ఉండగా, అప్పుడు శివుడాతనిని భక్తురాలైన నిమ్మవ్వ యొద్దకు తీసికొని పోవును.

చిరుతొండని కథకు కళంకముగా నున్న యీ వృత్తాంతము పెరియ పురాణములో లేదు. దీనిని శ్రీనాథుడు పరిహరించుట

సమంజస మనియే చెప్పవచ్చును. పైగా శ్రీనాథు డీ కథకు పురాణ గౌరవమును కల్పించినాడు. చిరుతొండడు తుంబురు డనియు, సిరియాలుడు కుమారస్వామి అనియు, తిరువెంగ నాచి గంధర్వ స్త్రీ అనియు, కొన్ని కారణములవలన వారు భూలోకములో అవతరించినారనియు తెలియజేసినాడు. కాని పెరియపురాణములో చిరుతొండడు మహామాత్య బ్రాహ్మణు డని యున్నది.

మొత్తముమీద శ్రీనాథునిది ప్రౌఢోక్తి అనుటలో సందే హములేదు. హృద్యమైన శైలి ఆ ప్రౌఢోక్తికి సైదోడగుటచే, ఆ మహాకవి రచనకు ఒక ప్రత్యేకత కలిగినది. తెలుగు నుడికారపు సొంపులు సంతరించుకొన్న సందర్భములలో ఆ ప్రత్యేకత మరింతగా భాసించును. ప్రౌఢ కావ్య నిర్మాణము నకు తగినట్లుగా తెలుగు కవితను తీర్చి దిద్దినవాడు శ్రీనాథుడు!

శ్రీనాథుని చాటువులు

'తీరుతీయములుగల భాషావాహినియందు సుకవుల కవితా మృతము ప్రబంధ రూపమునకాక చాటురూపమున జాలు వాఱును. వీనులకు విందులై డెందమును దనుపార్చు చాటు రచనము లొక్కొక్క యెడ ప్రబంధ రచనముల సయి తము మీఱియుండును . . .'

చాటువులను గురించి యశస్కులకులు శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు చెప్పిన మాట లివి. భావుకుడైన మహాకవి మానస

మున ఎప్పటికప్పుడు నవ్యత మొగ్గ దొడుగుచుండును. భావు కతయే నవ్యతకు మూల్యక అనదగును. కవి భావుకుడైనచో, అతడు పనిబూని రచించిన కావ్యమునందేకాక అలవోకగా చెప్పిన పద్యమునందును కవిత జాలువాఱును. ఈ కోవకు చెందిన పద్యములను చాటువు లనుడు; ప్రాస్తావికము లనుడు. ఏమయినను, ఈ పద్యములు ఒక్కొక్కతూరి కావ్యదీప్తి ధురంధరత్వముతో వ్రాయబడిన కావ్యముకంటెను రసవత్తర ములుగా నుండుననుట అత్యుక్తి కానేరదు. కావ్యముల జోలికి పోవని సంస్కార శూన్యుల ముఖములనుండి సముతము ప్రస్తావవశమున చాటువులు వెలువడును. ఎంతో రసవత్తర ముగ లేనిచో, ఈ చాటూక్తుల కింత ప్రచారము లభించునా?

నేటికిని ప్రచుర ప్రచారములోనున్న చాటు పద్యములందు మహాకవి శ్రీనాథునివి పేర్కొనదగినవి. చక్కని కవిత, చిక్కని పాండితి, చక్కని చిక్కని భావుకత—ఈ మూడు గుణములును శ్రీనాథుని రచనమున అంతర్లీనములై ఉండును. కొందరి దృష్టిలో అతడు పండితుడు. మరికొంద రాతనిని మహాకవిగా కొనియాడుదురు. నిజమునకు శ్రీనాథు డెంత పండితుడో అంత కవి; ఎంత కవియో అంత భావుకుడును. కనుకనే అతని చాటువులు పండితులకేకాక పామరులకును గోరుముద్ద లయినవి!

ప్రసిద్ధులైన ప్రాచీన కవులలో చాటువులు చెప్పనివారు లేరు. అవి అన్నియు ప్రాయికముగా రాజప్రశంసలుగానో, సమస్యాపూరణములుగానో ఉండును. అందువలన అట్టి చాటుధారలందు పాండిత్య ప్రకర్ష అనాయాసముగా తావు కల్పించుకొనును. నీత్యుద్బోధకములుగాను, శృంగార ప్రధాన

ములుగాను చాటువులు చెప్పినవారును మనవారిలో పలువురు గలరు. శ్రీనాథుని చాటువులందు సైతము ఇట్టివి కానవచ్చు చున్నవి. కాని అతని చాటువులు ఆనాటి తెలుగువారి సామాజిక పరిస్థితులు, తిండి తీర్థములు మొదలగువానిని స్పష్టము చేయుచున్నవి. ముఖ్యముగా శ్రీనాథుని ఆత్మీయతను, లోకజ్ఞతను మన మాతని చాటువులనుండి గ్రహింపవచ్చును. ఈ దృష్టితో చూచినపుడు శ్రీనాథుని చాటుధారల కొక ప్రత్యేకత కలదని తోచును. ఈ ప్రత్యేకత యేర్పడుటకు తగిన కారణము లేకపోలేదు.

శ్రీనాథునివలె దేశాటనము గావించిన కవి పండితులు మన పండిత కవులలో చాలమంది లేరు. ఈ దేశాటనమే అతని లోకజ్ఞతను విస్తృతపరచెననుట పొల్లు కాదు. సాతాని వేడ్క లాడి మొదలుకొని సమ్రాట్టువరకుగల వారి నెల్లరిని చూడ గలిగినాడు. కాని అతని దృష్టి అతివలమీదికి ప్రసరించి నంతగా తదితరులమీదికి ప్రసరించలేదేమో అనిపించును. అందువలననే శ్రీనాథుని పలుచాటువులలో స్త్రీవర్ణనము మిక్కుటముగా కానవచ్చుచున్నది. కాని నేడతని పేరు మీదుగా వ్యవహృతము లగుచున్న చాటువు లన్నియు అతనివే అనుట సాహసమే అగును.

శ్రీనాథుడనగానే మనకాతని భోగలాలసత గుర్తునకు వచ్చును. అతనిది రాజస ప్రవృత్తి. ఉన్నత ప్రభుత్వోద్యోగము దానికి తోడైనది. ఆ ఉద్యోగము కూడ రసికులైన రెడ్డి దొరల కొలువుకూటమున. కాగా భోగమయ జీవితము శ్రీనాథుని వరించెను. కనుకనే అతనికి రత్నాంబరములతో పని కలిగెను. కస్తూరి కావలసి వచ్చెను. భోజనమునకా హేమపాత్రము!

అతని దినచెచ్చము మాత్రము కొంచెమా నంచమా? దానిని తీర్చుటకు చచ్చి స్వర్గమున నున్న మైలారు విభుడు దిగి రావలెను. అట్టి భోగికి అంబటిజావ, జొన్నన్నము, వెల్లుల్లి, తిలపిష్టము మున్నగునవి రుచించునా? అందువలననే పై భోజ్యముల రుచులను కసిదీఱ తూర్చారబట్టెను. ఈ తూర్చార్పబట్టుటను పురస్కరించుకొని శ్రీనాథుని శంకించుట సబబు కాదు. అతని ప్రవృత్తి అట్టిది.

శ్రీనాథుని వేషధారణమును పరికించిన చాలును, అత డెంతటి భోగియో మనకు తెలియగలదు. అతడు కోక చుట్టెను; మహా కూర్పాసమును తొడిగెను; తలపై కుల్లా యుంచెను. ఆయనకు కావలసినవి ఆత్తకింపయిన భోజనము, ఉయ్యాల, రమణీయ స్త్రీయదూతిక తెచ్చియిచ్చు కప్పురపు విడెము మున్నగునవి.

తనవలె పెరవారు కూడ చక్కని దుస్తులు ధరించవలెనని శ్రీనాథు డాశించినట్లు మనకు తెలియుచున్నది. పడమటి సీమ వ్యాపారుల వేషపు తీరును చూచి అతడు మిక్కిలి అసహ్యించు కొనెను. పుస్తుల్ గారెడు దుస్తులనుగాని, భయమై తోచు గడ్డములనుగాని చూచి అతడు సహించలేక పోయెను. శ్రీనాథుడే 'వస్తూ చూస్తిమి రోస్తిమిన్' అని వాక్కొనెను. అటులనే మసర రాజ్యమును చూచినప్పుడు కూడ శ్రీనాథుని హృదయము బాధపడెను. ఎంత బాధపడెనో యేమో! 'ఈ మసర రాజ్యము కాపురమెంత రోతరా' అనెను.

ఈ భోగలాలసతయే శ్రీనాథుని సౌందర్య దిదృక్షునిగా చేసెను. కాగా అతడు లోకమును సౌందర్యాత్మకముగా చూడదలచెను. అతని దృష్టిలో చక్కని అంగడివీధు లుండ

వలెను, ప్రియమైన ననము లుండవలెను. శుచిత్వము నెలకొని యుండవలెను. స్త్రీలలో భౌతిక సౌందర్యమునే అతడు చూచెను.

శ్రీనాథుని చాటుధారలందు 'మాసిన చీర', 'మాసిన గుడ్డలు', 'తలకు మాసిన', 'మైలకోకలు' మొదలగు మాటలు కానవచ్చును. మాసిన దుస్తులన్నచో అత డెంత రోతగొనెనో మన మూహింపనచ్చును. పల్నాటి ప్రాంతపు పురోహితు లింటి కృత్యములను శ్రీనాథుడు 'దోసెడు కొంపలో బసుల త్రొక్కిడి మంచము దూడ రేణమున్' . . . అను పద్యమున ఎంతో స్వాభావికముగా వర్ణించినాడు. దరిద్రులైన పురోహితు లిండ్లయందేకాక ఆర్థికముగా అణిగిమణగియున్న అదృష్ట హీనుల యిండ్లలోని స్థితిగతులను శ్రీనాథుని వర్ణన తలంపు నకు తెచ్చుచుండును. ఈ చాటువు నాధారము చేసికొని శ్రీనాథుడు పురోహితులను చూచి పరిహసించె ననుట పొర పాటు. వారి యిండ్లకు పోయినపుడు చూచిన దృశ్యమును శ్రీనాథుడు యథాతథముగా వర్ణించెను. శ్రీనాథుని సౌందర్య దృష్టి రోతగొలుపు దృశ్యములను సహించదు. పుట్టు భోగిగా పెరిగిన వానికో దృశ్యము రోతగొలుపు ననుటలో ఆశ్చర్యము లేదు.

శ్రీనాథుడు సౌందర్య దిదృక్షువైనను పతిపత్నుల జోలికి అతడు పోలేదు. చూడుడు.

ఆమె లేజిగురుబొమ్మ; సువర్ణపు గీలుబొమ్మ; కాని బెబ్బులి యొక డామెకు భర్తగా దాపురించినాడు.

'దానికి నేలయొక్కనిం . . . బెబ్బులి నంటగట్టిరివి

పెద్దవు నిన్ననరాదురోరి దా నబ్బ! పయోజగర్భ! మగ
నాలికి నింత విలాసమేటికిన్,

అన్నాడు శ్రీనాథుడు.

కనుక కొందరనుకొనునట్లు శ్రీనాథుడు అవినీతిపరుడు కాడనవచ్చును. రసికుడు. అంతే. కాని 'మగనాలికి నింత విలాసమేటికిన్' అనుటనుబట్టి శ్రీనాథుని దృష్టిలో కులకాంతకు విలాసము పనికిరాదని భావమా?

మరియొక సన్నివేశము. ఎచ్చటనో పాలబుగ్గల బాల నొకతెను శ్రీనాథుడు చూచెను. ఆమెలో అందచందము లున్నవి. అన్నియు ఉన్నవి. కాని నుదుట విభూతిరేఖలు మెఱయుచుండెను. పసుపు కుంకుమలు మాంగల్య చిహ్నములు. అవి రెండును లోపించి కడమవి ఎన్ని యున్నను స్త్రీకి లాభ మేమి' ఆ విషయమును చెప్పలేక చెప్పలేక శ్రీనాథు డిట్లు చెప్పెను:

'కుంకుమ లేదో మృగమద
పంకము లేదో, పటీర పాంసువు లేదో
సంకుమదము లేదో, యశు
భంకరమగు భస్మమేల బాలా! నీకున్.'

ఇచట సౌందర్య దిదృక్షువుగా కాక ఆర్ద్ర హృదయునిగా కనిపించుచున్నాడు శ్రీనాథుడు.

శ్రీనాథుడు మంచి పరిహాసరసికుడు. అతని చాటుధార లీ విషయమును బలపరచుచున్నవి. పలుచాటువులలో హాస్య రసము తొంగిచూచుచునే యుండును. కొన్ని పట్టుల హద్దులు

దాటిపోవుటచే అది అపహాస్యముగానో, అశ్లీలముగానో పరిణమించినది.

హాస్యరస పోషణము కత్తిమీది సామువంటిది. హాస్యరసమును ఎంతో సుకుమారముగా పోషించవలెను. లేదేని అది ఉదాత్తముగా ఉండదు. వెగటనిపించును. అందరును హాస్యమును పోషించలేరు. కొందరు మాత్రమే దానిని స్నిగ్ధసుందరముగా తీర్చి దిద్దుదురు. ఆ వరుసకు చెందిన వారిలో శ్రీనాథు డొకడు.

రెడ్డిదొరల కాలమున సింహాచల నృసింహస్వామివారికి మహావైభవముగా ఉత్సవాదులు జరిగెడివి. వానిని తిలకించుటకై ఎక్కడెక్కడివారు ఆ కొండమీద గుమిగూడెడివారు. రెడ్డిరాజులతోపాటు శ్రీనాథుడు కూడ అచ్చటికి చేరెడివాడు. అట్టి సమయములం దాతని పరిహాస రసికతకు రెక్కలు వచ్చెడివి.

ఒకానొకనాడు నీలాటి రేవున జరిగిన ముచ్చటను శ్రీనాథు డిట్లు వర్ణించెను:

'పూజారి వారి కోడలు
తాజాఅగ బిందె జాతి దబ్బున బడియెన్
మైజాఱు కొంగు దడిసిన
బాజారే తిరిగిచూచి పక్కున నవ్వెన్.'

నీలాటి రేవున ఇట్టి దృశ్యములు కొల్లలు. కాలుజారి పూజారివారి కోడలు క్రింద పడెను. ఆమెతోపాటు ఆమె చంకనున్న బిందె కూడ క్రిందపడెను. ఆమె పమిటకొంగు తడిసెను. ఆ తడిసిన కొంగుతో ఆమె బజారువైపు తిరిగి

చూచెను. అంతటితో ఆగెనా? ఒక్కమ్మడిగా నవ్వోలక బోసెను. ఆ నవ్వులోని ఆంతర్య మేమిటో మరి! ఆ సమయమున ఆమెకు నవ్వు వచ్చుటయు, శ్రీనాథుని పరిహాస రసికతకు రెక్కలు వచ్చుటయు ఏక కాలమునసే జరిగెను. అభిమానము గల పడతి అట్లుచేయదు; అప్పుడీ పద్యము మన కంటబడి యుండదు.

ఒకానొకనాడు తములపాకుల బేరమాడబోయి శ్రీనాథుడు అంగడిమీద నున్న అలివేణిని చూచి మరులుగొన్నాడు. ఆ విషయమును ఆ మహాకవియే వా విడిచి చెప్పుకొనెను. ఇందులో చమత్కార మేమియును లేదు. కాని శంకరునివంటి మన్మథారియే ఆమెను వలచి, లింగరూపియై ఆమె హృదయమును నెలవుగా చేసికొనెనట! కనుక శ్రీనాథుడామెపై మరులుగొనుట ఒకలెక్కలోనిది కాదు! ఈ పద్యమును చూడుడు:

'తొలకరి మించు దీవగతి
తోప దుకాణము మీదనున్న య
య్యలికుల వేణితో దముల
పాకుల బేరము లాడబోయి నే
వలచుట కేమి, శంకరుని
వంటి మహత్ముడు లింగరూపియై
కులికెడు దాని గబ్బి చను
గుబ్బల సందున నాట్య మాడెడిన్.'

ఆ జంగమువారి చిన్నదాని అందచందముల కంటె, ఈ పద్యమున అందాలు దిద్దుకొనిన శ్రీనాథుని రసికతయే మనల నెక్కుడుగా ఆకర్షించును.

'ఊరు వ్యాఘ్రనగర మురగంబు కరణంబు
కాపు కపివరుండు కసవు నేడు
గుంపుగాఁగ నిచట గురిజాలసీమలో
నోగులెల్లఁ గూడి రొక్కచోట.'

పులిపాటి పౌరులు శ్రీనాథుని సముచితరీతిని గౌరవింప లేదు. కాగా కవికి వారిపై కోపము వచ్చెను. ఆ కోపమును వెడలగ్రక్కినగాని మనశ్శాంతి లభింపదు. అట్లని శ్రీనాథుడు తిట్టు కవిత చెప్పలేదు. తనకుగల కోపమును పరిహాస పూర్వకముగా వెలిబుచ్చెను.

శ్రీనాథుని పరిహాస రసికత పూబోడులను వర్ణించుటకు మాత్రమే ఉపయోగపడె ననుకొనరాదు. సమయము చిక్కిన చాలును, బంధుజనులను గూడ గేలిచేయుచుండెడివాడు.

శ్రీనాథుని భావమదిరామయ్య మంత్రియట! అతడొక గ్రామమునకు కరణము. అనగా ఆ నాళ్లలో మకుటములేని మన్నీడన్న మాట! పాడిపంటలకు కొదువ లేదు. వీనికి తోడుగా దంతపుష్టిని, జీర్ణశక్తిని అతనికి భగవంతుడనుగ్ర హించెను. రామయ మంత్రికి మజేమి కావలెను. ఒకనాడా తండుల ధ్వంసకుని భోజన పరాక్రమమును కనులార జూచి ఆ దయ్యపు తిండిని శ్రీనాథు డిట్లు చిత్రించెను:

'గ్రామము చేత నుండి పరి
కల్పిత ధాన్యము నింటనుండి శ్రీ
రామ కటాక్ష వీక్షణ ప
రంపరచే గడతేఱెగాక మా
రామయ మంత్రి భోజన ప

రాక్రమ మేమని చెప్పవచ్చు? నా
స్వామి యెఱుంగు దత్కబళ
చాతురి తాళఫల ప్రమాణమున్.'

శ్రీనాథుని చాటువులనుండి మన మాతని ఆత్మ ప్రత్యయ మును గ్రహింపవచ్చును. ఈ ఆత్మ ప్రత్యయమే ఆ కవి సార్వభౌముని వ్యక్తిత్వమునకు వన్నెచిన్నెలు సమకూర్చు చున్నవి.

పెద్దనగారి పెద్దజీకము

ఆమె లావణ్యలతిక. కఱకుఱాలను సైతము కరగించునట్టి గాంధర్వ విద్యలో ధురీణ. ఆంధ్రకవితా పితామహుని అద్వితీయశక్తిచే సాహితీవియత్తలములో వెలుగొందుచున్న విద్యుల్లత. ఆమెయే అందాల బరణి—వరూధిని.

ఎంత వైశిష్ట్యము వరూధిని మనోహరాకృతియందు గోచర మగుచున్నదో, అంత విషాద మామె గాథలో అంతర్లీనమై యున్నది. ఆమె ప్రకృతికాంత సదృశ. ప్రకృతి ఒక్కొక్క తూరి సుప్రసన్నయై సాక్షాత్కార మొసగును. ఇంకొక తూరి కరాలరూపయై కానవచ్చును. ప్రకృతిలో ద్వంద్వశక్తు లంతర్వాహినులై యున్నవి. పంకిలములో పద్మము ప్రభ వించుచున్నది. పరిమళములు గుబాళించు గులాబిచెట్టు నిండుగా ముండ్లు. సువాసనలు వెలార్చు గేదగులందు విషము గ్రక్కు సర్పము లుండు నని కించదంతి. ఎచ్చట మనోజ్ఞత

ప్రస్ఫుటమో అచట భీకరత దృగ్గోచరము. ఏది వికృతముగా కనబడుచున్నదో, అం దొక విశిష్టలక్షణము దోబూచు లాడుచున్నది. ఎట మోదమో, అట ఖేదము. వెలుగునీడల వలె, ఈ ద్వంద్వములు సఖ్యజీవనము నలుపుచున్నవి.

ఇట్టి ద్వంద్వభావములు మనుచరిత్రలో సర్వత్ర గోచరములు. కథానాయకు డగు ప్రవరాఖ్యుడు మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి. కాని యేమిలాభము? అరసికు డతడు. అతడు వివిధాధ్వర నిర్మల ధర్మకర్మదీక్షా పరతంత్రుడు. కాని అహం కారయుతుడట! అంబురుహా గర్భకులాభరణము; కాని కృపా రహితుడు. అనారతాధ్యాపన తత్పరుఁడు; కాని జడుడు. ఏమి యుండిన నేమి? ఎంత నేర్చిన నేమి? తుదకు ప్రవరుడు పెద్దనార్యుని నుతిమెత్తని దూషణోక్తులకు గుఱియైనాడు. భగ్నవివంచియైన వరూధిని ప్రణయ ప్రవృత్తిని చూచి సహింప లేక సహానుభూతిగల పెద్దన్న,

> 'తరుణి, ననన్యకాంత, నతిదారుణపుష్ప శిలీముఖవ్యథా
> భరవివశాంగి, నంగభవుబారికి నగ్గము సేసి క్రూరుఁడై
> యరిగె మహీనురాధముఁ డహంకృతితో...'

అని వేదవిద్యావిశారదుడగు బ్రాహ్మణుడే అను మొగ మోటమి కూడ లేక ప్రవరాఖ్యుని ముద్దుముద్దుగ చీవాట్లు పెట్టినాడు. ఈ సహానుభూతి పెద్దనగారి పెద్దమనసును వ్యక్త మొనర్చుచున్నది.

ప్రవరునిలో గుణవైరుధ్య మున్నట్లుగా, వరూధిని వృత్తాం తములో సన్నివేశ వైరుధ్యము గోచరించుచున్నది. కల కంఠము నెత్తి ఆమె తొలుత కమ్మని గానము చేసినది. పిదప

కల స్వానముతో ఏడ్చినది. ప్రవరుని చూచినతోడనే అతనిపై ఆమె మరులుగొన్నది. పరాభవము చెందిన పిమ్మట అత డనిన ఆమెకు భయము కలిగినది. సంతోషముతో మాయా ప్రవరుని ప్రవరునిగా తలచి వలచినది. సత్యము తెలిసికొని విచారించినది. ఇంతకు హృదయనాథుడగు ప్రవరాఖ్యుని వలపును వరూధిని పొందజాలకయే పోయెను!

మనుచరిత్రము నందలి యితివృత్తము పురాణ గాథయే యైనను, అందలి కవిత మార్గ కవితయే యైనను, అందు సంస్కృత దీర్ఘసమాసము లున్నను—ఇంకే మన్నను సరియే—మనుచరిత్ర క్రొత్త దారులు త్రొక్కిన దని నుడువక తప్పదు. వరూధినీ ప్రవరుల కథ, మనుసంభవ వృత్తాంతము—అను నీ కథాద్వయము గుది గ్రుచ్చబడగా ఏర్పడినదే మనుచరిత్ర నామాంతరము గల స్వారోచిషమనుసంభవ కావ్యము. ఏ ఘట్టమున కా ఘట్టమును మనోహర కావ్యముగ తీర్చిదిద్దినాడు పెద్దన. అయినను మనుచరిత్రము అతుకులబొంత కాలేదు. పువ్వులలోని దారమువలె, ఈ కథాద్వయిలోను ప్రధానాంశ మొకటి అనుస్యూతమై ఉన్నది. అదియే మనుసంభవ వృత్తాంతము. కనుక మనుచరిత్రములో మన మనుకొను రీతిని గాక, యింకొకవిధముగ కథైక్యము పాటింపబడెననుట సమంజసము. ఇందులోనే పెద్దనగారి శిల్పవైదుష్యము తెల్ల మగుచున్నది.

కవి సారస్వతవీరుడు కావచ్చును. సచ్ఛీలుడు కావచ్చును. తన కవితాకౌశలముచే సహృదయులను సమ్మోహితులనుగా చేయవచ్చును. కాసునకు కొఱగాని విషయమును కూడ సౌందర్యాత్మకముగా చిత్రింపవచ్చును. కాని అతనికృతి

సుబోధకముగాను, విశాల భావసమన్వితముగాను లేకున్నచో అది నిర్గంధకుసుమమే అగును. సుబోధకమనగా భాషా సౌలభ్యమని అర్థము కాదు. చెప్పదలచుకొన్న విషయమును స్పష్టముగ, సూటిగ, మనోజ్ఞమగు శైలిలో చెప్పనలయును. భావగాంభీర్యముతో బాటు, భాషాసౌందర్యముగూడ ఉండ వలెను. మధుర భావము హృదయమును రంజింపజేయుచో, మనోజ్ఞమగు శైలి శ్రవణసుభగత్వము కూర్చును. మధుర భావమును మనోహరశైలితో శ్రుతిగూర్చి కవితావిపంచిపై మనోహర రాగాలాపనముచేయు నైపుణిగలవాడే మధురకవి, మహాకవియును. పెద్దన అట్టివాడు!

ప్రకృతి వైచిత్ర్యములు, తన్నావరించియుండు పరిసరముల పరిస్థితులు, నానాటికిని పరిణతి పొందుచున్న యనుభూతి విశేషము తదనుగుణముగ సంవర్ధితమగు శైలీప్రసన్నత మొదలగునవి మహాకావ్యమునందు కన్నులకు కట్టుచుండును. అతని ప్రత్యేకత కథాకథనములో అంతర్భూతమై యుండ వలయును. 'ఆకులందున అణగిమణగి కవితకోకిల పలుకవలె నోయ్' అని గురజాడ కవి ప్రవరుడు నుడివినట్లు కవి ప్రచ్ఛన్నుడై ఉండి కావ్యరచన చేయవలెను. మొత్తము మీద, కావ్యము వాస్తవిక జగతికి ప్రకృతియై, సంఘము నుత్తేజ పఱుచు భావములకు ఖనియై, ఆదర్శాత్మకమై ఉండవలయు ననుట సమంజసము. అప్పుడే కావ్యమునకు చిరంజీవిత్వము సిద్ధించును. లేదేని అది మఖలో పుట్టి పుబ్బలో మాడిపోవుట తప్పదు.

పెద్దన మహాకవి! అతని కృతిలో ద్వంద్వ భావములు గోచరించుటకు నాటి సాంఘిక జీవనమే చాలవఱకు హేతువై

ఉండనోపును. అలనాటి సంఘమునందలి బాగోగులను గ్రహించిన లోకజ్ఞుడు కావున పెద్దనగారి కావ్యములో నాటి సమాజము తొంగిచూచినది. అందువలననే ఆతని పాత్రలలో ద్వైధీభావము గోచరించుచున్నది. దాన జపాగ్నిహోత్ర పరతంత్రుడగు ప్రవరునియం దెంత అభిమానమో, పెద్దనకు మరున్నారీ శిరోరత్నమగు వరూధినియం దంత సహానుభూతి. ఈసహానుభూతిని పురస్కరించుకొని ప్రవరాఖ్యుని కొంతవఱకు నిందోక్తులాడినను పెద్దన ఆతని శీల మహత్త్వమునకు ముగ్ధుడై జోహారు లొనర్పకపోలేదు. కావుననే ప్రవరుని శీలము పరిభ్రంశము కాలేదు. ఆదర్శ పురుషుడై అతడు ద్యోతించుచున్నాడు. ఆదర్శాత్మకముగ కావ్యము లేకున్నచో, అది సార్వకాలికము కాజాలదు.

ఇక నాడు వెల్లివిరిసిన సామాజిక పరిస్థితులను రేఖామాత్రముగ గమనింతము. ఉత్తరాపథములోవలె దక్షిణాపథమున కూడ మహమ్మదీయ విజృంభణముతో హిందూ రాజ్యములు భిన్నభిన్నములై పోయినవి. హైందవ నాగరకతతో మహమ్మదీయ నాగరకత పెనవేసికొని పోయినది. ఈ సమ్మేళనము నాటి హైందవ సంస్కృతిలో కొన్ని పరిణామములకు దారి తీసినది. ఇట్టి పరిణామములు తలలెత్తుచున్న కాలమునందు హిందూసంస్కృతిని పరిరక్షించు గురుతర బాధ్యత తెలుగు గడ్డమీద జనన మందిన వీరయోధులపై పడినది. విద్యారణ్య స్వాములవారి ఆశీర్బలముతో బుక్క-సోదర పంచకము తుంగభద్రా నదీతీరమున హిందూ మహాసామ్రాజ్యమునకు శంకుస్థాపన మొనర్చి కృతకృత్యత గడించెను. నాటి నుండియు హిందూ మహమ్మదీయుల సంఘర్షణములు పొడ

సూపినవి. ఈ రాజకీయ సంఘర్షణల ననుసరించి సాంఘిక రంగమునందు కూడ అందందు మార్పు లేర్పడినవి. మహమ్మదీయుల సౌందర్యా రాధనము, భోగలాలసత హిందూ సంఘమున క్రమక్రమముగా ప్రవేశము కల్పించుకొన జొచ్చినవి.

సామాజిక చైతన్యమున కనుగుణముగ సాహిత్య చరిత్రము కూడ మారుచుండుట సహజము. ప్రజకు సౌందర్యాసక్తియు, భోగానురక్తియు ఎప్పుడు కలిగెనో, సంఘజీవులగుటచే కవులు కూడ సౌందర్యా సక్తులును, భోగానురక్తులను కాక తప్పలేదు. అదియునుగాక పురాణకవితతో మొగము మొత్తిపోయిన కవులకును, రాజులకును శృంగార రచనలపై మమత యేర్పడి నది. తత్ఫలితముగ జరిగినదే ప్రబంధకావ్యావిష్కరణ మహోత్సవము.

కాలము పోకడలోను, కవితారచనలోను సంభవించిన పరిణామములను మహాకవి పెద్దనహృదయము గుర్తించినది. మార్పుల ననుసరించి కృతి నిర్మాణము గావింపవలయునని అతడు శించినాడు. మనుచరిత్ర యందలి భావసంఘర్షణ వలె, ఇతివృత్తస్వీకరణ విషయములో కూడ ఆతని మానసవీథియం దొక సంఘర్షణ మేర్పడియుండును. ఏలయన పురాణముల ప్రాభవ మప్పటికి పూర్తిగా లుప్తము కాలేదు! నూతన కావ్యనిర్మాణము జేయు నవసరమా కలిగినది. కనుక ప్రాచీన మార్గమును పూర్తిగా పరిహరింపక పెద్దన్న క్రొంగ్రొత్త ఘణితిని రచన సాగించినాడు. ఇది అభ్యుదయ లక్షణము. గతమును విస్మరించి భవితవ్యమును సంస్మరించుట గాలిమేడలు కట్టుటయే అగును! కథేతివృత్తమునకై యెన్నాళ్లు తపించెనో తెలియదు కాని, తన ఆశయసిద్ధికి సర్వవిధముల దోహద

మొనర్చినట్టి కథను పెద్దన స్వీకరించినాడు. అది పౌరాణికమే యైనను దానికి వన్నెలు చిన్నెలు తీర్చి దిద్ది మనుచరిత్రమును మనోహర కావ్యముగ వెలయించి పెద్దన పెద్దకవిగా ప్రథితుడయినాడు.

కవిని పట్టిచూచుటకు రెండు ముఖ్యాంశములు చాలును. ఒకటి కథావస్తువు. రెండవది కథాకథనము. ఇతివృత్తము పేలవముగా ఉన్నను దానిని రసోదంచితముగ తీర్చు కౌశలము కవికి మెండుగ నుండనలెను. ఇందులకు కథా కథనము దోహదక్రియ అగుచున్నది. పెద్దనార్యుడు మూల కృతి యగు మార్కండేయ పురాణమునుండి కథను గైకొనినను, మూలమునకు భిన్నము లయిన మార్పులు చేసి తన కృతికి కావ్య యశ స్సౌందర్యములు సమకూర్చుకొనెను. మూలమునందు వరూధినీ ప్రవరాఖ్యము కానరాక గహనలత వలె క్రందుకొనియున్నది. ఆ తీగను వెలికి తీసి పెద్దన దాని నొకచోట నాటి నీరుపోసి పెంచినాడు. అది ననలు తొడిగి నది; కుసుమించినది. కాగా వరూధినీ ప్రవరుల ప్రణయ గాథయు, మనుసంభవ వృత్తాంతమును మనుచరిత్రలో అందాలు దిద్దుకొనినవి. ఇందులకు తోడుగా పెద్దనగారి శిరీషకుసుమపేశల సుధామయశైలి కథారామణీయకము నిను మడింపజేసినది. ఆయనిది వశ్యవాక్కు. పండిత పామర హృదయాకర్షకమగురీతిని పెద్దన రచన సాగించినాడు. అచ్చటచ్చట దీర్ఘసమాసములు కొన్ని దొరలకపోలేదు. కాని అవి లలితములు; మంజులములును. పెద్దన వస్తుతః కవి, మహా పండితుడును. కనుక మనుచరిత్రలో నిగులుదేతిన కవితయు,

కాకలుదీతిన పాండితియు నిండారు కొనినవి. ఈ హేతువు లాకావ్య చిరంజీవిత్వమునకు పోషకములు.

వసూధినిని నాయికగా చేసి కావ్యనిర్మాణమునకు దిగిన పెద్దన హృదయము సాహసపూరిత మని నుడువదగును. వసూధిని దేవవేశ్య. వేశ్యను నాయికగా చేయుటను మన ఆలంకారికులు ఆగ్రహింతురు.

కథాకథనము నందును పెద్దన ప్రత్యేకత ప్రవ్యక్తమగు చున్నది. ముఖ్యముగా మనుచరిత్రలోని ద్వితీయాశ్వాసము ఒక రూపకమువలె కనిపించును. వసూధినీప్రవరాఖ్యుల సంభాషణక్రమము ద్వితీయాశ్వాసమునకే కాక యీప్రబంధ మునకే జీవము పోసినది. కథనశైలికంటె సంవాదశైలి నిజ మునకు రూపకమునకు సజీవత్వము చేకూర్చును. వసూధినీ ప్రవరుల సంభాషణము కథనశైలిలో సాగలేదు. పద్యరూపక మేమో అను భ్రాంతిని ఆఘట్టము కలిగించుచుండును. ఈ సంవాద శైలివలన వసూధిని నిరుపమాన వచోవిలాసము, ప్రణయహృదయము, ప్రవరుని అమాయకత్వము మున్నగు నవి తెల్లము లగుచున్నవి. ఇక వసూధిని విషాదగాథ నవలో కింతము.

బుద్ధి జాడ్యజనితోన్మాదుల్ గదా శ్రోత్రియు లను పెద్దన గారి పరిహాసోక్తులకు పాల్పడిన 'వేదపండు' ప్రవరుడు పాద లేపము కరగిపోగా, దారితెన్ను తెలియక చింతాక్రాంతు డయినాడు. అరుణాస్పదపుర మెక్కడ? తుహినాద్రి యెక్కడ? క్రౌవ్వి యే రాదగునే? అని తన్ను తాను నిందించికొనినాడు. ఏదేని తెరువు కంటబడునేమో అని దిక్కులు కలయ జూచి నాడు. అంతలో కస్మసివాసనలతోడి మందమారుత మొకటి

చల్లగ వీచినది. ప్రవరునికి ప్రాణము లేచివచ్చి నట్లయ్యెను. ఆ గాలిజాలునఁబట్టి అతడు ముందడుగు వేయగా, ఒక సుందరమందిరము అతనికి కనిపించెను. ఆ రమ్యహర్మ్యమును సమీపించినాడు. ఆ పరిసరము లెంత మనోజ్ఞములు!

తావుల్ క్రేవలఁ జల్లుచెంగలువ
కేదారంబు తీరంబునన్
మావుల్ క్రోవులు నల్లిబిల్లిగొను
కాంతారంబు సంధ్దైందవ
గ్రావాకల్పిత కాయమాన జటిల
ద్రాక్షా గుళుచ్ఛంబులన్
బూవుందీవెల నొప్పు నొక్క భవ
నంబున్ గారుడో త్కీర్ణమున్.

వరూధిని మనోహరాకృతియందు ఎంత మనోజ్ఞత ప్రస్ఫుటమో ఆ ప్రశాంత పరిసరములును అంత మనోమోహనములుగ నున్నవి. అట తరుణసహకార మూలవితర్దిపై ఆసీనయై ఒక లేజవ్వని ఉండెను. ఆమెయే అందాల వరూధిని. ఆమె మరున్నారీ శిరోరత్నమట!

ఆమె వీణాగానము చేయుచుండెను. ప్రవరుని కనుగొని నంతనే ఆమె లోచనములు నవ్యకాంతులతో జిగేలు మనెను. అవ్యక్తములగు తీయనితలపు లేవో ఆమెలో గిలిగింతలు పెట్టెను. ఆగంతుకుని గౌరవార్థమై కాబోలు వితర్దినుండి లేచి సమీపమునన్నున్న పోకమ్రానును నాశ్రయించి వరూధిని కడకంటి చూపులతో ప్రవరుని సౌందర్యమును జుట్టుకొనుచు నిలబడినది. ఆ చూపులందు సిగ్గుతెరలు తెరలు కొన్నవి. ఆతని దివ్యాకృతిని కనులార చూచినదే తడవుగా

'ఎక్కడివాడో! యట్టితనయేందు జయంత వసంత కింతులన్ జక్కదనంబునన్ గెలువఁజాలెడు వాఁడు మహీసురాన్వయం బెక్కడ! యీతనూవిభవ మెక్కడ!' అని ఆశ్చర్యచకితయై అతనిని సమీపించినది.

వరూధినీ నివాసమును చూచి సంతసించిన ప్రవరుని కామె వీణాగానము రుచించినట్లు కనబడదు. ఎపుడెపుడు స్వగృహము జేరుదునా అను చింతయే అతనికి పెద్ద దయ్యెను. కావున ఆమె గానమాధుర్యమును ఆస్వాదింపలేక పోయినాడు. ప్రవరుడు సంతత వేదాధ్యయనపరుడు. అనగా ఉదాత్తాను దాత్తాదిస్వరముల సారస్యమును లెస్సగ గ్రహించిన వాడన్నమాట! అట్టి వేదవిద్యా విశారదుడు గానమాధుర్య మునకు అబ్బురపడనలసినదే. నోరులేనిజీవములు సయితము సంగీతమునకు చెవులు కోసికొనుచుండగ వరూధిని మధుర గానము ప్రవరునికి నచ్చకపోవుట విచిత్రముగనే యున్నది. అందును దేవకన్య తన 'కరపంకరుహ రత్నకటక ఝణఝుణ ధ్వని' తాళముకాగా జిలిబిలిపాటను ముద్దులొలుకునట్లు వీణ మీద వాయించుచుండినను ప్రవరునకు సంగీతరసానుభూతి కలుగలేదు. ఒకవేళ కలిగెనేమో తెలియదు. వరూధిని ప్రవర్తన ఆతని దృష్టిలో దూష్యమగుటచే ఆమె గానముకూడ అతనికి అసహ్యముగ తోచెనేమో! అయినను కనీసము స్వగత ముగనైనను 'ఆహా! ఏమి యీ కలగానము!' అని సంతసించి యున్నచో ప్రవరునిహృదయము మనకు వ్యక్తమై యుండెడిది. కఠినచిత్తుడు, కృపారహితుడు, క్రూరుడు - అను దూషణోక్తులకు గురియైన ప్రవరుడు నిజముగా అట్టివాడేమో అను సంశయమిట కలుగక మానదు.

వరూధిని ప్రవర్తనమును చూచి విభ్రాంతుడై 'యెవ్వతె వీవు భీతహరిణేక్షణా?' అని ప్రవరు డామెను ప్రశ్నించినాడు. అంతటితో ఊరకొనలేదు. ఈ వనాంతర సీమలో ఓటలేక సంచరించుచున్నావేమి? అని ఆమె నధిక్షేపించినాడు. క్రొవ్వు పట్టి యీ కొండను చేరి మాఊరికి వెళ్లుటకు మార్గము తెలియక తికమక పడుచున్నాను. త్రోవజూపి పుణ్యము కట్టుకొనుము - అని నిష్కపటముగ అడిగినాడు. త్రోవగానక అతడు తపించిపోవుట చే వరూధిని కలగాన మతనికి రుచించ లేదేమో! ఇక ఆమె ప్రవర్తనము ప్రవరుని దృక్పథములో ఎటుల సహ్యము కాకపోయెనో పరికింతము.

ఆ వనాంతర సీమలో యౌవనవతియగు వరూధిని యేకాంతవాసము సలుపుచున్నది; వీణ వాయించుచున్నది. ప్రవరుని చూచినంతనే వితర్దినుండి లేచి పోకచెట్టుచాటున నిలువబడి ఓరచూపులతో ఆగంతుకుని వరూధిని తిలకించు చుండెను. ఆ చూపులు భీతహరిణవిలోకనములు వలెనుండిన వట! ఆమె భయమున కేమి కారణమో దురూహ్యము! ఆ చూపు లెట్టివో ప్రవరునికే తెలియవలెను. కావునసే ఆమె నుద్దేశించి నీ వెవ్వతెవు? ఎందులకీ వనమున ఒంటరిగా సంచరించుచున్నావు? అని అడిగెను. ఆర్ష సంప్రదాయ ములలో పుట్టి పెరిగి పెద్ద యైనవాడు ప్రవరుడు. జీవితము నియమబద్ధమై యున్నచో అతడు సంతసించును. మఱి దేవత లకు నియమ బద్ధ జీవిత మున్నట్లు కనబడదు. వీని కన్నిటికిని వా రతీతులు. ప్రవరుని ఆక్షేపణలో మందలింపు కూడ ఉన్నది. జవ్వని ఒంటరిగా సంచరింపగూడదని అతడు వరూధినికి హితోపదేశము చేసినాడు.

ఈ ఆక్షేపమును వరూధిని లెక్కసేయలేదు. 'ఇంతలు కన్నులుండ తెరువెవ్వరి వేడుదు భూసురేంద్ర?' అని ఆమె ప్రవరు నధిక్షేపించినది. ఇది అధిక్షేపముగా కనబడినను నర్మగర్భమై ఉన్నది. ఇంతలు కన్నులు—అనుమాటలు ప్రవరుని నయనరామణీయకమును స్పష్టముగా మొనర్చుచున్నవి. తాటికాయలంత పెద్దకండ్లు పెట్టుకొని త్రోవ నడిగెదవేమి? అనుచు వరూధిని ప్రవరుని సోగకన్నుల సోయగమును వర్ణించినది. ఆమె వాక్చమత్కృతి కిది మచ్చుతునక. ఈ ఆక్షేపముతో నిలువక వరూధిని యేకాంతముగనున్న జవరాలితో సరసము లాడ నెంచి నన్ను పలుకరించినట్లున్నది. లేదేని నీవు మును వచ్చిన త్రోవనెట్లు మఱితువు? అని యెదురు ప్రశ్నించినది. ఇది కూడ నర్మసహితమై ఉన్నది. నేను జవ్వనిని; ఏకాంతముగ నున్నాను—అని ఆమెమాటలు చెప్పకయే చెప్పుచున్నవి. అంతటితో నిలువక తన మిత్రరత్నములను, వారి పాండితిని వివరించినది. వరూధిని సామాన్య మహిళ కాదని ప్రవరుడు తలచుటకు కాబోలు పైవిషయముల నామె నుడివెను.

పిమ్మట మాయింట విందనైతి వనుచు వరూధిని ప్రవరునకు స్వాగత మొసగెను. స్వస్థలమును చేరవలయు ననుతలంపుతోనున్న అతడా పిలుపును అంగీకరించు స్థితిలో లేడు. అతని హృదయము స్వజన దర్శనమునకై తహతహలాడుచుండెను. నేను వెళ్లనలెను; నాకు దారి చూపుము—అని ప్రవరుడు భాలుని వలె మంకుపట్టు పట్టుటను చూచి స్మేరాంకూరముతో 'ఊరు, ఊరని కలవరించుచున్నావునఎక్కడి ఊరయ్యా అది? ఇక్కడి రత్నకందరములు, చందన వృక్షములు, గాంగ

సైకతములు, లతామందిరములు మున్నగునవి మీ గుడిసె కొంపలకు సరివచ్చుట లేదు కాబోలు' అని వరూధిని తన విసుగును స్పష్ట మొనర్చినది. ప్రవరునికి తన గుడిసె కొంపయే మణిమయ మందిరము కంటె మహోత్కృష్ట మని వరూధిని గ్రహించినది. తళుకు బెళుకు తాలకుగాని, దృక్కులకుగాని వశీకృతము కాని గంభీరహృదయము ప్రవరునిది.

ఎంత నుడివినను, ఎన్ని విధములుగా నుడివినను ప్రవరుడు సుముఖుడు కాకపోవుటను గుర్తించి వేసారిపోయి 'నిక్కము దాపనేల! నిన్నువలచితిని' అని వరూధిని మనసులోని మర్మమును తెలివిడి చేసినది. ఆమె చాలనేపు మేకపోతు గాంభీర్యమును నటించి తుదకు బేలయై పోయెను. ప్రవరునియందు గల మోహాతిశయమే ఆమెను అట్టి బేలగా చేసినది. కల్లకపటము లెఱుగని వరూధిని తన మోహమును వాచ్యముగా నుడివినను ప్రవరు డందులకు సమ్మతింపలేదు. పై పెచ్చు 'ఇది నీకు తగదు. నిత్యకర్మానుష్ఠానముతో నలగిపోవుచున్న నావంటి వైదిక విప్రుని వాంఛించుట సమంజసము కాదు. యుక్తాయుక్త పరిజ్ఞానముతో మెలగు' మని నయోక్తులు పలికెను.

వరూధినికి హితబోధ చేయుట చెవిటివానికి శంకూదినట్లయ్యెను. ఆమె మోహమేమో; ఆమెయేమో! అంతేకాని ప్రవరుని మనస్తత్త్వమును గ్రహించి తదనుగుణముగ వర్తించుట కామె యత్నింపలేదు. ప్రవరునివంటి నిత్యాగ్ని హోత్రుని వలచుటయే ఆమె చేసిన తప్పు. కాని అట్లు వలచుటచేతనే వరూధిని ప్రవరుని దయిన శాంతగుణోద్భాసితరూపమును హృద్గతము చేసికొనినది. సత్సంతానమును బడసి ధన్యచరిత యైనది. కనుక వరూధిని ప్రేమకు ఫలము దక్కినది.

తనకు హితబోధ చేసిన ప్రవరునకు వరూధిని ప్రతి హిత బోధ చేసినది. 'ఈ యెలప్రాయమును వైదికకర్మలతో వమ్ము చేసికొనుచున్నావు. నీ వొనర్చు యజ్ఞ యాగాది క్రతువులకు మావంటి దేవాంగనల పొందు లభ్యమగుటయే కదా ఫలము? ఆ మహాద్భాగ్యము నీ కనాయాసముగ లభించుచున్నది. ఉపవాసాదువలన వసివాళ్ళాడిన దేహముతో స్వర్లోకమునకు జన యత్నించుచున్నావు. జీవాత్మను గాసిలజేయుట వాంఛ నీయము కాదు. మావంటివారి ఆశ్లేష సౌఖ్యమువలన గలుగు నానందమే బ్రహ్మానందము. ఆనందో బ్రహ్మ యను ప్రాజదువు నెఱుగవా నీవు?' హితబోధనేయుగడగిన వరూధిని వేదాంతమును కూడ స్పృశించినది. ఆమె పలికిన యీ పలుకులు పులినోట పురాణవాక్యము లను నానుడిని స్మరణకు తెచ్చుచున్నవి.

వరూధినిచే శ్రుతివాక్యమును పలికించి పెద్దన చక్కని హాస్యమును తన రచనలో మేళవించినాడు. ఆనందో బ్రహ్మ అన్నప్పుడు వెంటనే మనకు నవ్వు పుట్టును. ప్రవరు డెన్ని ధర్మపన్నములు వల్లెవేసినను మనకు నవ్వు రాదు. పై పెచ్చు మన మతని వేదవిద్యావైశారద్యమును గాంచి అబ్బుర పడుదుము. కాని కామశాస్త్రోపాధ్యాయిని యగు వరూధిని వేదవాక్యముల నెత్తిచూపి తన కార్యమును సమర్థించుకొనుటకు యత్నించుట మనకు నవ్వు పుట్టించుచున్నది. సంభోగసంజని తానందమే నిష్పేదబ్రహ్మానందమని ఆమె తలచినది. నిజమునకది ఆనందమే కాదు! ఐహికముగా కలుగు మనోహ్లాదము సంతోష మగును గాని ఆనందము కాజాలదు. అలౌకికము, నిర్వాచ్యము, అవ్యక్తము నగు ఆహ్లాదమే ఆనందము. ఇది లౌకిక జగత్తున

కతీత మని తాత్త్వికుల విశ్వాసము. కనుక వరూధిని నుడివి నట్లు స్త్రీ పురుష సంయోగ మానందము కాదు. వేదజడు డగు ప్రవరుని వేద ప్రమాణముల చేతనే వశీకృతము చేసికొన దలచి వరూధిని అట్లనియుండును. కుటిలవర్తనులు స్వకార్య ధురంధరులై ప్రమాణవాక్యములు నుడువుదు రని ఆంగ్లోక్తి ఒకటి కలదు.

వరూధిని వచోవిలాసము నందలి మంచిసెబ్బరలను వింగ డించుటకంటె ఆమె ప్రత్యుత్తరములలో వ్యక్త మొనర్పబడిన నాటి సామాజిక పరిస్థితులను గమనించుట సమంజసము. ఆనాడు కర్మవాదమునకంటె భక్తివాదమునకు బహుళప్రచార ముండెడిది. శ్రీకృష్ణదేవరాయల వారి ఆముక్తమాల్యదా కావ్యమున సర్వేసర్వత్ర భక్తివాదచ్ఛాయలే కానవచ్చు చున్నవి. ప్రణయాత్మకమగు భక్తి మోక్షమును సుకరము చేయునని గోదాదేవి కథ సాక్ష్య మొసగుచున్నది. గానసహిత మైన భక్తియే ఫలప్రదమని మాలదాసరికథ వ్యక్త మొనర్చు చున్నది. మూఢభక్తికూడ మోక్షమును సుగమము చేయునని విష్ణుచిత్తుని కథవలన విదిత మగుచున్నది. కనుకనే పెద్దన కర్మవాదప్రతినిధిగా ప్రవరునికి వేషము వేసి ఆతని ఛాందసత్వ మును వరూధిని ముఖమున పరిహసించినాడు. అది సంధి యుగము. అగుటచే పెద్దన సంప్రదాయముల కొకవైపు బ్రహ్మ రథము పట్టుచు, మఱొకవైపు ఆ సంప్రదాయములనే పరిహ సింపబూనినాడు.

భక్తివాదము ప్రబలినకొలది వైదికాచారములపై నాటి ప్రజకు వైముఖ్య మేర్పడసాగెను; భోగలాలసత యెక్కు వయ్యెను. సురభిళద్రవ్యముల మీద ఆశలు జనించెను.

భోగేచ్ఛ ముదురుటచే స్త్రీ భోగ్యవస్తు వను మలిన భావము ప్రబలిపోయెను. యీవనము భోగమయమై ఉండవలయు నను ఆశ పొడమెను. 'ఇట్టి యెలప్రాయము వైదికకర్మ నిష్ఠలన్ బోవగ నింక భోగములఁ బొందుట యెన్నడు?' కృశుఁడవయి యాత్మ నలఁచుట'—మున్నగు వాక్యముల నవలోకించిన ఆ కాలపు పరిస్థితి కొంతవఱకు వ్యక్తమగును.

పెద్దన సౌందర్యదిదృక్షువు. అతనిది రాజసప్రవృత్తి. అతని ఆత్మీయత వరూధినీ ప్రవరాఖ్యములో ప్రతిఫలించుచున్నది. ఛాందసుముగా వర్ణింపబడిన ప్రవరుడు మకరాంక శశాంకమనోజ్ఞమూర్తి యట! అలేఖ్యతనూవిలాసుడట! ఇంతలు కన్నులున్నవట అతనికి! వరూధిని వంటి దేవకన్యయే అతని కనుగొని మైమఱచినది. ఉత్తమ మానవుఁడు దేవతల నధఃకరించునని తెలియజేయుటకే పెద్దన ప్రవరుని పాత్రకు మెఱుగులు దిద్దెనేమో!

ప్రవరుని మనోభిప్రాయమును గుర్తించిన వరూధిని బిక్కమొగము పెట్టి 'అకటా! వనిత తనంతదా వలచినచ్చిన చుల్కన గాదె యేరికిన్' అని లోకపు రీతిని సునిశితముగ విమర్శించి తుదకు 'వెతలన్ బెట్టకు మింక' నన్ననుచు ప్రవరుని ప్రార్థించినది. ఆమె దీనాలాపములు కాని, ప్రార్థనలు కాని అతనిని కదిగించ లేదు. ఇక నట్టిమాటలతో లాభ మిసుమంతయు కలుగ బోవని నిశ్చయించి వరూధిని ప్రవరుని తనబాహువల్లరిలోనికి జేర్చుకొన యత్నించెను. ఆమె ప్రయత్న మతనికి వెగటుగ తోచెను. హా! శ్రీహరీ! అని పాపపరిహారార్థముగ హరి నామస్మరణ సలిపెను. ఆమెతో ఏమియు మాటాడలేదు.

ఓర మోమిడెను. ఆమె అంసోత్తరీయము నంటి పొమ్మని ఆమెను త్రోసినైచెను.

ఈ దృశ్యము పెద్దనామాత్యుని పెద్దతికమును పరీక్షచేసి నది. రాజసప్రవృత్తిగల యతడు వరూధిని పక్షము నిలిచి ప్రవరుని ఛాలదసత్వమును బహిర్గత మొనర్చుచుండెను. అట్టి పెద్దనయే గంభీరుడగు ప్రవరుని ధీరప్రవర్తనమును చూచి కను బొమలు పెద్దవి చేసికొని చకితు డయినాడు. ఆ కవికి అప్పుడు ప్రవరుని బుద్ధిజాడ్యజనితో న్మాదత్వము స్ఫురణకు రాలేదు. ధర్మహృదయుడగు పెద్దన ప్రవరుని పక్షము వహించి 'కలంచునే సత్తుల మాయల్ ధీరచిత్తంబులన్' అన్నాడు. వరూధిని పెద్దనగారి దూషణోక్తులకు గురి అయ్యెను. పెద్దనతోపాటు చాలసేపు నవ్విన మనము కూడ, ఈ దృశ్యమును చూచి ప్రవరునికి సభక్తికముగ నమస్కరింతుము. ఆదర్శ పురుషు డితడు!

అంత వరూధిని లజ్జాపరవశయై చుర చుర చూపులు ప్రవరునిపై నిగుడించుచు తనయక్కసును కలస్వనముతో వెడలగక్కెను.

'పాటున కింతు లోర్వురె కృపారహితాత్మక! నీవు త్రోవ ని చ్చోట భవన్నఖాంకురము సోకె గనుంగొను మంచు నేడ్చెన ప్పాటలగంధి వేదన నెసంబిడి.....'

అని వరూధిని వలవల విలపించినది.

ప్రవరుని గంభీరతను కనుగొని సంతసింతుమా లేక వరూధిని దీనాలాపములను విని విచారింతుమా? పెద్దనగారి కవితాశిల్ప మిచ్చట కన్నులకు కట్టుచున్నట్లున్నది. వైదికవిప్రునెడల

వరూధిని మెలగిన తెఱిగును చూచినపుడు ఆమెపై మనకు సహానుభూతి కలుగదు. కాని అతనిచే పరిభవ మైనప్పుడు మనకు ఆమె యందు సహానుభూతి కలుగుచున్నది. ఆమె ప్రేమ అస్థానపతిత మయ్యెనే అను అనుకంప యేర్పడును. 'అతికరుణముగా వనరుహనేత్ర కన్నుఁగవ ధవళరుచుల్ కావి గొన' విలపించెనని కవి జాలిగా నుడువుచున్నాడు.

వరూధిని దేవవేశ్య అగుటచే ఆమె ప్రవర్తనము నీతివిదూర మని నుడువదగదు. ఆమెకు నీతి నియమము లున్నట్లు పెద్దన తెలియజేసెను. ప్రవరుని చూచిన మఱుక్షణము నుండియు వరూధిని హృదయ మతనియందే లగ్న మయ్యెను. అత డామెను పరిహసించెను. ఆక్షేపించెను. దూషించెను. ఆమె ప్రార్థనల నతడు నిరాకరించెను. అతనిచే అవమానిత అయ్యెను. కాని వరూధిని హృదయము మాత్ర మతనిని వెన్నంటియే పరిభ్రమించెను. ఆమె తన జన్మము నిరర్థక మాయెనే అని ఒకొక్కతూరి విలపించును. మానవభామినిగా జన్మించి యుండిన లెస్సగా ఉండి యుండెడిదే అని తలచును. నాచక్కదనం బదేమిటికి? జవ్వన మేటికి? ప్రాణ మేటికి? అని నిస్పృహ చెంది సకలాభరణములు తీసివైచెను. అలంకరించు కొనుటను మానివైచెను. వీణాగానమును విస్మరించెను. తుదకు చిక్కి సగమై పోయెను. వరూధిని దీనాకృతి నిజమునకు కరుణ రసప్రధానమై యున్నది. ప్రవరుని సమక్షమున వరూధిని సంచరించిన విధము నీతివిదూరమే యైనను, సహానుభూతిగల పెద్దన ఔదార్యమును ప్రకటించి వరూధినిపాత్రను మనోజ్ఞ ముగ పరిపోషించినాడు. ఈ సహానుభూతి పెద్దనగారి హృదయ వైశాల్యమును సూచించుచున్నది!

చేమకూర వారి సుభద్ర

శ్రీకృష్ణదేవరాయలవారి కాలమున విజయనగరము తెనుగు కవులతోను, సట్టువక త్తెలతోను ఎట్లు కిటకిటలాడుచుండెనో, అటులనే నాయక రాజుల కాలమున మధుర, తంజాపురాది ప్రాంతములు తెలుగు కవులయొక్కయు, గాయనీ గాయకుల యొక్కయు, మనోహరరాగాలాపనములచే మాఱు మ్రోగు చుండెను. విజయ నగరాధీశ్వరుల కాలమున వినిర్మితమగు చుండిన ఆంధ్ర వాఙ్మయ రమ్యహర్మ్య నిర్మాణము విజయనగర సామంత నృపాలు రగు నాయక రాజుల కాలమున పూర్తియైనది. అంతేకాక ఆ మహానిర్మాణము ననుసరించి పదసాహిత్య సుందరోద్యానము, వచన వాఙ్మయ విశాల తటాక ప్రతిష్ఠ మున్నగునవి కూడ వర్ధిల్లినవి. అటు పద్యపద సాహిత్యముల తోను, ఇటు వచన సాహిత్యముతోను, ఆంధ్ర సాహిత్యము పరాకాష్ఠ నందినది. ఆంధ్ర సాహిత్య వీధులు సుందరములు, సువిశాలములు, సుదీర్ఘములు, సుస్థాపితములు నైనవి. తెలుగు నెలత ప్రారంభించిన నిత్య శృంగార వ్రతము చాలవరకు పూర్తియైనదని నుడువదగును.

నాయక రాజుల కాలమున వర్ధిల్లిన కవివీరులను సంస్మరించు నపుడు చేమకూర వేంకటకవి పేరు స్ఫురణకు వచ్చుట పరిపాటి. మహాకవి వర్గమునకు చెందిన చేమకూర వేంకట కవి కులమును గురించి పుక్కిటి పురాణము లున్నవి. కాని చారిత్రక సత్యములు లభ్యములు గాకుండుట శోచనీయము. 'కులము

ప్రధానమే గుణము లేకున్న' అని గౌరన మహాకవి నుడివినట్లు కులమును, వ్యక్తిని వీడి వ్యక్తిత్వమును పరిశీలించుట సహృదయుని కర్తవ్యము. ఈ దృక్పథముతో చూచితిమేని, ఆంధ్ర వాఙ్మయరంగమున వేంకటకవికి గల స్థానము విశిష్టమైనదని చెప్పక తప్పదు. ఈ కవి ప్రవరుని కవితా ప్రాశస్త్యము, మనోహర కల్పనాధీశక్తి, జాతివారా ప్రయోగ చమత్కృతి, సరస సంభాషణశైలి—మున్నగునవి నిరుపమానములు; ఆంధ్ర సరస్వతికి నూత్నాలంకారములు. అతడు పట్టినదెల్ల బంగార మయ్యెను; తలచినదెల్ల తలమానిక మయ్యెను. ఇట్టి ప్రతిభా సమన్వితుడగుటవలననే 'ఇంటిపేరు నన కవిత్వము పస' అను మఖురోక్తి వాడుకలోనికి వచ్చినది.

విజయ విలాసాది ప్రబంధ కర్తయగు చేమకూర వేంకట కవి తంజావూరు నేలిన అభినవ భోజ బిరుదాంకితుడగు శ్రీ రఘు నాథ శౌరి వారి ముఖ్యాశ్రితుడు. అతడు సరస సంగీత సాహిత్యములను హృద్గతము చేసికొన్న ప్రజ్ఞాశాలి. స్వయము గ్రంథకర్త. మహాదాత. కృతి కర్తయు, కృతిపోషకుడును ఆరితేరిన కపులు; అందె వేసిన చేతులును. కనుకనే చేమకూర కవీంద్రుని కవిత్వ మాధుర్యమును గ్రహించి, అతనిని రఘు నాథ శౌరివారు మిక్కిలి ఆదరించినారు. అనగా సత్కవి సమ్మానము చేసి తన్ను తాను గౌరవించుకొనెను.

విజయవిలాసము ముద్దులు మూటగట్టు కావ్యరాజ మనుట అత్యుక్తి కాదు. ప్రతి పద్యము రసోదంచితమేగాక చమత్కార భరితమును. ఈ హేతువును పురస్కరించు కొనియే విజయవిలాసము కావ్యరాజ మనుట. ఈ ప్రబంధ మున వర్ణితము లయిన విజయునివిలాసము లెంత హృదయా

నంద సంధాయకములో, అటులనే సుభద్ర, చిత్రాంగద, ఉలూచిమున్నగు నాయికలనుగూర్చి చిత్రితములయిన విషయములు కూడ మనోజ్ఞములే! కిరీటి వరించిన కన్నెలలో పేర్కొన దగినది సుభద్ర.

సుభద్రార్జునుల వైవాహిక ఘట్టమున చేమకూర వేంకట కవి తన కవితా కౌశలమును ప్రదర్శించి సహృదయుల సంస్తుతిని సముపార్జించినాడు. ఈ కథా భాగము విజయవిలాస కథా కథనమునకు జిగినే కాక బిగువును గూడ ప్రసాదించినది. సుభద్రార్జునుల ప్రేమానుబంధమునకు ఫలితముగ తొలుత యుద్ధ మొకటి సంభవించినను, తుదకు 'పిల్లల పిడుగు,' పద్మ వ్యూహమును భేదించిన బాలవీరుడు నగు అభిమన్యుని జనకే జనకు లయినారు సుభద్రార్జునులు!

సుభద్రాదేవినిగూర్చి విన్న నాటినుండియు విజయుడు మోహావేశుడై ఆమెను ఎప్పుడు చూడగలుగుదునో అని తమకించుచుండెను. ఇంతలో దైవికముగ అతనికి భూ ప్రదక్షిణము చేయు నవసరము కలిగినది. తొలుత గంగాస్నాన మొనరించిన ఫలితమో లేక మతియేమో కాని నాగకన్యయగు ఉలూచి విజయుని సౌందర్య గరిమను చూచి ముగ్ధయైనది.

'తీరిచినట్టులున్నవి గదే కను బొమ్మలు, కన్నులంటి మా చేరల గొల్వగావలయు, జేతుల యందము చెప్పగిప్ప' రాదనుచు నతని తనూ శోభను తనివిదీర వర్ణించినది! కడకు విజయుని వివాహ మాడ యత్నించి ప్రేమ భిక్ష పెట్టుమని అర్థించినది. కాని విజయు డేవో సాకులు చెప్పినను ఉలూచి మాత్రము 'కన్నియగాని వేఱొకతె గాను; మనోహరరూప! నీకు నే

జిన్నియవట్టి యుంటి నెల జవ్వన మంతయు నేటిదాక; నా కన్నులయాన, నా వలపు గస్తురి నామముతోడు, నమ్ము, కాదన్నను, నీదు మోవి మధురామృత మానిట బాస సేసెదన్' అని వేడుకొన్నది.

చేమకూర వేంకట కవి ఎంతటి గడుసు పోకడలు పోయినాడు! నేటిదాక తన జవ్వనమునే మీదుగట్టినదట ఊలూచి! ఎంత చమత్కృతి. ఉరగీశ్వర గీతికలను విన్ననాటినుండియు, తన మనసును విజయునిపై లగ్నము చేసి, అతని సౌందర్యమును స్తుతింప నారంభించినది. కనుక ఈ చమత్కారము సంపూర్ణ సత్యమే కాని అత్యుక్తి కాదు. మనోహర రూప! అని సంబోధించి నా కన్నుల యాన, నావలపు గస్తురి నామముతోడు—అని తన మనసు మర్మములను వ్యక్తమొనర్చినది. ఈ మాటలలో ఎంత క్రొత్తదనము! తుదకు ఊలూచి, చిత్రాంగద కన్యారత్నములను వివాహ మాడి విజయుడు సంతానవంతు డయ్యెను. అయినను, సుభద్ర మీది తమకము మాత్రము అతనిని వీడలేదు. ఈ సందర్భమున కవికూడ తన సహజమైన కవితాచమత్కృతిని వీడలేదు.

అర్జునుడు దక్షిణ నాయకుడే అయినను, వేంకటకవి మాత్ర మతని ప్రేమను ఆదర్శవంతము చేయుటకు కాబోలు తనవచో విలాసము నంతయు వినియోగించినాడు. బలరాము డున్నంత వరకు సుభద్ర తనకు కైవసముగాదని విజయునకు తెలియును. కాని తన ప్రణయమును వమ్ము చేసికొనుటకో అతని మనము వెనుకంజ వేసినది. యాదవులు యతులకు విధేయు లగుదురని ధైర్యము తెచ్చుకొని, సుభద్రను కోరి సన్న్యాస స్వీకారమునకు విజయుడు తల యొగ్గెను. ఇట్లు ముక్త సరిగా మూడు ముక్క-

లలో ముగించినచో, విజయుని ఆదర్శ ప్రేమకు భంగము వాటిల్లునని యెంచియో లేక నవమన్మథుడగు విజయుడు సన్యాస ము స్వీకరించెనని తన సహానుభూతిని ప్రదర్శించుటకోగాని చేమకూర కవిరాజు—

'అంగనల పొందు రోసి సన్యాసి యగుట
గద యుచిత మెందు; నా నవ మదన మూర్తి
యంగనామణి గోరి సన్యాసి యయ్యె'

అని విజయుని కపట సన్యాసమునకు ఒక ప్రత్యేకతను కల్పించినాడు!

అప్పటికిని విజయునకు మనస్థిమితము లభింపలేదు. కాని అఘటన ఘటనా చతురుడగు కృష్ణుడున్నాడుగదా, తప్పక కార్యము నెఱవేరునని సంతుష్టాంతరంగుడై హరిని సందర్శించెను. యాదవ ప్రముఖుడు మాత్రము సామాన్యుడా! విజయుడు నచ్చిన రాకను గ్రహించి అతని యభీష్ట సిద్ధికి యత్నము చేయ దొడగెను. రైవత కోత్సవము సమీపించినది. ఆ సందర్భమున అందాల కొలికి యగు సుభద్ర ఉత్సవమున పాల్గొనుటకు రాగా, ఆ తొలకరి మెఱపును చూచినతోడనే తొలకరి దొర బిడ్డనికి దొంతర దొంతరలుగా తీయని భావములు స్ఫురణకు వచ్చినవి. అతని హృత్కమలము వికసించినది. గాలిదెబ్బకు తట్టుకోలేక అటునిటు నల్లలాడు లేదీగ వలె, విజయుడు సుభద్రను చూచిన వెంటనే మోహావేశుడై ఆమె సౌందర్యోపాసనము చేయుచు—

'కన్నులు దీర్ఘముల్, నగు మొ
గంబవురా! తలకట్టు తమ్మిపూ

పున్నమ చందమామలకు;

బొక్కిలి చక్కదనంబు జెప్పగా

నున్నదె! మేలు బంతులు ప

యోధరముల్, మఱి కొను సున్నయా

నెన్నిక కెక్కు ద్రాత ఫల

మివ్వర వర్ణనికిన్ నిజంబుగన్

అని ద్రాత ఫలమును చమత్కరించినాడు!

ఉత్సవానంతరము బలరాముడు విజయ యతిని సందర్శించి, స్వాము లెందుండి వచ్చినారని వినయోక్తుల ప్రశ్నించెను. తాను చూచిన నదులు, నిధులు, ఆశ్రమములు, తీర్థములు - మున్నగు వానిని వివరించి విజయుడు బలరాముని యాదరాభిమానములకు పాత్రుడగుటయేకాక 'చాతుర్మాస్య మిచ్చోటనే సలుపంగావలె స్వామి వా'రను హలాయుధుని వేడి కోలును కూడ గ్రహించినాడు!' తుదకు యతి శుశ్రూషకై సుభద్రను నియోగించుటకును సాహసించినాడు బలరాముడు! కాని చతురుడైన కృష్ణుడు మాత్రము—

'వయసు వారును జక్కనివారు వీరు
మనసు మర్మంబు లేవియు మనకుఁ దెలిసి'

యున్నవి కావు. కావున కన్యయగు సుభద్రను శుశ్రూషార్థము నియమింపవచ్చునా? అని సంశయమును వెలిబుచ్చెను. కాని బలరాముడు సహేతుకమగు సమాధానము నొసగి కృష్ణుని సమాధానపఱచి సుభద్రను కుహనాసన్యాసినీ సేవార్థమై నియోగించెను.

ప్రేయసీ ప్రియులైన సుభద్రార్జునులను సన్నిహితులను చేసిన సందర్భమున చేమకూర 'రావమ్మ సుభద్ర—నీ యభిమతార్థము లెల్ల ఫలించు నియ్యెడన్' అని శ్రీ కృష్ణుని మూలమున పలికించిన నర్మోక్తులు పరిశీలింపదగినవి. పిమ్మట తాను పెద్దవాడగుటచే సోదరికి బుద్ధులు గఱపుచున్నాడు కృష్ణుడు!

'కామాది స్ఫురణంబులెల్ల నడగంగా జేసి ధన్యాత్ములా
స్వాములై వీరలు; వీరి కింపొదవు తేనన్ సేవగావింపు మెం
తో మోదంబున నానతిచ్చి బలభద్రుండే నియోగించినా
డేమో చెప్పితి నంచు నుండెదవు సుమ్మీ సోదరీ.'

సహజముగ కృష్ణుడు మహా లౌక్యుడు. అసమాన తంత్రజ్ఞుడును. అట్టివానికి నర్మ సంభాషణము వెన్నతోపెట్టిన విద్య. సుభద్రార్జునులకు సంధానముగూర్చు సమయమున యదు ముఖ్యుడు నర్మ గర్భముగ మాటలాడుటయేగాక, భావి సంఘటనను కూడ సూచించుచున్నాడేమో అనిపించుచున్నది. ఏలయన సుభద్రార్జునుల వివాహము బలరామునకు ప్రీతి పాత్రము కాలేదు సరికదా, మేనల్లునితో వియ్యమందుటకు బదులు కయ్యమునకు దిగినాడు. అట్టి సందర్భమున కూడ తన్నెవ్వరును పల్లెత్తుమాటయైనను పలుకకుండునట్లును, యుద్ధమునకు తా నెంతమాత్రము కారణభూతుడు కాదని నిరూపించుటకును ముందరి కాళ్లకు బంధము వైచినట్లుగ కృష్ణుడు, 'ఎంతో మోదంబున నానతిచ్చి బలభద్రుండే నియోగించినాడు' అని తన్ను తాను సంరక్షించు కొనుచున్నాడు. ఇక తుది పలుకులుగా—ఏమో చెప్పితి నంచు నుండెదవు సుమ్మీ సోదరీ—అనుచు మరల సుభద్ర యభీష్టము సిద్ధించు సమయ మాసన్నమైనదని చమత్కరించుచున్నాడు. ఇసుక పాతరవలె

తీసిన కొద్ది భావములు తమంత తాము బహిర్గతములగు చుండుట చేమకూర వారి కవిత్వ విశేష మనవచ్చును.

ఇంత చమత్కృతిని, వైశిష్ట్యమును ప్రతి పద్యమునందును మిళితముగావించిన చేమకూర వేంకటకవి ప్రతిభను కొని యాడక తప్పదు. శ్రీ కృష్ణుడెంతటి నర్మ సంభాషణ చతురుడో, వేంకట కవి కూడ అట్టి చతురుడు. ముక్కుతిమ్మ నార్యుని ముద్దు పలుకులలో ముకుళితహాస్తుడై బంధితుడైనలె భార్య ముంగల నిలబడిన కృష్ణుడు వేంకనార్యుని వచోవిలాసముచే మాటకారిగను, మధ్యవర్తిగను వెలుగొందుచున్నాడు. ఒక ఉదాహరణము. సుభద్రార్జునులు ఇంద్ర ప్రస్థమునకు పయనము సాగించినారు. ఈ విషయము బలరామునకు కోపజనక మైనది. యుద్ధము కూడ ఉభయుల మధ్య ఏర్పడినది. అప్పటికిని బలభద్రుని కోపాగ్ని చల్లారలేదు. అప్పుడు కృష్ణుడు సహజ వాఙ్మాధుర్యముతో విజయుని బాహు బలమును వివరించుచు,

‘మాలిమి లేదు గాన, ననుఁ
మానము నామదిఁ దోఁచె, నప్పుడే
బాలిక సేవసేయఁ బను
పన్ వలదంటిని గాదె!’

అని తన నిర్దోషిత్వమును నిరూపించుకొని, నాగవల్లి లోపల నిష్ఠురము లాడిన లాభమేమి? ఇంతకును విజయుడు మాత్రము లాతియా? మేనమఱదియేగదా! అనుచున్నాడు. ‘తమ్ముని మాటయన్న జవదాటని యన్న’ కాబట్టి బలరాముడు సుభద్రార్జునుల వివాహమునకు సమ్మతించి సపరివారముగ

ఇంద్రప్రస్థపురమునకు జనెను. ఈ విషయము కృష్ణుని మధ్యవర్తిత్వమునకు మంచి నిదర్శనము. ఇటుల వేంకనార్యుని శ్రీకృష్ణుడు అందరికిని తలలోని నాలుకవలె మెలగుచున్నాడు.

విజయవిలాస కావ్యాంబరమున విజయయతిని సుందరి యగు సుభద్ర శుశ్రూసించు ఘట్టము మినుకు మినుకుమని మెఱయు చుక్కవంటిదికాక మహోజ్జ్వలముగ వెలుగొందు ధ్రువతార వంటిది. ధ్రువతారకు గల చిరంజీవిత్వమే రసభరిత మగు నీ ఘట్టమునకును కలదు. రసహృదయుల కిది మధుర భావ తరంగిణి, మనోజ్ఞ దృశ్యము. అసలు విజయవిలాసమే మనోహర కావ్యము. అందును విజయుని విలాసములు మనోహరములు. అందును సుభద్రతోడి విజయుని విలాస ములు మఱింత మనోహరములు!

చందురకావి పావడపై సరిగంచుచీర గట్టి మంజీరములు ఘణిల్లు మని మ్రోగుచుండగా, యతి సేవార్థమై సుభద్ర మునిరాజగు విజయుని సమీపించినది. ఆమె రాకను చూచి కపట సన్న్యాసి జపస్సమాధిలో నిమగ్నుడయ్యెను. ఎంతసేపటికిని అతడు మాటాడని హేతువుచే, సుభద్ర సవినయముగ, 'ఓ మహానుభావా! ఏమి కావలె దేవపూజ కిపుడు?' అని అర్థించినది. అప్పటికిని మాటలాడక అంగీకార సూచకముగా చేసైగతో విజయుడు ప్రత్యుత్తర మొసగెను. తదాజ్ఞను సుభద్ర సహర్షముగ స్వీకరించినది. 'చకిత బాల మృగీచక చకితనయన' యై పసిడిగాజుల మిసమిసలతో తళతళలాడు చున్న కరములతో తాను సేకరించి తెచ్చిన పత్ర, పుష్ప, ఫల, జలాదికములను విజయ యతి సమక్షమున నుంచెను. ఇంకను కొంతతడవు విజయుడు జప మాచరించెను. ఎందుల

కింత దీర్ఘజపము? అను ప్రశ్నకు సమాధానముగ వేంక నార్యుడు, 'చేసినది జపము, వేసినది గాలము'—అను లోక్తిచే జపమునంగల అంతరార్థమును స్పష్టము చేసినాడు.

లోకోక్తులను గాని, అర్థాంతరన్యాసాలంకారములను గాని వాడుటలో వేంకనార్యుడు సాటిలేని వ్యక్తి. అతని ప్రత్యేకత అనిర్వచనీయము! సాధారణముగా లోకోక్తులను వాడునపుడు వానియందలి సామాన్యార్థమును గ్రహించి సంతృప్తి చెందుట పరిపాటి. కాని చేమకూర వారి లోకోక్తి ప్రయోగము వాస్తవికతతో కూడియుండును. విజయుడు నిజముగ జపము చేయుచునేయుండెను. అట్లు కావించుటలో అతని అభిమతము సుభద్ర ఆదరాభిమానములను పొందుట. కనుక విజయుని జపమునకు ఫలము సుభద్ర హృదయాకర్షణము. లోకోక్తిని నిశితముగ పరిశీలించినను, ఆ సందర్భమునకును నానుడియందలి భావమునకును సన్నిహితత్వము కనిపించుచునే యుండును.

విజయుని అభిమతమును విశదీకరించినను అతడు చేసినది కొంగ జపమా? లేక నిజమగు జపమా? ఎవరినిగూర్చి జపము చేసెను? ఎటుల జపించెను? ఏమని జపించెను? అను ప్రశ్న పరంపరకు ప్రత్యుత్తరముగ చేమకూర వేంకటకవి మధుర గీతిక రూపమున ఇట్లనుచున్నాడు:

'భామ మోమున వ్రేలు రూపంబుఁ జూచి,
ముదిత యెదఁ బాయకుండెడు మూర్తిఁ దలచి
రమణిమై సగమైన విగ్రహము నెంచి
ప్రోవు మని వేఁడుకొను దేవపూజవేళ.'

ఎంత చమత్కృతి! ఆ చమత్కృతియందును ఎంత యథార్థత! అర్జునుడు నిజముగ సుభద్రను స్తుతించెనా? లేక బ్రహ్మవిష్ణు మహేశ్వరులను భక్తితో సేవించెనా? అను భావద్వయము గోచరించును. ప్రత్యక్షముగా త్రిమూర్తులను త్రికరణ శుద్ధిగా సేవించుచున్నట్లు ద్యోతక మగుచున్నను, అతడు పరోక్షముగ తన హృదయేశ్వరి యగు సుభద్రాదేవి సౌందర్యోపాసనము జరిపినట్లు గోచరింపకమానదు. ఇంతకు విజయుని అభ్యర్థనము—బ్రోవుమని వేడుకొను దేవపూజ వేళ. ముముక్షువగు విజయుని లక్ష్యము నిడియే. ఓ మహానుభావా! ఏమి కానలెను నీకు? అని నోరార పలుకరించిన సుభద్రకు 'బ్రోవుము' అని విజయుని పక్షమున వేంకనార్యుడే ప్రత్యుత్తర మొసగుచున్నాడు.

తీయని తేనియ లొలుకు నీ కమ్మని పద్య మొక్కటే చాలును, వేంకనార్యుని చమత్కృతి విధానమును గ్రహించుటకు. శ్లేషను శైవసము గావించుకొని మధురభావ స్రవంతిని తన కవిత్వ కేదారమున ప్రవహింప జేయుచున్నాడు. ఈ నేర్పు నకు చేదోడు వాదోడైనది వేంకనార్యుని మధుర పదగుంభనము. దీర్ఘసమాసములా లేవు. పదకాఠిన్యమా వాళక్కా. అన్వయ వైషమ్యమా అసలే లేదు. అమృతపు తునుకలవంటి చిన్న చిన్న మాటలు. అయినను వానికి విద్యుత్ప్ర వాహపు శక్తి గలదు. శైలి సుబోధకము, సుగమము, సుందరమును. కనుకనే చేమకూర వారి శ్లేషోక్తులు సుధారసోక్తులుగా రూపొందినవి. ఇంత వైశిష్ట్యముతో చమత్కారముగా కవిత్వము చెప్పటలో వేంక నార్యుడు ధురీణు డని విజయవిలాసకృతి పోషకుడగు రఘునాథరాయలు—

'ప్రతి పద్యమునందు జను
తృతి గలుగఁ జెప్పనేర్తు వెల్లెడఁ బెళుకా
కృతి వింటి మపారముగా
క్షితిలో నీ మార్గ మెవరికిఁ గా దుసుమీ'

అని ప్రస్తుతించియున్నాడు. నిజమునకు చేమకూర కవివరేణ్యు డీ స్తుతికి తగినవాడు!

ఇటుల భయభక్తులతో సుభద్ర ఆ యతిగ్రామణికి శుశ్రూష చేయుచుండెను. నిజమైన సన్న్యాసివలె విజయుడు కడు నిపుణముగ సంచరించుచుండినను, అతని సౌందర్యాతిశయమును వీక్షించి అతడు విజయుడై ఉండనోపునని సుభద్ర పసిగట్టెను. యతి మహాసుకుమారు డగు రాకొమరుడై ఉండవచ్చుననియు సంశయించెను. తుదకు సన్న్యాస మెంత మాత్రమును ఈ సుకుమార గాత్రునికి సమంజసము గాదని తలచెను. 'కలరుగా మఱి మానిసిఁ బోలు మానుసుల్' అని సంశయాత్మయై అతడు విజయుడో కాడో అనుకొన్నది. ఆమె హృదయ మీ విధముగ డోలకమువలె అటునిటు ఊగులాడుచుండినను, సుభద్ర యథాపూర్వముగ విజయునకు శుశ్రూష చేయుచుండెను.

సుభద్ర సలుపు సపర్యలకు సంతసించుచు, విజయుడామె సౌందర్య గరిమను వివిధ కోణములనుండి వీక్షించుచునేయుండెను. కాని తన నీమములను కూడ జరుపుకొనుచునేయుండెను. పరిచయాధిక్యముతో బాటు సుభద్రమీది తమకము కూడ దినదినాభివృద్ధి గాంచుచుండెను. 'నిద్దంపు మేలి సొమ్ముల'తోను, 'కమ్మని కస్తూరి బొట్టు'తోను, 'దిన చల్వల'తోను,

'ప్రౌఢోక్తి సింగారము'తోను సుభద్ర అతనిని సమీపించుటయే తరువాయి—అతడు మోహాతురు డగుట పరిపాటి. కాని హృదయాంతరాళములలో అణగియున్న ప్రేమను బహిర్గతము చేయుటకు విజయుడు ముందంజ వేయ నొల్లడు. ఒకవేళ వేసెనా, వెంటనే వెనుకంజ వేయుటకు ముందంజ వేయును. అతని పరిస్థితి అయోమయము; అవ్యక్తమును. ఏమేమో అనుకొనును. కాని సంశయించును. జపావృత్తిపై విముఖత్వము గలుగలేదు. కాని దానిని మఱచెను. ఆమెను వీక్షింపని గడియ ఒక యుగముగ ఉండెను. ఇక అతని భోజన విధానమా చిత్రాతి చిత్రము! భోజ్యముల వివరములతో పనిలేదు. వాని రుచులు అక్కఱ లేదు. అతనికి తృప్తి యేరీతి నుండెనో తెలియరాదు. కాని భోజనము ముగించి చేతులుకూడ కడుగుకొనెడివాడు!

ఇక విజయుని విలాసములను గమనింతము. ఒకతూరి సుభద్ర తన సమీపమున నుండగా 'తుమ్మెదవలె నున్నది యిటు' రమ్మని విజయు డామె నెఱికొప్పును నిమిరి యెంతో పశ్చాత్తప్త హృదయునివలె నటించుచు, 'భ్రమసితీ దరుణీ కమ్మవిరి నల్లగల్వా'యేకాని తుమ్మెదకాదని సమర్థించుకొనును. ఇంకొక తేప—

'తెమ్ము బంగారు కుండ జలమ్ము' లనుచుఁ,
'దెమ్ము లతకూన మంచి సుమమ్ము' లనుచుఁ,
'దెమ్ము బాగైన కొమ్మ ఫలము' లనుచు

నర్మోక్తు లాడును. గాజుపట్టకము పయి సూర్యకిరణములు పడినేని వికిరణ మేర్పడి వర్ణమాల యెట్లేర్పడుచున్నదో, అటు

లనే వేంకనార్యుని కవనము విశుద్ధమగు భావమాలను సృష్టించుచుండును. ఒకతూరి చదివిన సామాన్యమగు భావమును, మఱొకసారి చదివిన విశేష భావమును గోచరమగుచుండును. ఇట్లు మధురభావములు గోచరము లగుటవలననే భావమాల యనుట! ఉదాహరణముగ పై పద్యమును—

'తెమ్మ బంగారు కుండ! జలమ్మ' లనుచుఁ
'దెమ్మ లతకూన! మంచి సుమమ్మ' లనుచుఁ
'దెమ్మ బాగైన కొమ్మ! ఫలము' లనుచు—

అనియు చదువవచ్చును గదా!

విజయు డీ విధముగ మాటలతోను, చేతలతోను తన లోగుట్టులను దిజ్ఞాత్రముగ వ్యక్తీకరించుచున్నను సుభద్రపై వాని ప్రభావ మేమియు లేదేమో అనిపించును. కాని విజయునిపై ఆమెకుగల ఆదరము కొండంత. తొలుత కపట సన్న్యాసి వదనమండలమున ద్యోతకములగు విజయుని సౌందర్యచ్ఛాయలను గుర్తింపక పోలేదు. ఇతడు విజయుడు కాడేమో అని సంశయించి విజయుని యం దనురాగ మున్నను, యతి ముంగల దానినిగూర్చి తలపోయుట భావ్యము కాదేమో అని సంశయించి, మౌనము వహించినదేమో! కాని విజయుడే ఆమెకు వలపు చెలికాడని, ఈ క్రింది సంఘటన తెలివిడి చేయుచున్నది.

ఒకనాడు భోజనానంతరము విజయుడు వితర్దిపై ఆసీనుడై యుండెను. అతనికి సమీపమున సుభద్రయు నుండెను. ఆమె గారాబుటంచ ఒకప్రక్క, మఱొకవైపు చిలుకయు నుండెను. ఏకాంతముగనున్న సుభద్రను చూచి—

'చెలువ! నిను రాజకీరంబు చెట్ట వట్టెఁ,
గలికి! నిను రాజ హంసంబు కాలుద్రొక్కెఁ,
మంచి శకునంబు లివి నాదుమాటఁ జూడు
కన్నె! యీలోనఁ బెండ్లి కాగలదు నీకు'

అని నర్మముగ విజయుడు నుడివినాడు. ఇవి సరోక్తులే అయినను సరస స్వభావోక్తులు. అందులోను చమత్కృతి! విజయు డేమియు దబ్బఱలు పలుకలేదు. సుభద్ర ప్రక్కన నున్న చిలుక, హంసలను చూచి నుడివెనేకాని, అసంగతము లేవియు లేవు. నిజమునకు కీరము చెట్టవట్టుట, హంస కాలు ద్రొక్కుట అనునవి కన్యకు శుభోదయ చిహ్నములు. ముఖ్యముగ నుడువదగిన భావమేమన: రాజకీరము, రాజహంస —అని నుడువుటలో రాకొమరుడగు విజయుడు నిన్ను వరించుటవలన అచిరకాలమునసే నీకు వివాహము జరగునని సూచించుచున్నాడు. అదియునుగాక విజయుడు యతి, సుభద్ర యీడువచ్చిన కన్నె. ఆమె శ్రద్ధాభక్తులతో శుశ్రూష చేయుచున్నది. కాగా యతి 'రాజకుమార ప్రవరు డొకడు సుభద్రకు లభించునుగాక' అని ఆశీర్వదించుట కూడ సమంజసముగనే కన్పించుచున్నది. ఇటుల లోతును తెలిసికొనిన కొలది మధుర మనోహరభావ తరంగములు తమంత తామే దొరలి దొరలి గట్టును చేరుకొనుచున్నవి, జలార్ణవ జనితములైన తరంగములవలె.

'పెండ్లి కాగలదు నీకు' అని వినినంతనే సుభద్ర లజ్జా వరవశయైనది. ఆహా! మహాత్ములనిన వీరేకదా! తన చేసిన సేవకుగా మన మలరి వచించిరని లోలోన సంతసించినది. వచించుటయేకాక వరించుటయు జరిగినదని ఆమె యింకను

తెలిసికొనలేదు. ఇన్నాళ్లకు యతి నోటినుండి ముత్యముల వంటి మాటలు వచ్చుటచే తగిన తరుణము లభ్య మయ్యోనని యెంచి విజయునిగురించి గ్రుచ్చి గ్రుచ్చి అమిగ మొదలిడి నది. విజయునిపై ఆమెకుగల నిండారు ప్రేమను బహిర్గత మొనరించినది. 'స్వామీ! తమరు చూడని పుణ్యభూములు లేవు గదా. మీవలన కొన్ని విశేషములు తెలిసికొనవలయు నని తత్తరపడుచున్నాను' అను పీఠికతో ఉపక్రమించి

'మీ రింద్రప్రస్థము గని
నారా? పాండవుల జూచినారా? సుఖులై
వా రందఱు నొకచో ను
న్నారా?'

అని సామాన్యముగా అడిగి ప్రత్యేకముగ తన ప్రియుడగు వీరాగ్రగణ్య గానరుగా? అని ప్రశ్నించినది. సుభద్రపై విజయున కెంత అనురాగమో విజయునిపై సుభద్రకును అంత కంటె విశేషానురాగము. అంతటితో ముగించుట కిష్టము లేక సుభద్ర విజయుని దివ్య సుందర విగ్రహమునకు వాగ్రూప మున వన్నెచిన్నెలు దిద్దినది.

'ఎగు బుజంబులవాడు, మృగరాజమధ్యంబు,
బుడికి పుచ్చుకొను నెన్నడుమువాడు,
నెఱివెండ్రుకలవాడు, నీలంపునికరంపు
మెఱుఁగుజామసచాయ మేనివాడు,
గొప్ప కన్నులవాడు, కోదండగుణకిణాం
కములైన ముంజేతు లమరువాడు,
బవిరి గడ్డమువాడు, పన్నిదం బిడి డాగ
వచ్చునందపు వెన్నమచ్చవాడు.

గరగరనివాడు నవ్వు మొగంబువాడు
చూడగలవాడు మేలైన సొబగువాడు.
వావి మేనత్తకొడుకు కావలయు నాకు
నర్జునుండు పరాక్రమోపార్జునుండు,'

సుభద్ర కింతటి వర్ణనా శక్తి కలదో లేదో కాని చేమకూర వేంకనార్యుని ధర్మమా అని సుభద్రకు తెనుగు సాహిత్య సుందరోద్యానమున స్వైరవిహారము సలుపుటకు స్వాతంత్ర్యము లభించినది. చామనచాయ మేనివాడయినను, విజయుని రూపచిహ్నములు తళతళ మెఱయు గాజుముక్కలవలె గాక ధగధగ మెఱయు నిప్పు కణములవలెగాక కాంతులీనుచు వెలుగొందు జాతి రత్నముల వలె శోభించుచున్నవి.

తీర్థయాత్రా సందర్భమున విజయుని జూచితి మని కపట సన్యాసివలుకుటయే తడవుగా సుభద్రకు మితిలేని సంతోషము కలిగినది. 'రాడుగా యిచ్చటికి' అని యెంతో జాలిగా పలికినది. సుభద్ర మనసు మర్మములను గ్రహించిన విజయుడు స్మితవదనుడై 'మీ రెచట గంటిరో యంటివి? కన్నమాత్రమే యేమని చెప్పవచ్చు, నొక యించుక భేదము లేక యాయనే మేమయి యున్నవారము సుమీ, వికచాంబుజపత్రలోచనా!' అని స్వవిషయమును విదిత మొనరించెను.

విజయుని ప్రత్యుత్తరము రసవత్తరమే కాక సత్య సన్నిహితమును. నర్మోక్తు లాడినను విజయుడు సత్యవ్రతుడగు ధర్మజుని తమ్ముడుగానే సంచరించుచున్నాడు. ఒక యించుక భేదము లేక ఆయనే మేమయి యున్నవారము — అని చెప్పటలో వేంకనార్యుడు తన చమత్కృతిని స్పష్టము చేసినాడు. ఇంకొక విశేషము కూడ ఉన్నది. వికచాంబుజ పత్రలోచనా అను

సంబోధనలో సార్థక్యమును కూడ సాధించినాడు! అంబుజ లోచనా యని కాని, హరిణేక్షణా యని కాని సంబోధించి యుండవచ్చును. వికసించిన తామర రేకులవంటి కన్నులుగల సుభద్రా! అనుటలో సుభద్ర నయన సౌందర్యమును కవి తెలుపుచున్నాడు. అంతేకాక చేరెడేసి కన్నులు కలిగియు యింత దనుక విజయుని గుర్తింపలేకున్నావు. ఆయనే మేమయి యున్న వారము. ఇప్పటికిని మించిపోలేదు. కన్నులు తెరచి చక్కగా చూడుము. విజయుడు నీ సమక్షమునసే ఉన్నాడు— అను వివిధ భావములను వ్యక్తము చేయుటకు కాబోలు, సందర్భ శుద్ధికి దోహద మొనర్చునట్టి సరసమయిన సంబోధనము వాడినాడు.

గోకర్ణములో విజయునితో ఉంటినని, విజయయతి అనగానే మరల సుభద్ర, ఆ గోకర్ణ మెక్కడ గలదు? ఇక్కడి కది యెంత దూరము? ఇంతకు విజయు డిక్కడికి వచ్చునో లేదో? ఒకవేళ అక్కడినుండియే యింటికి మరలునేమో? అని యతిని గ్రుచ్చి గ్రుచ్చి అడిగినది. ఇక ముభావముగా ఉండుట సమంజసము గాదనియు, సుభద్ర హృదయము విజయానురాగ సంవర్ధిత మనియు గుర్తించి నరోక్తులకు స్వస్తి చెప్పి విజయుడు తన విషయమును వ్యక్తపరుప సన్నద్ధు డయ్యెను.

'నీ సమక్షమున యతివేషమున నున్న నేనే నీ ప్రేమ మూర్తిని! నీకై తపంబు జేసెద. నేడే లోకోత్తర శుభలగ్నము, నా యభిలాషను మన్నింపు'మనుచు విజయుడు తన వృత్తాంత మును వ్యక్తము చేసెను. తోడనే సంభ్ర మాశ్చర్య సంభరితయై లజ్జావనతవదనయై 'ఇతనిని విజయు డనియే తొలుత భావించితినిగాని సంశయించి ఊరకే నేవలొనర్చుచుంటిని

గదా' అని సుభద్ర సిగ్గుతో దిగ్గున లేచెను. అచట నిలుచుట కును ధైర్యము చాలక గృహమునకు కాబోలు తిరుగు ముఖము పట్టినది. కాని చనవు లభ్యమయిన హేతువుచే 'నిలు, నిలు బాల!' అనుచు సవ్యసాచి ఆమెను వితర్దిపై ఆసీన జేసెను. పిమ్మట బుజ్జగింపు మాటలుగా విజయుడు, ఇంతకు మున్ను నిన్ను నేను గాని, నీవు నన్ను గాని చూచియుండలేదు. వినికిడి మాటల ననుసరించి మనము ప్రేయసీప్రియుల మయితిమి. నాతో నీవు మాటలాడుటకు సిగ్గుపడితివేని నీ ముంజేతిపై నున్న గారాబు చిలుకతో నైనను నుడువరాదా? పలుకే బంగారమా!' అనెను.

ఈ చిలుక రాయబారమునుగూర్చి ప్రస్తావించునపుడు నైషధకావ్యమునందలి హంసరాయబారము స్ఫురణకు వచ్చును. కాని క్రొత్త పోకడలలో రాయబారమును నడిపించి వేంక నార్యుడీ ఘట్టమునకు నూతనత్వము నొసగెను. వేంకనార్యుడు సృష్టించిన చిలుక రాయబారిగానే గాక ప్రవక్త వలె హితోపదేశ మొనర్చి సహృదయుల సమ్మోదమును సము పార్జించుచున్నది. తన్ను వివాహ మాడుమని వేధించుచున్న విజయునకు చిలుక మూలముగ సుభద్ర చేసిన విన్నపమును చూడుడు:

'మేరలా యివి మీ యంత వారలకును?
బెద్ద లున్నారు వారెల్లి పెండ్లి సేయఁ
గలరు, వేగిర పాటింత వలదటం...'

ముత్యాలవంటి యీ మూడు ముక్కలలోను దాగియున్న హాస్యము గమనింపదగినది.

విజయా! నీవంటివాని కీర్తి మాటలాడుట మర్యాదయేనా? సన్న్యాసవేషము ధరించి వయసు కన్నెతో సరససల్లాపము లాడుచు, శుశ్రూషార్థమై నియోగింపబడిన కన్నెను వివాహ మాడుట న్యాయమేనా? అదియునుగాక విజయు డిప్పటికే గృహస్థాశ్రమము స్వీకరించి సంతానవంతుడు నయ్యెను. వారిని వీడి మఱొక కన్యను వరించుటకు సాహసించుట పాడి యేనా? సరి, సాహసించితివి పో. పెద్ద లింకను సజీవులై ఉన్నారుగదా! నీ అగ్రజుడగు ధర్మజు డుండగనే నీవు స్వతంత్రించుచున్నావా! పెద్దలకు మాత్రము తెలియదా, తమ సంతానముల కెపుడు వివాహాదులు జరపవలయునని? మూడవ కంటికి తెలియకుండగ వివాహము చేసికొనుమని బలవంతము చేసెదవేమి?" ఇంత వేగిరపాటా? ఈ తొందరపాటు వలన ముప్పు కలిగిన, అప్పు డెవరు బాధ్యులు?

సూక్ష్మదర్శిని సూక్ష్మములగు వస్తువులను పెద్దవిగ గోచరింప జేయును. దూరమున నున్న వస్తువ్రులను దూరదర్శిని కండ్లకు కట్టునట్లుగా కన్పింప జేయును. అంతేకాని, ఒక వస్తువును పలు వస్తువ్రులుగా విభజించి వేర్వేఱుగా ప్రదర్శింపజాలవు. కాని మహాకవి యగు వేంకనార్యుని నేత్ర విశేష మెట్టిదో కాని వివిధ కోణములనుండి చూచినను వివిధములగు భావములను దర్శించునట్టి శక్తి దానికి గలదు. అతని నేత్రము సుందరభావ ప్రదర్శిని కాబోలు!

వివాహితుడయిన విజయుడు మఱొక మహిళకై అంగ లార్చుట అసమంజసముగ కన్పింపవచ్చును. కాని ప్రాతకాలపు రీతినిబట్టి చూచిన రాకొమరులకు బహు భార్యాత్వము నిషిద్ధము గాదు. అదియునుగాక విజయుని వలపు నేటిది కాదు.

చిన్ననాటినుండియు సుభద్రపై తీరని తమకము! తీర్థ యాత్రా రంభమున కూడ సుభద్రను దర్శించుటయే అతని మనోరథము. త్రోవలో తటస్థపడిన ఉలూపి, చిత్రాంగదలు విజయుని వలచి నరించిరి. కాని విజయుడు సుభద్రను వలచి వరింప సన్నద్ధు డయ్యెను. సుభద్రార్జునుల ప్రణయగాథ బలరామునకు తెలిసిన, అతడు మండిపడును గాని మోదము చెందడు. సుభద్రను దుర్యోధనున కిచ్చి వివాహము చేయవలయుననియే అతని అభిమతము. కృష్ణు డెంత పాండవ పక్షపాతియో బలరాము డంత కౌరవ పక్షపాతి. కనుకనే యీ విషయమున విజయుడు వేగిర పడవలసి వచ్చినది; లేదేని కార్యము మించి పోవును. చేతులు దాటిన పిమ్మట చేయునదేమి కలదు?

కాని సుభద్ర యొసగిన సమాధానము విజయునకు సంతోష దాయకముగనే యుండెను. ఇందులో ఆశ్చర్యము లేదు. ఏలయన, 'ఎయ్యెడ మేలె చూతురు, గ్రహింపరు జాణలు జాఱు పాటులన్.' కాని మనసులో మాత్రము చిరాకు చెందియు, సుభద్ర సూక్తులకు సమ్మతించినట్లుగ నటించుచు విజయు డీ విధముగ

'మీ వారెఱుగుట యెన్నడు?
కావించుట యెన్నడింక? గళ్యాణంబున్
నీవేల జంపు నడపెదు?
రావే మాఱాడ కిందు రాకేందుముఖీ!'

తన అక్కను వెళ్లబుచ్చెను. నన్నింకను తికమకలు పెట్టక గాంధర్వ వివాహము చేసికొనుము. అంతేకాక మన ప్రేమ లీనాటివి కావుగదా! బాల్యము నుండియు మన మనసులలో నాటియున్న విగదా ప్రేమాంకురములు. 'ఏలే

భాలేందు నిటల! యే లాతినటే'—అని దీనముగ విజయుడు వేడు కొనుచున్నాడు. అప్పటికిని సుభద్ర మాఱు మాటాడక చెలులు వచ్చుచున్నారను మిషతో విజయుని వీడి మందిరాభి ముఖముగ వెళ్లెను.

ఈ సంఘటన జరిగిన నాటినుండియు కృష్ణానుమతిని రుక్మిణి విజయునకు భోజన మిడుచుండెను. ఎటుల భోజనము గావించు చుండెనో అతనికే తెలియవలెను! అతని హృదయము బీటలు వాఱిన నేలవలె ఉండెను.

'పేరు వివరించి నే నేల బేలనైతి
కోరిక నెఱిగించి నే నేల గోలనైతి'—

అని విజయుడు మథనపడసాగెను. అతడు గావించిన కృత్యము లతనికే బాధావహములుగ పరిణమించినవి. లేదేని పూర్వమువలె సుభద్ర యతి శుశ్రూషార్థమై వచ్చియుండును గదా! ఈ విధముగ గడియ కొక తలపుతో విజయుడు విరహాసలమున చిక్కి వివశుడై యుండెను.

తన్ను వివాహమాడుమని వేవిధములు బ్రతిమాలుకొన్నను విజయుని విన్నపములను పెడచెవిని పెట్టి అంతఃపురమునకు వచ్చెనేకాని, సుభద్ర మనస్సు మాత్రము శృంగారవనములో సంచరించు విజయయతిమీదనే లగ్నమయి యుండెను. విజ యుడు విన్నవించినట్లు వారి ప్రేమ లీ నాటివి కావు. ముక్కు మొగము లెఱుగనివారే అయినను వినికిడి మాటలవలననే వారు ప్రేయసీ ప్రియులయినారు. విజయ యతియే తాను వలచిన ప్రియుడని తెలిసికొనిన వెంటనే లజ్జాపరవశయై అట నిలువ కాళ్లాడక ఏదో ఒక సాకు చెప్పి అంతఃపురము చేరి

నది. కాని మనస్సు మనస్సులో లేదు. అంతులేని ఆలోచనలు! అగాధములగు నభిలాషలు! ఒకొక్కతూరి పశ్చాత్తప్త హృదయయై 'ఏగోరిన చెలువుఁడె ననుఁ దా గావలెనంచు వచ్చి' వేడగా అతనికి సంతోషము సమకూర్పక అవివేకముగ సంచరించితిని; ఈ దిక్కుమాలిన సిగ్గు ప్రతిబంధక మయినది కదా! అని తనలో తానను కొనును. విజయుని వరించి వివాహ మాడుటయే తన అవివేక ప్రవర్తనమునకు తగిన ప్రాయశ్చిత్త మని తలచి సంతసించును.

ఇటుల సుభద్ర రేయింబవళ్లును మధనపడుచుండుటను చూచి చతురుడగు వేంకనార్యుడు,

'కృష్ణ కృష్ణా యటంచు నా కీరవాణి
రామరామా యటంచు నా రాజసుతుడు'

కాలము గడుపుచుండిరని నర్మగర్భముగ నుడువుచున్నాడు. కృష్ణా! రామా! అని హరినామస్మరణ చేయుచు సుభద్రార్జునులు ప్రొద్దుబుచ్చుచుండిరని స్థూల దృష్టికి గోచరించునుగాని సూక్ష్మ దృష్టికి శ్లేషను పరవళ్లు త్రొక్కించుటయందు వేంకనార్యునికి గల కౌశలము వ్యక్త మగును.

మానవు డెంతటి శక్తిసంపన్నుడయినను, బుద్ధిలో బృహస్పతి అయినను, దైవ మనుడు లేక ప్రకృతి అనుడు—ఏదో ఒక బహిశ్శక్తియొక్క ప్రభావ మతనిపై ఉండును. సుభద్రార్జునులు బాల్యమునుండియు ప్రణయ బంధమున బంధితులై యుండియు దైవసాహాయ్యమును వారు నిరీక్షించవలసివచ్చినది. ఇది సామాన్యార్థము. సఖా! సఖీ! అనుచు వారు రేయింబవళ్లును కలవరించుచున్నారనుట విశేషార్థము. విజయునకుగల

ద్వాదశ నామములలో కృష్ణయు ఒకటి. విజయుడు చామన ఛాయ మేనివాడు. అనగా అంత నలుపును గాదు; అంత యెఱుపును గాదు. కనుక విజయుడు కృష్ణుడుగా పరిగణింప బడుచున్నాడు. ఇక, విజయుడు చిలుకలకొలికి యగు సుభద్రను 'రామ' అను శబ్దము మూలముగ స్మరించు చున్నాడు. ఈ విధముగ ప్రేయసీప్రియు లొకరి కొఱకై ఒకరు తపించిపోవుచున్నారు. మఱొక ముఖ్య విశేషముకూడ గలదు.

సుభద్రకు విజయునిపై తీరని మోహ మున్నను, ఆమె అస్వతంత్రురాలు. పెద్దల చెప్పుచేతలకు లోనయి సంచరించు చుండును. అందువలననే కాబోలు 'మేరలా యివి మీాయంత వారలకు...' అన్నది. ఆ పెద్దలలోను ముఖ్యులు బలరామ కృష్ణులు. బలరాముడు దుర్యోధనునియందు గాఢాభిలాష కలిగియుండిన కారణమున అతడు తన చెల్లెలిని విజయుని కిచ్చి వివాహ మొనర్చుట కలలోని వార్త. అట్లొనర్చిన, సుభద్ర హృద్గతమైయున్న ప్రేమవల్లరితోపాటు ఆమె ఆశలన్నియు వమ్మయిపోవును. అందువలన సుభద్ర తనకు సహాయము చేయు మని కృష్ణుని పదేపదే స్మరించుచున్నదేమో! నిజమునకు కృష్ణసారథ్యము లేకుండెనేని సుభద్ర మనోరథము గమ్యము నందియుండెడిది కాదు. విజయుడు సుభద్రను వివాహము చేసికొనెనని తెలిసియు, హలాయుధు డతనితో సమరము సలుపుటకు వెనుకాడలేదు. 'యతి వనుచు వేషభాషల నట మటించి పొంచి తటవేచి కన్నియగొంచు నరిగె.....అర్జునుం డద్దిరా యెంత దుర్జనుండు!' అని నిందోక్తు లాడినాడు. అట్టి సమయమున జాణయగు కృష్ణుడు—

'మాలిమిలేదు గాన నను
మానము నామదిఁ దోఁచె నప్పుడే
బాలిక సేవసేయఁ బను
పన్ వలదంటిని గాదె? దానికే
మీలుపు కల్గు, మేన మఱి
దింతయె యాతడు, నైనదైనదే;
లోలత నింక నాగవలి
లోపల నిష్ఠుర మేల పల్కఁగన్'—

అని మధుమోక్తులాడినంతనే బలరాముని కోపాగ్ని చల్లారి పోయినది. కనుక కృష్ణా, కృష్ణా అని స్మరించినందులకు, సుభద్రకు పిమ్మట విశేష సహాయమే సమకూరినది.

ఇక విజయుని విషయమును గమనింతము. మొదటి నుండియు విజయునకు ధర్మసందేహమే. కారణము బలరాముడు తన యభిమతమునకు సమ్మతింపడనియే. కాని కృష్ణుడున్నంత వఱకు హాని కలుగదని అతని నమ్మకము. దీనికి తోడుగా సుభద్ర కూడ, 'పెద్దలున్నారు, వారెట్లో పెండ్లిసేయుదు' రని నుడివినది. ఒక్క బలరాముడు తప్ప మిగిలిన పెద్దలందరు విజయుని పక్షమే వహింతురు. కాని బలరాము డొక్కడే సుభద్రార్జునుల ప్రణయమునకు అడ్డు తగులుచున్నాడు. ఈ ఉద్దేశమునే మనసులో ఉంచుకొని కాబోలు 'ఈ బలరాము డెక్కడ దాపురించినాడు? ఈతనివలననే వివాహమునకు ఆటంకము కలుగుచున్నది. ఇతడు సమ్మతించిన కార్యము సుకరమగును గదా'—అని తనలో తా ననుకొనుచున్నట్లు 'రామ' అని పేరొక్కనుచున్నాడేమో! ఇన్ని భావములను తేటమాటలలో మిళితము చేసి సహృదయ లోకమునకు

సమ్మోదము కలిగించు వేంకనార్యుని ప్రతిభాసంపత్తి నేమని కొనియాడవచ్చును?

సుభద్ర ప్రవర్తనలో ద్యోతకములగు మార్పులను గమనించిన నెచ్చెలు లామెను గేలిసేయ దొడగిరి. రుక్మిణీ సత్యభామల కీ విషయము తెలిసినదే. అయినను నంగనాచివలె సత్యభామ సంభాషింప దొడగినది:

'క్రాగియున్నది మిగుల నంగంబు చూడఁ
గలవరించుచు నున్నది, కలదొ యేమొ
సోకు, డల్ల సన్నాళ్యసికే చూపవలయు భామ'ను.

వేంకనార్యుని చమత్కార ప్రయోగ విధానమును తెలిసికొనుట కీ అమృతపు తునుకవంటి పద్యముకూడ సాయపడును. ఏదయిన సోకుడు (దయ్యపు సోకు) తగిలినచో, వారిని మంత్రజ్ఞులకు గాని, సన్నాళ్యసులకు గాని చూపించి తన్నివారణమునకు తగిన చికిత్సచేయుమని వారిని కోరుట పరిపాటి. అటులనే ఎన్నడునులేని కలవరింతలచే కుందుచున్న సుభద్రను సన్నాళ్యసికి చూపింపవలయుననుట అసహజము కాదు. ఈ సామాన్యార్థముతోపాటు సత్యభామ సుభద్రార్జునుల ప్రేమను కూడ వ్యక్త మొనర్చుచున్నది. సుభద్ర కలవరింతలకు హేతువు సోకుడు కాదు, యతి శుశ్రూషా ఫలితమగుటచే ఆ యతి వేషధారియగు విజయునికే చూపించిన సుభద్రమనసు భద్ర మగునని సూచించుచున్నది. వేంకనార్యుని కవితా కౌశలమువలన—కృష్ణుని శిరస్సును వామపాదముతో తొలగంజేసిన సత్యభామ కూడ సహృదయుల మన్ననలను సముపార్జించుచున్నది. ముక్కుతిమ్మనగారి ముద్దుపలుకులలో ముకోపియై మెలగిన సత్యభామ చేమకూరవారి పలుకులలో

సుప్రసన్నయై సాక్షాత్కరించుట గమనింపదగినది! పిల్లకాలువను పొంగి పొరలి ప్రవహించు నదిగా చేయునట్టి యైంద్రజాలిక శక్తి కలిగిన కవి సృష్టి రసవత్తరము గదా!

సుభద్రార్జునుల ప్రణయవృత్తాంతము మెలమెల్లగ నలుగురి నోళ్ళ బడినది. కృష్ణుడు పెండ్లి పెద్దతీకమును వహించినాడు. అయినను సుభద్ర వివాహ విషయమై కృష్ణుడు తన ముఖ్య బంధువుల సమ్మతిని బడయదలచెను. తలిదండ్రులగు దేవకీ వసుదేవులు, తమ్ముడగు సాత్యకి, అన్నయగు బలభద్రుడు వీరెల్లను ముఖ్యులే. బలరాముడు తప్ప మిగిలినవారు సుభద్రార్జునుల వివాహమునకు సమ్మతింతు రని కృష్ణునకు తెలిసినదే. ఈ హేతువుచే సేరి తక్కదక్కిన ముఖ్య బంధువులను రప్పించి వారి కీ విషయమును విదిత మొనరించెను. అంతటితో శ్రీ కృష్ణుని కార్యసంవిధాన ఘట్టమునందలి ఒక భాగము పూర్తి యైనది. పశుపతి పూజన మును మిషతో బలరాముని వెంటనిడుకొని కృష్ణుడు అంతర్ద్వీపమునకు దారి తీసెను. ఈ జాతర ఇరువది నాళ్లు వైభవోపేతముగ జరుగును. జాతర పూర్తియగు లోపలనే సుభద్రార్జునుల వివాహము జరుగవలయు ననియు, తానా సుముహూర్తమునాటికి ద్వారకకు చేరుకొందు ననియు శ్రీ కృష్ణుడు దేవకి మున్నగువారికి విన్నవించెను. ఈ విధముగ బంధువులను రప్పించి, సుభద్రార్జునుల వివాహమునకు సర్వ సన్నాహములు చేసినాడు కృష్ణుడు.

అంతర్ద్వీపమున బలరామ కృష్ణులు శివపూజా సందర్భమున జరుగుచుండిన అటపాటలను చూచి సంతసించుచున్న సమయమున ద్వారకానగరమున దేవకీ రుక్మిణులు సుభద్రార్జునులను వధూవరులను చేసి మురిసిపోవుచుండిరి. వారికి—

'కట్టిరి మంచిలగ్నమున గంకణముల్ కరపంకజంబులం,
బెట్టిరి మేనులన్నలుగు, మేలిమ్మగీ మదకుంకుమంబులం,
జుట్టిరి కైశికంబుల విశుద్ధమనోహర పుష్పమాలికల్,
పట్టిరి పేరటాండ్రు ధవళంబులు పాడుచు నుల్లభంబులన్.'

ఆ సమయమున సత్యభామ యింకొకతూరి తన వచో విలాసమును ప్రకటించుచు, 'ఇన్నాళ్ళ్ ప్రొద్ది యొనర్చఁ గేళి వనిలో నింపొందు నమ్మాధవీ పున్నాగంబుల పెండ్లి నేయవలె' రండు రండు చెలులార అని ఆహ్వానించినది. శృంగారోద్యాన వనమున సంపోషితములయిన మాధవీ పున్నాగములకు వివాహము గావింతు మనుచు నర్మగర్భముగ నుడివినది. సత్యభామ పలికిన సరసోక్తి వివాహ ఘట్టమున సౌరభము గలిగిన శుభ్ర జ్యోత్స్నవలె వెలుగొందుచున్నది. పెండ్లికళ వచ్చిన సుభద్రార్జునుల సౌందర్యము నిరుపమానము. యతి వేషమున నున్న విజయుని సౌందర్యమును గ్రహింపనివారు కూడ

ఒరగవేసిన సిగ వింత యొయ్యపు జూచి
బవిరి దిద్దిన చెంపల బాగుఁ జూచి
వడి గొలిపియున్న విలాసము బెడఁగుఁ జూచి—

ముగ్ధులయి 'మంచి సన్న్యాసమే' అని లోలోన నవ్వుకొను చున్నారు. చిరపరిచితమైన సుభద్రకూడ వారికి క్రొత్తగ కన్పించెను. 'తామర సాక్షి కెందుఁ దలిదండ్రులు వెట్టని సొమ్ము పెన్నెయిల్' గదా అని సుభద్రను చూచి సంతసించిరి.

ఇటుల మేలము లాడుచుండగా సుముహూర్తము సమీపించి నది. రానలసిన బంధువులందరు సమయమునకు విచ్చేసిరి. కృష్ణుడు కూడ విచ్చేసెను. అగ్నిసాక్షిగా విజయుడు సుభద్రను

స్వీకరించెను. ఆమె గళసీమలో మూడు ముళ్లు పడినవి. పిమ్మట నవోఢతోకూడి విజయుడు నాగవలి చేసికొనుటకై స్వస్థానమగు ఇంద్రప్రస్థపురమునకు వయన మయ్యెను. త్రోవలో ద్వారక ప్రోలికాపరులు సుభద్రార్జునులను గాంచి వీరిని బోనిచ్చిన తమకు బలకృష్ణులచే మాట వచ్చునేమో అని భయభ్రాంతులై యాదవ సైన్యమును సమకూర్చుకొని విజయుని ప్రతిఘటించిరి. చుక్క తెగిపడినట్లుగ హలాయుధుడు కూడ ఆ సమయమునసే ప్రత్యక్ష మయ్యెను. విజయుడును యుద్ధమునకు సన్నద్ధు డయ్యెను.

సుభద్ర రాజకన్య అగుటచేతను, కృష్ణుని చెల్లె లగుట చేతను, సత్యభామకు గారాబు మఱదలగుటవలనను చేకూడిన ధీరత, సారథ్యనైపుణి, ధనుర్విద్యా కౌశలము తోడుగా విజయు నకు సాయ మొనర్ప దలచినది. నరకాసుర వధ సందర్భమున మా పదిన (సత్యభామ) రథసారథ్యము చేసినట్లు నేనును మీకు సాయము చేయుదునని సుభద్ర విజయునికి తన కోరికను తెలియజేసెను.

'నన్నెవ్వనిగాఁ జూచితి
కన్నియ! నీ చేయునంత కార్యం బిటనే మున్నది?—'

అని పలికి నీ కోరికను మాత్రము కాదనుట యెందులకు, అటులనే సాయము చేయుమని కోరెను. యుద్ధ మారంభ మయినది. సుభద్రార్జునులకు విజయము లభించినది. బలరా ముని కోపము ద్విగుణీకృత మయ్యెను. అఘటనఘటనా చతురుడగు కృష్ణుడు సరసోక్తులచే సీరిని సంతృప్తునిజేసి అతనిని వెంట నిడికొని ఇంద్రప్రస్థమునకు దారితీసెను.

హస్తినాపురమున కూడ సుభద్రార్జునుల వైవాహికోత్సవము జరిగినది. ధర్మరాజాదులు బలకృష్ణులతోడి వియ్యము కలిగి నందులకు మిక్కిలి సంతసించిరి. వివాహానంతరము పెండ్లికి వచ్చిన పెద్దలు తమతమ నెలవులకు జనిరి. పిమ్మట కొన్నాళ్లకు సుభద్రార్జునుల ప్రణయ ఫలితముగ అభిమన్యుడు వారికి కలిగెను. ఈ శుభోదంతముతో వేంకనార్యుడు విజయ విలాసమును ముగించుచున్నాడు.

ఉపసంహారమున వేంకనార్యుని కవిత్వమునుగూర్చి రెండు మాటలు నుడువుట సమంజసము. విమర్శనా దృష్టితో వీక్షించినను, సాహితీ దృక్పథముతో పరిశీలించినను విజయ విలాసము సాటిలేని కావ్య మని సహృదయులకు ద్యోతక మగును. ఈ కావ్యమున కింతటి ప్రాశస్త్య మొనగూరుటకు ముఖ్య కారణము నవ్యకవితారీతులు అందు గోచరించుటయే. అతని భావములా నవనవోన్మేషములు, శ్లేషలా నూతనములు. శైలీమాధుర్యమా నిరుపమానము. ఇక భాషావిషయము. ఆశ్వాసాంత పద్యములను మినహాయించినచో దీర్ఘసమాస ములు మచ్చునకేని కానరావు. అన్వయ కాఠిన్యము లేదు. తేట తెలుగు మాటలు ప్రతిపద్యమునందును కనిపించుచునే యుండును. చకచకితనయన, వలపుగస్తూరి నామము, పసిడిగాజుల మిసమిసలు మున్నగు ప్రయోగములందలి నూతనత్వము ప్రశంసార్హము. అర్థాంతరన్యాసాలంకారములు చేమకూరవారి అలచేతిలో నాట్యమాడినవి. తామరసాక్షి (సుభద్ర) కెటుల పెన్నెఱులు పెట్టని సొమ్ములయ్యెనో అటులనే వేంకనార్యుని కవిత్వ మాధుర్యమువకు జాతి వార్తా ప్రయోగ ఘటితి పెట్టని సొమ్ము!

పరవస్తు చిన్నయసూరి

ఆంధ్ర వాఙ్మయమునందు నన్నయ చిన్నయలు రవి చంద్రులవంటివారు. నానారుచిరార్థసూక్తి నిధి అయిన నన్నయ భట్టు పద్యరచనకు మార్గదర్శకుడు కాగా, లాక్షణిక చక్రవర్తి అయిన చిన్నయసూరి గ్రాంథిక రచనకు మార్గదర్శకుడైనాడు. కాని దురదృష్టము! ఈ మహానీయు లిరువురు నేడు విమర్శకు పాల్పడుచున్నారు. నన్నయ రచనలో తెలుగుదనము లేదు. చిన్నయ భాష కృతకము! వాదమునకు వీటిని అంగీకరించ వచ్చునేమో కాని, చారిత్రక సత్యములను మాత్రము తారు మారు చేయలేము. నన్నయ చిన్నయలు నివసించిన ఆయా కాలములందలి రాజకీయ సాంఘిక పరిస్థితులను ప్రశాంతముగా పరిశీలించినచో, వీ రిద్దరు తెలుగు భాషా సారస్వతములకు మహోపకారము చేసిన మహానీయులని స్థూల దృష్టికి కూడ తెలియకపోదు. అయినను 'నడచుచు నున్నవారి చరణంబులకే కద రాళ్లు తాకుడుల్!'

కొందరనుకొనునట్లు చిన్నయసూరి వట్టి వ్యాకర్తయే కాదు. ఆయన సంస్కృతాంధ్ర ప్రాకృత ద్రవిడ భాషలలో పండితుడు. ఆంగ్లభాషలో కూడ పాండిత్యము గడించకపోలేదు. తర్క మీమాంసాలంకార శాస్త్రములను తూర్ణ్ణముగా చదివిన వాడు. సంస్కృతాంధ్రములలో కవిత లల్లి సహృదయులను మెప్పించినవాడు. బహుజనపల్లి సీతారామాచార్యుల వంటి పెద్దలకు విద్యాప్రదాన మొనర్చిన అధ్యాపకరత్నము. నిఘంటు

నిర్వాణమునకు పరిశ్రమించి ఎన్నో గ్రంథములను పరిశోధించి ఎన్నెన్నో పదములను సేకరించిన పరిశోధకుడు. బాధ్యతా యుతములగు పెక్కు పదవులను అలంకరించి వాటికి గౌరవము కల్పించిన రుచిర వర్తనుడు. పేరు పెంపులు గడించిన పత్రికా సంపాదకుడు. బ్రౌనుదొర వంటి వ్యావహారిక భాషాప్రియుల ఆదరాభిమానములను కూడ చూరగొన్న స్నేహశీలి చిన్నయ సూరి!

ఇన్ని ప్రజ్ఞలుగల పండితులు సూరి తరమునకు చెందిన వారిలో పలువురు లే రనుట అతిశయోక్తి కాదు. బహుముఖ మైన ఆయన ప్రతిభను ఆనాటి పండితులే కాక సంఘమునందు పలుకుబడి గల పెద్దలు కూడ గుర్తించి చిన్నయను గౌరవించిరి. నేడును ఆంధ్ర విద్వల్లోకము సూరికి బ్రహ్మరథము పట్టుచునే యున్నది. లక్షణశాస్త్రము పట్ల ఆదరాభిమానములు నానాటికి తీసికట్టు నాగంభట్టుగా ఉన్న యీ దినములలో కూడ లాక్షణిక శిరోమణి అయిన పరవస్తు చిన్నయసూరి రచనలు ప్రచారములో ఉండుట సంతోషింపదగిన విషయము.

శ్రీమద్రామానుజాచార్యులవారి జన్మస్థలమగు శ్రీపెరుంబూదూరులో (చెంగల్పట్టు జిల్లా) చాత్తాద వైష్ణవ కుటుంబమున 1806 లో చిన్నయ జన్మించెను. తల్లి శ్రీనివాసాంబ. తండ్రి వేంకటరంగయ్య. సంస్కృతాంధ్రములందు పండితుడు. చిన్నయ తండ్రియొద్దనే సంస్కృతము, తెలుగు, తమిళము మొదలగు వానిని అభ్యసించెను. కంచి రామానుజాచార్యులను పండితునియొద్ద తర్క మీమాంసాది శాస్త్రములను అభ్యసించెను. చదువుసంధెలు లేక అల్లరి చిల్లరిగా తిరుగుచుండిన చిన్నయకు పఠనాసక్తి కలిగించిన సహృదయుడట కంచి

రామానుజాచార్యులు. చిన్నయకు కమ్మని కంఠము ఉండె ననియు, సంగీతముసందును కృషి చేసె ననియు చెప్పుదురు. చిన్నయ విద్యాభ్యాసమునకు సంబంధించిన వివరములు ఇంతకు మించి ఎక్కువగా తెలియరాలేదు.

వేంకటరంగయ్యగారు మదరాసులోని ఈస్టిండియా కంపెనీ వారి సుప్రీముకోర్టులో న్యాయమూర్తిగా నియమితు డగుటతో, చిన్నయ నివాసము శ్రీపెరుంబూదూరు నుండి మదరాసునకు మారెను. ఆ మార్పు ఆయన జీవితములో మహత్తరమైన మార్పునకు దారితీసె ననవచ్చును. ఆనాళ్లలో మదరాసులో ప్రముఖులుగా ప్రసిద్ధికెక్కిన గాజుల లక్ష్మీనరసు సెట్టి, న్యాయమూర్తి రంగనాథ శాస్త్రి, శ్రీనివాసపిళ్లై మొదలగు వారితో చిన్నయకు పరిచయ మేర్పడెను. కాని 1836 లో తండ్రి మరణించుటవలన, కుటుంబ భారము చిన్నయ భుజ స్కంధములపై పడెను. మరణించునాటికి వేంకటరంగయ్య గారు నూట పదియేండ్లు వృద్ధు లట!

చిన్నయ తొలుదొలుత ఆస్టన్ మిషన్ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా ప్రవేశించె ననియు, పాశ్చాత్యులు పలువురు ఆయనయొద్ద సంస్కృతాంధ్రముల నభ్యసించి రనియు, 1844 లో పచ్చయప్ప కళాశాలలో ఆంధ్ర పండితుడుగా నియ మింప బడెననియు తెలియుచున్నది. పచ్చయప్ప కళాశాలలో నాలుగేండ్లు పనిచేసిన పిమ్మట, చిన్నయ రాజధానీ కళాశాలలో పండిత పదవి నలంకరించెను. ఆ నాళ్లలో ఆర్బత్ నాట్ అను దొరగారు రాజధానీ కళాశాలాధ్యక్షులుగా ఉండిరి.

నేటివలె ఆ నాళ్లలో మన దేశభాషలలో విద్యార్థులకు ఉపయోగపడు పాఠ్య గ్రంథములు లేవు. కాని పాఠశాల

లనేకములు స్థాపింపబడుటతో, పాఠ్య పుస్తకముల అవసరము ఎక్కు– వయ్యెను. కాగా, 1820 లో మదరాసులో 'ఉపయుక్త గ్రంథకరణ దేశభాషా సభ, యొకటి (The Madras School Textbook and Vernacular Society) స్థాపింపబడెను. ఈ సభ వారు పాఠశాలలందు చదువుకొను బాలబాలికల నుద్దేశించి తెలుగు, తమిళము మొదలగు దేశభాషలందు సులభశైలిని వాచక పుస్తకములు వ్రాయించి ప్రచురింప జొచ్చిరి. సదుద్దేశముతో ప్రారంభింపబడినను, వారు ప్రకటించుచుండిన పాఠ్య పుస్తకములు క్రైస్తవమత సిద్ధాంత పరములై ఉండెనట!

ఇట్లుండగా, 1848 లో చిన్నయ ఉపయుక్త గ్రంథకరణ దేశభాషా సభకు అధ్యక్షు డయ్యెను. ఆయన ఆధ్వర్యమున ప్రకటింపబడిన పుస్తకములు పలువురి ప్రశంసల నందుకొనెను. చిన్నయ పర్యవేక్షణము క్రింద శాస్త్రీయ గ్రంథములు కూడ ప్రకటింపబడుట గమనింపదగు నంశము. ఆ దినములలో వెలుగులోనికి వచ్చిన పాఠ్యపుస్తకములలో జాను బన్యను చరిత్ర (1856), మహమ్మదు చరిత్రము (1856), అమెరికాను కనిపెట్టిన చరిత్ర (1857) మున్నగునవి పేర్కొనదగినవి. అంతే కాక రైల్వేలు, టెలిగ్రాఫు మొదలగు క్రొత్త విషయములను గురించి కూడ పుస్తకములు ప్రకటింపబడెను. ఈ విషయాదికమును పరిశీలించిన, చిన్నయ ఛాందసుడు కాడనియు ఎంత ప్రాచీనుడో అంత నవీను డనియు సువిదిత మగును.

అప్పటికే చిన్నయ ప్రతిభావ్యుత్పత్తులు నలుగురకు తెలియవచ్చెను. ప్రముఖులు పలువురు ఆయనలోని విశిష్టతను, ప్రజ్ఞా ప్రకర్షలను గుర్తించిరి. రాజధానీ కళాశాలలో చిన్నయ ప్రధానాంధ్రోపాధ్యాయుడై (Telugu Master)

ఉండగా, సుప్రసిద్ధ పండితులగు పురాణము హయగ్రీవశాస్త్రులు గారు ద్వితీయాంధ్రోపాధ్యాయులుగ ఉండిరి. కళాశాలా ధ్యక్షులు ఆర్బత్‌నాట్ దొరగారు చిన్నయ అఖండ పాండితీ వైభవమునకు ముగ్ధుడై, శాస్త్ర పండితుల సాహాయ్యముతో చిన్నయను పరీక్షించి వారి యనుమతిని ఆయనకు సూరి అని బిరుదు నొసగెను. అంతటితో నిలువలేదు ఆ దొర. చిన్నయ సూరి అను అక్షరములు చెక్కించిన స్వర్ణ కంకణము నొకటి సీమనుండి తెప్పించి ఆయన చిన్నయసూరికి బహూకరించెను. చిన్నయసూరి అను అక్షరములే కాక ఈ సంఘటన కూడ బంగరు టక్షరములతో లిఖింపదగినదే! కనుక చిన్నయసూరిని విమర్శించుటకు మునుపు, ఈ వివిధ విషయములను పరిశీలింప వలెనని నా మనవి. అప్పుడుగాని, సూరి రచనములలోని ప్రాశస్త్యము సరిగా అర్థము కాదు. అంతటి ప్రతిభావంతు డగుటవలననే, సూరికి పిమ్మట ఎంద రెందరో పండితులు వ్యాకరణ గ్రంథములు రచించినను, సూరి వెలయించిన బాల వ్యాకరణమే మనకు శరణ్య మైనది. ఆయన భాష కృతక మని వాదించువారు కూడ అందలి మాధుర్యమునకు ముగ్ధు లగుదు రని చెప్పవచ్చును.

సూరి జీవితము నందలి మరొక ముఖ్యమైన ఘట్టమును కూడ పరిశీలింపవలసియున్నది.

సాంస్కృతికముగా, విద్యా విషయకముగా మార్పులెన్నో ఏర్పడుటకు కారణ భూతమైన మదరాసు విశ్వవిద్యాలయ స్థాపనము 1857 వ సంవత్సరములో జరిగెను. తత్స్థలితముగా రాజధానీ కళాశాలకు చాల ప్రాముఖ్యము కలిగెను. అందు పని చేయుచుండిన చిన్నయసూరికి విశేషాధికారము

ప్రాప్తించెను. విశ్వవిద్యాలయ పరీక్షలలో తెలుగునకు కూడ స్థానమేర్పడెను.

విశ్వవిద్యాలయ స్థాపనము జరిగెనే కాని, పట్టి పరీక్షలకు తగిన పాఠ్యపుస్తకములు మాత్రము లేకుండెను. ఉపయుక్త గ్రంథకరణ దేశభాషా సభవారి పుస్తకములు కేవలము పాఠశాల లందు చదువు పిల్లల కొరకు వ్రాయబడిన వగుటచే, అవి విశ్వవిద్యాలయ పరీక్షలకు పనికిరాకపోయెను. అప్పటికి తెలుగున వెలసిన వచన రచనలేమో వెలుగులోనికి రాలేదు. కాగా సలక్షణము, నాతి కఠినము, నిర్దుష్టము నగు గ్రాంథి కాంధ్రమున చేయబడిన రచనలు ఆనశ్యకములయ్యెను. కనుకనే చిన్నయసూరి ప్రౌఢ గంభీరమగు శైలిలో రచనలు చేయ సాగెను. తత్ఫలితముగా తెనుగున కొత్త రకపు వచన రచనా విధాన మొకటి యేర్పడినది. ఇది దక్షిణాంధ్ర కవులు సంతరించిన గద్యరచనయు కాదు. వ్యావహారికము అంత కన్నను కాదు. అది చిన్నయసూరి శైలి అనియే చెప్పవలెను. శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు పేరొక్కనినట్లు ఇట్టి 'గ్రాంథిక రచనకు భగీరథుని వంటివాడు పరవస్తు చిన్నయసూరి.' ఈ నూతన వచన రచనకు శ్రీకారము చుట్టినది సూరి నీతి చంద్రిక అనుట చర్విత చర్వణము కాగలదు.

చిన్నయసూరి వ్యావహారిక భాషకు విరుద్ధమైన భాషను తన గ్రంథములందుపయోగించిన మాట వాస్తవమే. సూరి సమకాలికులలో కొందరు వాడుక భాషలోనే రచనలు చేసిరను, సూరి మాత్రము వాడుక భాషకు విశ్వవిద్యాలయమున స్థానము నొసగ లేదు. కాగా కాలక్రమమున సూరిగారి నూతన వచన రచనా విధానమునకే విశ్వవిద్యాలయమువారి

పాశ్య ప్రణాళికలో ప్రాధాన్యము కలుగుటయు, తరువాతి పండితులు గ్రాంథిక భాషలోనే రచనలు చేయ దొడగుటయు, తుదకు ఆనాటి పత్రికలు, లేఖలు మొదలగునవి కూడ గ్రాంథి కాంధ్రమునందే వెలువడుటయు జరిగెను.

ఈ సందర్భమున సూరి భాష కృతక మని విమర్శించువారి కొక సమాధానము చెప్ప నభిలషించుచున్నాను. వ్యవహార ములో ఉన్న భాష అంతయు సహజ మనియు, వ్యవహార ములో లేని భాషను కృతక మనుటయు సమంజసము కాదేమో అని నా అభిప్రాయము. భావవ్యక్తీకరణమే భాషాలక్ష్యము. కనుక భావము తేటతెల్ల మగునప్పుడు, అది వ్యావహారికమైన నేమి? గ్రాంథికమైన నేమి? ఈ నియమము సాహిత్య ప్రక్రియ లన్నిటికిని వర్తింపక పోవచ్చును. కాని సూరి వెలయించిన రచనలను, పానుగంటివారు మరికొందరు రచయితలు సంత రించిన కృతులను పరికించినచో, గ్రాంథికములో కూడ ఎంత సులభముగా, అందముగా చెప్పవచ్చును! అనిపించును. నేటి రచయితలలో కొందరి వ్రాతలందు అస్పష్టత ప్రధానముగా కానవచ్చుచున్నది. భాషయేమో వాడుక భాషయే. కాని భావము మాత్రము సులభముగా అంతు పట్టదు. వాక్య నిర్మాణమునందు ఇంగ్లీషు పలుకుబడి ఎక్కువగా కనబడుచున్నది. మరి ఈ భాష కృతకము కానప్పుడు, చిన్నయ సూరి భాషను మాత్రము కృతక మనుట సమంజసమా? సూరి భాషలో అస్పష్టత మృగ్యము. నీతి చంద్రికను చదువు చున్నప్పుడు ఏదో ఒక రసవద్రచనను పఠించునట్లు తోచును. ఉదాహరణమునకు, నీతిచంద్రికలోని యీ క్రింది వాక్యము లను పరికింపుడు:

'భువనసారం బను నొక్క- కాసారంబు గలదు.
పారావారంబు తీరంబున మహీరుహాంబు
మోదం దీతు వొక్కండు గూడు పన్నికొని...

పోగాలము దాపించినవారు దీప నిర్వాణ గంధము నరుంధతిని మిత్రవాక్యమును మూర్ఖులు కనరు వినరని పెద్దలు చెప్పుదురు.

లోభము మోహమును బుట్టించును. మోహము దుఃఖము నుత్పాదించును. దుఃఖము జ్వాలనమువలె స్వాశ్రయమునకు నాశము పుట్టించును...'

అస్పష్టత, అన్వయ కాఠిన్యము మొదలగువాటికి తావీయక, భావమును తేట తెల్లము చేయుచు సలక్షణము, సుందరమునగు గ్రాంథికమున రచన సాగించిన చిన్నయసూరి భాషను కృతక మనుటకంటె అదిఒక విలక్షణమైన శైలి అనుట సమంజసము.

తుదముట్టగ నీతిచంద్రికను చదివినచో, భాషాజ్ఞానము, నీతి కుశలత్వము—ఈ రెండు కలుగునని చిన్నయసూరి ప్రతిజ్ఞాదిక ములో పేర్కొన్నాడు. ఇది సత్యసంపూర్ణము. భాషాజ్ఞానము కలుగవలెనను సదుద్దేశముతో సంతరించబడినది నీతిచంద్రిక. అంతేకాని ఏదో ఒక రచన చేయవలెనను తలంపుతో సూరి దీనిని వ్రాసి యుండలేదు. ఈ కారణమున కాబోలు నీతి చంద్రికలో ఉదాత్తమైన భాష వాడబడినది.

సూరి ఆంగ్లమునుండి అనువదించిన హిందూ ధర్మశాస్త్ర సంగ్రహమును (1858) పరిశీలించినచో, ఈ విషయ మింకను తేట తెల్లము కాగలదు. ఈ శాస్త్ర గ్రంథమునందలి భాష సెలయేటి గలగలను తలపించుచుండగా, నీతిచంద్రిక లోని

భాష 'పతయాళు నిర్ఝరాంభః ప్రవాహము'ను స్మరణకు తెచ్చుచున్నది. కనుక నీతిచంద్రికను చదువువారికి తప్పక భాషాజ్ఞానము కలుగు ననుటలో సందేహము లేదు.

నీతిచంద్రికలో అందాలు దిద్దుకొన్న సుభాషితములా కోకొల్లలు! వాటి నన్నిటిని సేకరించి ప్రత్యేక గ్రంథముగ ప్రకటించుట వాంఛనీయము. సూరి నీతిచంద్రికను చూచెనో లేదో తెలియదు కాని, తమిళ జాతీయకవి అని పేరు పెంపులు గడించిన సుబ్రహ్మణ్య భారతి కూడ నవతంత్రకథ లను కమ్మని కథల పుస్తకమును ప్రకటించెను. దీనినిబట్టి చూడగా, ఆ నాళ్లలో నీతిచంద్రికవంటి పుస్తకములు వెలువడవలెనని పెద్దలు భావించినట్లు గ్రహించవచ్చును.

ఇక నీతిచంద్రికలోని కొన్ని సుభాషితములను చదువుకొని సంతోషింతము:

'బిడ్డలకు విద్యాభ్యాసము చేయింపమి తల్లిదండ్రుల దోషము. తల్లిదండ్రులచేత శిక్షితుడయి బాలుడు విద్వాంసుడగును గాని పుట్టగానే విద్వాంసుడు కాడు. పురుష కారముచేతఁ గార్యములు సిద్ధించును. రిత్త కోరికలచేత సిద్ధింపవు.

సాధు సాంగత్యము సర్వశ్రేయములకు మూలము.

ఎవ్వఁడు బుద్ధిమంతుఁడో వాఁడు వృద్ధుఁడుగాని యేండ్లు మీరినవాఁడా వృద్ధుఁడు?

విపత్కాలమందు విస్మయము కాపురుషలక్షణము.

శరీరము క్షణభంగురము. గుణములు కల్పాంతస్థాయులు.

ఎంతవారికిఁ గాని దైవ మతిలంఘ్యము.'

ఇట్టి రసవద్రచన ఏబదిసారులు ముద్రణ భాగ్యము నందుటలో ఆశ్చర్యము లేదు.

సూరి హిందూ ధర్మశాస్త్ర సంగ్రహము కూడ పేర్కొనదగిన గ్రంథము. 1858 లో ప్రకటితమైన యీ గ్రంథమును శ్రీ నిడుదవోలు వేంకట రావుగారు 1962 లో ప్రకటించిరి. పైన పేర్కొనినట్లు ఇందలి శైలికిని నీతిచంద్రికయందలి శైలికిని చాల భేదము గలదు. హిందూ ధర్మశాస్త్ర సంగ్రహము నందలి యీ క్రింది వాక్యములను పరికింపుడు:

'పైతృక ద్రవ్యము విభక్తమని యవిభక్తమని ద్విప్రకారము.'

'పుత్రుడు గాని, పౌత్రుడు గాని, ప్రపౌత్రుడు గాని లేనివాడే పుత్రహీనుడనబడును. వాడే పుత్రస్వీకారము చేయవలసినది. పుత్రులు లేనిపక్షమందు వారి సంతతివారు పుత్రుని యట్లుత్తరాధికారు లవుదురు.'

'స్త్రీకి దల్లిదండ్రి దోబుట్టువు లిచ్చిన ద్రవ్యము స్థావరము గాని జంగమము గాని సౌదాయిక మనబడును. ఆ ద్రవ్యమం దామెకే యధికారము. భర్తకు గాని తక్కిన బంధువులకు గాని సంబంధము లేదు.'

ఇక సూరి బాలవ్యాకరణమును గురించి చెప్ప నవసరము లేదు. బాలవ్యాకరణమును చదువని తెలుగు పండితు లుండరు. ఆంధ్ర లాక్షణిక ప్రపంచములో నన్నయకు తరువాత నన్నయ అంతటివాడు చిన్నయసూరి. 'తెలుగునకు గల వ్యాకరణ దీపము చిన్నది. వ్యాకరణ మొక త్రోవ, మహా కవులొక త్రోవ ...' అని మన పెద్దలు సెలవిచ్చియే యున్నారు. కనుక సూరి అభిప్రాయములను అంగీకరింపనివారు కూడ,

సూరి సూత్రరచనా విధానమును మాత్రము కొనియాడక తప్పదు. 'అల్పాక్షరములలో ననల్పార్థ రచన' చేసిన లాక్షణిక చక్రవర్తి చిన్నయసూరి! కాని

'మును మదుపజ్ఞం బగుచుం
దనరిన వ్యాకృతిని సూత్రతతి యొక కొంతం . . . '

అని సూరి చెప్పిన పద్యములోని 'మదుపజ్ఞంబు' అన్న మాటలోని సామంజస్యమును పండితులు పరిశీలింపవలెను.

చిన్నయసూరి బహు గ్రంథకర్త అని తెలియుచున్నది. కాని ఆ గ్రంథము లన్నియు లభింపకపోవుట మన దురదృష్టము. సూరి నిఘంటువు (అసమగ్ర రచన) కూడ వెలుగు లోనికి రాకపోవుట శోచనీయము. ఈ నిఘంటువును గురించి బహుజనపల్లి సీతారామాచార్యులవారు చెప్పిన మాటల తీరును చూచినచో, సూరి తలపెట్టిన నిఘంటువు చాల గొప్పదని తెలియకపోదు. ' . . . పరవస్తు చిన్నయ సూరిగారు జీవితులై యుండిన కాలంబున దీర్ఘ సూత్రతతో ననేక గ్రంథ పరిశోధనంబు గావించి మిగుల విరివిగా బ్రయోగ సహితంబుగ అకారాది తెనుఁగు నిఘంటు వొకటి వ్రాయం బ్రారంభించి నడపుచుండిరి. ఆ మహా ప్రారంభముఁ జూచి యది పరిపూర్తి యగుటకు బహు కాలము చెల్లునని యు . . .' కనుక సూరి నిఘంటువు బృహద్రచన మనుట స్పష్టము.

మొత్తముమీద విశిష్టమైన వచన శైలిని సృష్టించిన ప్రతిభా శాలి పరవస్తు చిన్నయసూరి!

పద్యకావ్యములైన పామరగాథలు

ప్రాక్తనమానవుడు ఆనందోత్సాహములతో నెఱపిన ఖేలనమే సారస్వతసృష్టికి శ్రీరామరక్ష అయ్యెను. అతడు అపండితుడై ఉండవచ్చును. అనాగరకుడై ఉండవచ్చును. అతడు కొండగుహాలయందు తలదాచుకొని యుండవచ్చును. కాఱడవులలో నడయాడి యుండవచ్చును. కాని యే పండుగవేళలయందో, యే వెన్నెలరాత్రులలోనో అతని హృదంతరాళములయందు నిద్రాణమై ఉన్న నాట్యాసక్తియు, గానానురక్తియు, కవితాశక్తియు బహిర్గతములు కాగా తన్మయత్వమున అతడు అడుగులు వేసినాడు; పాటలు పాడినాడు; మాటలు పలికినాడు. తరువాతి కాలమున అడుగు వేయుట, పాట పాడుట నృత్యసంగీతములు కాగా—మాట పలుకుట సాహిత్యముగా పర్యవసించినది.*

సిలప్పదిగారమును నొక ప్రాచీన తమిళ కావ్యమునందు కురవ లను పర్వతప్రాంతీయులును, యాదవులును దేసినాట్య విశేషము నొకటి జరపుచుండిరని పేర్కొనబడెను. ఈ నాట్య విశేషము గోకులములో శ్రీ కృష్ణుడు నెఱపిన రాసక్రీడను తలపించునట్టిదని విజ్ఞులు విశ్వసించుచున్నారు. నేటికిని జన పదములందు నివసించు పామరులు సంతోషసమయములలో చిందులు త్రొక్కుచు పాటలు పాడుట మనము చూచుచున్న విషయమే. నిత్యనూతనత మొగ్గ దొడుగుచున్న యీనాళ్లలో

---

* మౌల్టన్ సిద్ధాంతము.

కూడ ప్రాచీనాచార వ్యవహారములను పరిరక్షించుచున్నవారీ జానపదులే!

సాధారణముగా కథావాఙ్మయ మనగా జానపదులకుమక్కువ యెక్కువ. అందును చిత్రకథలు వారి అమాయక హృదయములనను అనాయాసముగ నాకర్షించును. మొన మొన్నటి వఱకు మనదేశములో పౌరాణిక గాథలే బహుళప్రచారములో ఉండెను. ఈ కథా సముచ్చయమునం దద్భుతవిషయములు కోకొల్లలుగ గలవు. ఎన్నియో శతాబ్దులుగా వ్యవహార ప్రయుక్తములైయున్న యీ పురాణగాథలకు జానపదులు తమ కల్పనా ధీశక్తిని పురస్కరించికొని వన్నెచిన్నెలు కైసేసినారు. ఆదికావ్యమయిన శ్రీ మద్రామాయణము దేశభాషలలో కొన్ని కొన్ని మార్పులతో సంతరింపబడెను. అవాల్మీక ములును, హృదయాకర్షకములు నగు కథలు మన రామాయణములందు స్థానము సంపాదించుకొనినవి. సులోచనా వృత్తాంతము, మైరావణుని కథ, లక్ష్మణదేవర నవ్వు మున్నగునవి వాల్మీకి కృతిలో కనబడవు. ఈ కథలన్నియు కవికల్పితము లని పేర్కొనుట సమంజసముగ నుండదు. కవి కూడ సంఘ జీవి. అగుటచే సంఘము వాకొను చవిగల కథలను కూడ అతడు గ్రంథస్థ మొనర్చుట జరగును. ఇది అత్యూహ అని పించుకొనదు.

జానపదగాథలందు రెండు రకము లున్నవి. తమకోసము జానపదులే వ్రాసికొన్నవి కొన్ని; జానపదుల నుద్దేశించి వారికి ప్రీతిపాత్రములయిన కథలను ఇతరులు సంతరించినవి మఱి కొన్ని. జంగంకథలు మొదలగునవి జానపదులు తమ ఉపయోగార్థము రచించుకొన్నవిగా ఉదాహరింపదగును.

ఖవి కాక కావ్యగౌరవము నార్జించిన జానపదగాథలు కూడ కొన్ని లేకపోలేదు. శైవ వాఙ్మయమునకు మూలస్తంభములుగా గణింపబడుచున్న బసవపురాణ, పండితారాధ్య చరిత్ర కావ్యములలో బసవని గాథను, పండితుని వృత్తాంతమును పరిహరించిన, కడమ కథ లన్నియు జానపదులవే అని పేర్కొన నగును.

నిమ్న జాతులవారగు మడివాలు మాచయ్య, కాటకోటడు మొదలగు శివభక్తులు కావించిన అద్భుతము లనేకములు ఆకావ్యములం దభివర్ణితము లయినవి. మరి కొన్ని జానపద గాథలు ప్రత్యేక కావ్యములుగా వెలసి సహృదయుల ప్రశంసను చూఱగొనినవి. ఆ కోవకు చెందినవానిలో విక్రమార్క చరిత్ర, భోజరాజీయము, మైరావణ చరిత, పలనాటి చరిత్ర, కాటమరాజు కథ, గయోపాఖ్యానము, హంసవింశతి, శుక సప్తతి, శతకంఠ రామాయణము మున్నగునవి పేర్కొనదగినవి.

జానపదులకు వరమప్రీతిపాత్రములయిన కథలలో భట్టి విక్రమార్కుల కథలు ముఖ్యముగా చెప్పదగినవి. పుక్కిటి పురాణములుగా గణింపదగిన అంశము లెన్నియో వీనియం దున్నవి. అయినను ఈ కథలను చదువునప్పుడు సాహసో పేతుడగు విక్రమార్కుడును, అపరచాణక్యు డనదగిన భట్టి మంత్రియు మన కన్నుల మసలుచుందురు.

'సాహసక్రియాకలిత వదాన్యతాది గుణగౌరవరేఖల' నెక్కుడై నెగడినవిక్రమార్క మహీపతి సచ్చరిత్రమును ఎనిమిది ఆశ్వాసముల ప్రబంధముగా జక్కన మహాకవి వ్రాసినాడు. ఇతడే కాక పదునైదవ శతాబ్దివాడగు కొఱవి గోపరాజు కూడ

సింహాసనద్వాత్రింశికలో విక్రమార్కుని సాహసౌదార్య ములను బహుధా ప్రశంసించినాడు. పుష్పాలలో దారమును గ్రుచ్చినట్లుగా కథలో కథను చొప్పించి జిగియు బిగియు కుంటువడకుండునట్లు కథాకథనము గావించి గోపరాజు తన కావ్యము నొక కమనీయకథా సంపుటముగా సంతరించినాడు. పురుష ప్రయత్నములేక యే కార్యము నెఱవేర దనియు, ధైర్యవిహీనుడగు నరునకు దైవసాహాయ్యమైనను లభ్యము కాదనియు తెలియజేయుటకై గాళికుని కథను పేర్కొనెను. ఇది మూడవబొమ్మ చెప్పిన కథ.

బృహత్సేనుని ముద్దుల కొమరితయగు ఆనందిని లావణ్య లతిక. ఆమెను వివాహ మాడవలయునను తలంపుతో గాళికుడను ధీరవిటుడు కీలుగరుత్మంతుని సమకూర్చుకొని కృష్ణ వేషము దాల్చి గరుడారూఢుడై ఆమెను సమీపించెను. గాళికుడు నిజముగా శ్రీ కృష్ణుడే అని విశ్వసించి పితృనానతి బడసి ఆనందిని అతనిని పరిణయ మాడెను. భగవంతుడే తనకు జామాత యగుటచే బృహత్సేనుడు తదాదిగా కన్ను మిన్ను గానక సంచరింప దొడగెను. ఇట్లుండగా ఒక యుద్ధము సంభవించెను. అప్పుడు బృహత్సేనుడు తన అల్లుని సాయమును వాంఛించినాడు. గత్యంతరములేక గాళికుడు సమరాంగణమునకు బయల్వెడలెను. అప్పుడు శ్రీ మహావిష్ణువు

'గాళికుఁ డీల్గెనేనియు జగంబు
జనార్దనుఁ డీల్గె నంచు న
న్నాలము సేయుచుండుఁ, దన
యల్లుఁడ నే నని నమ్మి యున్నభూ

పాలుఁడు చిక్కు భక్తిఁ దమ
ప్రాణము లప్పన సేయ నున్నము
న్నీలతలంపులుం బొలియు,
నేనటు పోవక యుండఁ బాడియే.'

అని తలచి గొళికునకు సహాయము చేసెను.

ఇట్టి కట్టుకథ లనేకములున్నను సింహాసనద్వాత్రింశికలో వస్తైక్యమునకు భంగము వాటిల్లలేదు. ఈ ఒక్క విషయమే చాలును/కావ్యగౌరవమును నిర్ణయించుటకు. కల్పిత గాథలు కృత్రిమరత్నము లను కింవదంతి ఉన్నను, కావ్య గౌరవ ముండుటచే ఈ గాథలు నాడును, నేడును మనగలిగినవి.

విక్రమార్కునివలె భోజరాజుకూడ లోకోత్తర పురుషుడు. ఈతని చరిత్ర పురాణప్రసిద్ధమైనది కాదు. ఈ విషయమును భోజరాజీయ కృతికర్తయగు అనంతామాత్యుడే 'నూతనం బయ్యెఁ బురాతనకృతు లట్ల సంతత శ్రవ్యమై జరగు'నని స్పష్టము చేసినాడు. ఈ కావ్యవస్తువు భోజరాజు వృత్తాంతమే యైనను, అనంతామాత్యుడు కొన్ని జానపదగాథలను, మతి కొన్ని పురాణ కథానుసారములైన గాథలను కూడ స్వీకరించి నాడు. ఈ కథ లన్నియు ధర్మప్రతిపాదకములై ఉండుటచే భోజరాజీయమున కొక ప్రత్యేకత సిద్ధించినది. అది యెట్టిదో పరిశీలింతము.

ఒక బ్రాహ్మణునకు ముగ్గురు కుమారు లుండిరి. వారిది సమష్టి కుటుంబము. వారిలో కడపటివాడు నిరతాన్నదాత. అతని ప్రియవాదితనమును చూచి కన్నులు కుట్టిన అతని వదినెలు వేఱింటి కాపురమును వాంఛించిరి. అందులకు వారి

పురుషులు కూడ సమ్మతించిరి. కాని కడగొట్టువాడు యథా ప్రకారముగా అన్నదానము చేయుచునే యుండెను. అతడు నతని భార్యయు సౌఖ్యముగా కాలము గడపుచుండిరి. అతని సోదరులు మాత్రము నిర్ధనులై అన్నవస్త్రములకు అలమటింప జొచ్చిరి.

ఈ కథను చదువుచున్నంతనేపు

‘వేరుపడితే మేలురా—నాథా
కూడ ఉంటే పోరురా—’

అను జానపద గీతము మన చెవులలో మ్రోగుచుండును. కలిగినంతలో అన్నదాన మొనర్చుట వాంఛనీయమనియు, అది శుభోదర్క—మనియు ఈ కథవలన స్పష్టమగుచున్నది. ఇదే విధముగా అనంతామాత్యుడు ప్రతి కథలోను ఏదో ఒక ధర్మమును ప్రతిపాదించినాడు.

ఇక మైరావణ చరిత్ర నవలోకింతము. ఇది మూడాశ్వాసముల పద్యప్రబంధము. దీనిని మాడయ్య అను కవి సంతరించినాడు. నానారాజసందర్శన మొనర్చి అనేక సమ్మానములు పొందిన ప్రముఖు డీతడు. నవరసభరితముగాను, నవార్థసుశబ్దసంయుతముగాను, రసికులందఱు మెచ్చుకొనునట్లును కవిత చెప్పగలదిట్ట యట మాడయ్య కవి!

రామరావణ యుద్ధావసరమున జరిగిన కథయే మైరావణ చరిత్రలోని యితివృత్తము. ఇది అవాస్తీక మని నిస్సంశయముగా నుడువదగును. మైరావణుడు రావణుని సహోదరుడని లోకవ్యవహారము. మహిరావణుడను నామాంతరము కూడ ఇతనికి గలదు. మాడయ్య కవి మైరావణుడు దశ

కంఠుని మిత్రుడని పేర్కొనెను. శ్రీ రామచంద్రుని ధాటికి తట్టుకొనలేక రాత్రించరవీరులు చాలమంది నిహతులు కాగా చింతాక్రాంతుడైన రావణుడు మైరావణుని సహాయము నభిలషించినాడట! మిత్రుని మాటను జవదాటలేక మైరావణుడు విభీషణ వేషము ధరించి సుఖశయ్యాగతులైన రామలక్ష్మణుల నొక మందసమున బంధించివైచి ఆ పెట్టెతోకూడ అతడు పాతాళలోకమునకు పోయెను. రామలక్ష్మణులను కాళికా దేవికి బలిగా సమర్పింప నతడు సన్నద్ధుడై యుండెను. ఈ విషయాదికమును గ్రహించి హనుమంతుడు సూక్ష్మరూపముతో పాతాళలోకమును ప్రవేశించి మైరావణుని సంహరించి రామ లక్ష్మణులను సంరక్షించెను.

ఈ కావ్యమునందు హనుమంతునకు విశిష్టస్థాన మొసగ బడినది. అతని గుణగణములు—స్వామిభక్తి, సాహసము, పరాక్రమము, ప్రజ్ఞావిశేషము—లెస్సగా ఇందు నిరూపితము లగుట గమనింపదగిన విషయము!

భారత రామాయణములవలె జానపదుల హృదయముల నాకర్షించిన గాథలందు పలనాటి వీరులగాథ పేర్కొనదగినది. ఈ వీరచరిత్రలోని మహనీయు లెల్లరు తెనుగు గడ్డమీద పుట్టి పెరిగినవారే. కావున ఈ కథపై జానపదులకు అవిరళభక్తి విశ్వాసములు కుదిరినవి. తత్ఫలితముగా పల్నాటి వీరచరిత్ర పల్నాటి భారతమనియు పేరు పెంపులు గడించినది. తత్కావ్య గత పాత్రలు ఆరాధ్య దైవతములై పూజాపురస్కారము లందుకొనుచున్నవి. మహాపండితుడును, మహాకవియు నగు శ్రీనాథుడంతటివాడే, యీ గాథను విని ముగ్ధుడై కొబ్బోలు దీనికి కావ్యగౌరవమును కల్పించినాడు. పల్నాటి చరిత్ర

పంద్రండవ శతాబ్దికి సంబంధించినదేయైనను ఇందలి పాత్రలకు పౌరాణిక వ్యక్తులతో పోలికలు స్థాపింపబడినవి. ప్రజానీకము నింతగా వశంవదము చేసికొనిన కావ్య మగుటచే పల్నాటి భారతమునకు శ్రీనాథుని రచనములందే కాక తెలుగు సార స్వతమునందును విశిష్టస్థానము లభించెను.

పల్నాటి భారతమువలె యాదవ భారత మని ప్రసిద్ధి కెక్కిన కాటమరాజు కథనుకూడ శ్రీనాథుడు కమనీయ కావ్య ముగా సంతరించినట్లు కొందరి అభిప్రాయము. ఈ కవిపేరు శ్రీనాథుడు కావచ్చును కాని, అతడు శృంగార నైషధకర్త మాత్రముకాడని నా అభిప్రాయము. ఈ రచన తరువాతి వారికి పథప్రదర్శక మయ్యెను. గంగుల పినయెల్లయ అను నతడు మంజరీ ద్విపదలోను, మఱియొక కవి పద్యకావ్యము గాను కాటమరాజు కథను వ్రాసినారు.

తెలుగులో వెలసిన విచిత్ర రామాయణములలో శతకంఠ రామాయణ మొకటి. ఈ కావ్యమునకు సీతావిజయము, శతముఖ రామాయణము, శతకంఠరామాయణము ననునామాంతరము లున్నవి. మర్దన అను కవి యీ కావ్యకర్తగా చెప్పబడినను ఇది యేకకవికృతి మాత్రము కాదని చెప్పదగును. ఈ కావ్యమునకు పత్యంతరములు మూడు లభించినను ఎందును కృత్యాదిపద్యములు లేవు.

శతకంఠరామాయణములోని విషయము చాల విచిత్రమయినది. ఇది అవాల్మీక మని వేఱుగా నుడువ నవసరము లేదు. దశకంఠుని సోదరుడే శతకంఠుడు. పులస్త్యుని సహోదరుడగు నశ్రేముని కుమారుడు శతకంఠుడు. రావణుని

మరణానంతరము రామచంద్రునిపై పగబూని అతనితో శతకంఠుడు సమరసన్నద్ధుడైనాడు. రాముడంతటివాడే అతనిని మార్కొనలేక కటకట బడినాడట! అప్పుడు సీతాదేవి 'విలయా నిలకీలయపోలె రోషమానసయై దనుజేంద్ర శిరంబులు గూలు గావుత' అనుచు ఒక విష్ణుబాణమును శతకంఠునిపై ప్రయోగించెనట. అది ఆ రక్కసుని శిరస్సులను, హస్తములను ఖండించి వైచెను. కాని వెంటనే అతనికి మస్తక హస్తములు మొలచినవి. అటుపిమ్మట సీత—

'అవనిపై నే బతివ్రత నైతి నేని
యరయ రాముండు ధర్మాత్ముఁ డయ్యె నేని
వేదములు సత్య మగునేని వీఁడు నిమ్మ
హాస్త్రమున దగ్ధుఁ డగుఁ గాక యనుచు'

బ్రహ్మాస్త్రమును నిగుడించెను. అది చిచ్చు లీనుచు జని శత కంఠుని హాత మార్చెను. కనుకనే యీ కావ్యమునకు సీతా విజయమని కవి పేరిడినట్లు తోచుచున్నది. శక్తి స్వరూపిణియై ఆమె యుద్ధ మొనర్చుట అను కల్పనలోని ఔచితిని పరిశీలించుటకంటె, ఈ విషయము నూతనమని సంతోషించుట సమంజసమేమో!

ఇంకను అయ్యలరాజు నారాయణామాత్యుని హంస వింశతి, కదిరీపతి శుకసప్తతి, నాదెండ్ల గోపమంత్రి, వెలిచేరు వేంకటరాయ ప్రధాని, కస్తూరి రంగకవి ప్రభృతులు వ్రాసిన కృష్ణార్జునసంవాదమను గయోపాఖ్యానము, దిట్టకవి నారా యణామాత్యుని రంగారాయ చరిత్ర మొదలగు కావ్యముల లోని కథలు కూడ జానపదులవే అనదగును.

కేవల కల్పనాకథలు కృత్రిమ రత్నములని కొందరు పెదవి విరిచినను, అసత్కథలు వ్రాయుటకంటె జానకీజాని కథలు వ్రాయుటయే వాంఛనీయమని కొందరు పేర్కొన్నను, కమనీయకావ్యములుగా సంతరింపబడిన, యీ మధుర జానపద గాథలు నేటికిని ప్రచుర ప్రచారమునం దున్నవి. అంతే కాక యీ కావ్యములు తెలుగు సాహిత్యము కేవలము గీర్వాణ సాహిత్య ప్రతిబింబ మను అపప్రథకు అపవాదము కల్పించినవి!

నాటక పితామహుని చిత్రాంగి

'అంగన నమరాదు తన
యంకెకు రాని మహాబలాఢ్యు వే
భంగుల మాయ లొడ్డి చెఱు
పం దలపెట్టు, వివేకియైన సా
రంగధరున్ పదంబులు క
రంబులు కోయఁగఁ జేసె తొల్లి చి
త్రాంగి యనేకముల్ నుడువ
రాని కుయుక్తులు పన్ని భాస్కరా.'

అంగన విశ్వసింపరానిది. తన యంకెకు రాని మహా బలాఢ్యుని కూడ ఆమె నాశనము గావించును. వివేకియైన సారంగధరు డను వానిని చిత్రాంగి అవాచ్యములగు కుయుక్తి లెన్నో పన్ని హింసించెనుగదా!

ఈ పద్యము భాస్కర శతకమునుండి గ్రహింపబడినదని వేఱుగ చెప్ప నవసరము లేదు.

నేటికిని ప్రచారములో నున్న కథలలో చిత్రాంగీ సారంగ ధరులగాథ ఒకటి. చారిత్రకముగా దీనికి నిలువ నీడ లభింప కున్నను, మన కవుల చల్లని చూపులపలన, ఈ కథకు సాహిత్య ములో స్థానము లభించినది. ఆధునికులలో ఆంధ్ర నాటక పితామహా బిరుదాంకితులు శ్రీ ధర్మవరము రామకృష్ణమా చార్యులవారు విషాద సారంగధరనాటక మను పేరున, ఈ గాథను దృశ్యకావ్యముగా సంతరించిరి. నాటినుండియు చిత్రాంగీ సారంగధరుల వృత్తాంతము విమర్శకుల దృష్టిని మిక్కిలిగా ఆకర్షించినది. అసలీ కథ దుర్నీతి బోధక మని వాదము నెఱపిన విమర్శకులు కూడ కొందఱు గలరు. వారి వాదమును పూర్వపక్ష మొనర్చి, యీ కథ నీత్యుబ్బోధక మే అని వాదించినవారు కూడ కొందరు లేకపోలేదు. ఈ విమర్శలకు కారణము దుశ్చరితయగు చిత్రాంగి సారంగధరుని యందు ప్రదర్శించిన దుర్మోహమే. నిష్పాక్షిక దృష్టితో అవ లోకించినగాని, ఆమె శీలములోని గుణదోషములు బయ ల్పడవు.

వస్తుతః చిత్రాంగి సుస్వభావ. కాని పరిస్థితు లామె శీల మును మంట గలిపివేసెను. ప్రప్రథమమున ఆమె సవ యసుఁడు, సుందరుడు నగు సారంగధరుని చిత్రపటమును చూచి అతనిని ప్రేమించెను. ఆ వలపు నిష్కళంకమైనది. కాని తండ్రి మాటను కాదనలేక వృద్ధు డగు రాజనరేంద్రుని పరిణయ మాడవలసి వచ్చినది. అయినను ఆ వృద్ధరాజును వలచినది. కాని ఆమె హృదయము మాత్రము సారంగ

ధరునియందే లగ్నమై యుండెను. ఈ విరుద్ధభావముల మధ్య జరిగిన సంఘర్షణలో చిత్రాంగి నలిగి నల్లేరయినది. తత్ఫలితముగా ఆమె శీలము కళంకితమైనది.

సారంగధరునకు వివాహము చేయవలెనను సదుద్దేశముతో రాజనరేంద్రుడు కన్యాన్వేషణము ప్రారంభించినాడు. అందులకు హిరణ్యుడు, విభావసుడను ఇరువురు బ్రాహ్మణులు నియోగింపబడిరి. రాజాజ్ఞను తలదాల్చి వారిద్దరు సారంగధరునికి తగిన కన్యకై దేశములు గాలించిరి. తుదకు హిరణ్యుడు విదర్భరాజ పుత్రికయగు చంద్రకళాదేవి పటమును, విభావసుడు భోజరాజు కుమార్తె యైన చిత్రాంగిదేవి పటమును సంపాదించి వానిని రాజరాజు సమక్షమున నుంచిరి. చిత్రాంగి పటమును చూచినదే తడవుగా అత డామెపై మరులుగొనినాడు. ఆమెను వివాహ మాడదలచెను. రాజనరేంద్రుని యీ మానసిక దౌర్బల్యమే నాటకము నందలి తరువాతి యనర్థములకు హేతుభూత మైనది. ఇది నిర్వివాదము. అందువలననే ఆచార్యులవారు రాజనరేంద్రుని ముఖతః 'ఈడు రాని వివాహ మెందును దగదు' అను సత్యమును బహిర్గత మొనర్చినారు. ఈడుగాని వివాహములు, బలవంతపు పెండ్లిండ్లు మొదలగునవి అవాంఛనీయము లని వానిని ఖండించు నుద్దేశముతో ఆచార్యులవా రీ నాటకమును వెలయించిరని పేర్కొనదగును.

త్రికరణశుద్ధిగా చిత్రాంగి సారంగధరుని వలచిన విషయము విభావసునకు తెలియును. 'నన్ను రహస్యముగాఁ బిలిపించి తన మనవి సారంగధరుని కెంతెంతో చెప్పు మన్నది. నిన్నుగా కింకొక్కనిఁ బతిగాఁ బడయునని విన్నవింపుమన్నది'

అని చింతాక్రాంతుడైన విభావసుడు తన మిత్రునితో నుడువును. ఈ విషయాదికము రాజనరేంద్రునకు కూడ తెలియును. కావున చిత్రాంగి సారంగధరుని ప్రేమించిన విషయమును రహస్యముగా ఉంచుటకై చెరి వేయి వరహాలొసగి హిరణ్య విభావసుల నోళ్లకు రాజనరేంద్రుడు తాళము వేసినాడు. కామాంధుడై అతడు గావించిన దొసగులలో ఇది యొకటి. ఇంతకు ఆశ్చర్య మేమనగా, చిత్రాంగి తన్ను ప్రేమించిన విషయమును గాని, రాజనరేంద్రు డొనర్చిన 'కుంభకోణము'ను గాని సారంగధరు డెఱుగనే యెఱుగడు. అతడు వట్టి అమాయకుడు! అతడేమో! అతని పావురముల ఆట లేమో!

సారంగధర నాటకములో ప్రథమాంకము ద్వితీయరంగము చిత్రాంగి దీర్ఘోపన్యాసముతో ప్రారంభ మగుచున్నది. ఆమె చేత నొక చిత్రపట మున్నది. అది ఆమె మనోనాథుడగు సారంగధరునిది. అప్పు డామె పలికిన పలుకులు చిత్రాంగి నిస్సహాయతను, మలినభావములను వ్యక్త మొనర్చుచున్నవి. సారంగధరుని రూపవైభవమునకు ముగ్ధయైన ఆమె అతని పొందును కోరినది. మాతృసమాన వనితాగమనమున కతడు సమ్మతించునా అనియు ఆమె సంశయించినది. అయినను ప్రయత్నింతునుగాక అనుకొనెను. ఆమె మానవవీథిని విరుద్ధ భావ సంఘర్షణ జరిగినది. అటుపిమ్మట రాజనరేంద్రుడు ప్రవేశించెను. తాను మృగయా వినోదార్థమై వింధ్యాటవికి పోవుచున్నానని చిత్రాంగికి చెప్పెను. ఆ మాటలు విన్నదే తడవుగా ఆమె కెక్కడలేని సంతోషము కలిగెను. కాని ఆ సంతోషమును లేశ మైనను బయల్పడనీయక భర్తృ వియోగ

మును భరింపజాలనని ఆమె నుడివెను. ఆమె మాటలలో ఆమెకే విశ్వాసము లేదు. రాజనరేంద్రునియందు తనకుగల మోహము కేవలము అభినయ మని చిత్రాంగికి చక్కగా తెలియును. కనుక దోష మని తెలిసియు దుర్మోహమునకు వశంవదయై ఆమె సారంగధరుని ప్రేమించె ననుట లెస్స.

రాజూరలేని సమయమును పురస్కరించుకొని చిత్రాంగి సారంగధరుని తన నగరున కాహ్వానించెను. అంతలోనే దుర్విధి వశమున అతడే కార్యాంతరమై ఆమెను సమీపించి నాడు. అప్పుడు చిత్రాంగి నర్మోక్తులాడి తన తీఱనిచలపును వ్యక్త మొనర్చెను. కాని సారంగధరు డామెను అర్థముచేసి కొనలేక పోయెను. నర్మోక్తుల వలన లాభము కలుగదని తలచి ఆమె 'నీ యాశ్లేషసౌఖ్యము నొసగుము' అని సారంగధరుని కోరినది. అత డామెకు హితబోధ చేసెను. చిత్రాంగి తల పెట్టిన కార్యము నరకప్రాప్తికి సోపాన మగునని నుడివెను. ఎన్ని మాటలు చెప్పినను చిత్రాంగి తన పట్టును విడువలేదు. ప్రాణహాని సంభవించినను సరే మాతృసమానవనితా గమనమునకు మాత్రము సమ్మతింపనని నిక్కచ్చిగా సారంగ ధరు డనెను. అప్పటి కైనను అతని పవిత్రహృదయమును తెలిసికొనలేక చిత్రాంగి మూర్ఛపుపట్టు పట్టినది. తత్ఫలిత ముగా సహృదయుల సహానుభూతిని కోల్పోయినది.

తొలుదొలుత చిత్రాంగిపై సహృదయులకు జాలి పొడ మును. బలవంతపు పెండ్లివలన ఆమె కట్టి దురవస్థ సంభ వించినదని మన మామెను కనికరింతుము. కాని కేవలము బాహ్యసౌందర్యమునే ప్రేమించిన చిత్రాంగి దుర్మోహమును చూచినప్పుడు మన కామెపై రోత యేర్పడును. నీచకార్య

మునకు ఒడబడని హేతువ్రచే సారంగధరునిపై పగబూని ఆమె రాజనరేంద్రుని సమక్షమున స్త్రీజన సహాజమగు లజ్జకు కూడ స్వస్తిచెప్పి పలికిన పలుకులు దుస్సహాములు, దుర్భరములును. అప్పటి చిత్రాంగియెడల మనకు సహానుభూతి కలుగనే కలుగదు.

ఇక ఒకింత చిత్రాంగి వాదనైపుణిని పరిశీలింతము.

విషాద సారంగధర నాటకము ధర్మవరమువారి స్వతంత్ర నాటకమే అయినను, ఇందు ప్రబంధచ్ఛాయలు కనబడుచున్నవి. పద్యరచనయందేకాక సంవాదములు సాగించుటయందును ధర్మవరమువారు ప్రబంధముల ననుసరించిరి. ప్రబంధములందును ముఖ్యముగా పెద్దనగారి మనుచరిత్రమునే వా రనుసరించిరి. కాగా సారంగధరలోని చిత్రాంగి మనుచరిత్రమునందలి వరూధినిని తలపించుచున్నది. వరూధిని మాటలవలె చిత్రాంగి పలుకులు కూడ గంభీర భావబంధురములు. కాని కొన్నిచోట్ల చిత్రాంగి మాటలు శ్రుతిమించి రాగాన పడినవి.

ఉపసంహారమున, నాటక పితామహుని చిత్రాంగి దుశ్చరిత అనియే నుడువనలసియున్నది. కాని కొందఱు తలచినంత దుశ్చరితగా ధర్మవరము వారు చిత్రాంగిని చిత్రించి యుండ లేదు. రాజనరేంద్రుని మాటను మీఱజాలక చిత్రాంగి తండ్రి ఆమెకా వృద్ధరాజుతో వివాహము చేసినాడు. అతడు గావించిన తప్పిదమునకు ఫలముగా చిత్రాంగికి శాశ్వత దుర్భ శము దక్కినది. ఈ దృష్టితో చూచిన, వరూధిని అన్నం తనే మనకు అసహ్యము కలుగనట్లు, నాటకపితామహుని చిత్రాంగియెడల మనకు జాలి కలుగును; కాని పిమ్మట అది మాయ మగును.

రాబర్ట్ డి నొబిలి

క్రీస్తు శకము పదునారవ శతాబ్దము నుండియు పాశ్చాత్యులు మన దేశమునకు రాకపోకలు సాగించిరి. వారిలో కొందరు వ్యాపారార్థమై వచ్చిరి; మరికొందరు క్రైస్తవమత ప్రచారకులుగా వచ్చిరి. వ్యాపారార్థమై వచ్చినవారు మన దేశపు రాజకీయములందు ప్రవేశించి తుదకు దొరతనము కూడ చేసిరి. అటులనే మతప్రచారకులుగా వచ్చినవారు కొందరు మన భాషాసాహిత్యములను అధ్యయనము కావించి సాహితీ ప్రపంచమున కొంతకాలము ప్రభుత నెరపిరి.

మన దేశములో క్రైస్తవ మతమును వ్యాపింపజేయనెలయు ననునది మతప్రచారకుల ముఖ్యోద్దేశ మని నుడువదగును. వారు తొలుదొలుత సముద్రతీరమున నున్న పట్టణములందును, పల్లె పట్టులందును నివాసము లేర్పరచుకొని మత ప్రచారము చేయ జొచ్చిరి. కాని కాలక్రమమున వారు వివిధ భారతీయ భాషలు నేర్చిరి. ఆయా భాషలలోని సాహిత్య ప్రగతిని పరిశీలించిరి. అంతటితో నిలువక వారిలో కొందరు నాలుగు కాలములపాటు నిలువదగిన చక్కని రచనలుచేసి చిరస్మరణీయులయినారు. ముఖ్యముగా వచన వాఙ్మయమునందును, నిఘంటు నిర్మాణ విషయమునందును వారు చేసిన కృషి అనల్పము; అపూర్వమును! అట్టివారిలో రాబర్ట్ డి నొబిలి ఒకడు.

క్రైస్తవ మిషనరీలలో జెసూయిట్ మిషనరీలు సుప్రసిద్ధులు. వీరు కాథలిక్కులు. వీరి ప్రధాన కేంద్రము రోమ్ నగరము.

క్రైస్తవమత సిద్ధాంతములను పెక్కు యూరపు దేశములందు వ్యాప్తిలోనికి తెచ్చినవారు వీరే అనవచ్చును. రాబర్ట్ డి నొబిలి జెసూయిట్ మిషనరీకి చెందిన ఫాదిరీ.

ప్రసిద్ధ జెసూయిట్ ఫాదిరీగానేకాక నొబిలి ప్రసిద్ధ తమిళ రచయితగా కూడ కీర్తి గడించెను. తమిళ—పోర్చుగీసు నిఘంటువు, క్రైస్తవ సమయ సంప్రదాయ కాండము, మంత్రమాల, ఆత్మ నిర్వాణము, క్రీస్తుదేవుని జీవిత చరిత్ర మున్నగు రచనలు చేసెను. వీనివలన నొబిలికి తమిళ వాఙ్మయమున స్థానము లభించెను. తమిళముతోపాటు సంస్కృతాంధ్రములను కూడ అతడు నేర్చెను. సంస్కృతాంధ్రములు నేర్చిన తెల్లవారిలో అతడే ప్రథము డనదగును.

నొబిలి ఆభిజాత్య సంపన్నుడు. అతని పూర్వులలో ఇద్దరు ప్రధాన పోపుపదవి నలంకరించిరి. మరియొకరు పోపుకు తరువాతిదగు కార్డినల్ పదవి నలంకరించెను. క్రైస్తవ మతాచార్య లుద్భవించిన వంశమునకు చెందినవాడగుటచే అతనికి బాల్యమునుండియు తనత సిద్ధాంతములు కరతలామలకము కావొడగెను. ఫాదిరీలలో సాధారణముగా కానవచ్చు కార్య దీక్ష, మతాభిమానము, సహనము మున్నగు విశిష్టగుణము లతనికి అలవడెను.

రాబర్ట్ డి నొబిలి ఇటలీలోని మోన్ టేపుల్సియానా అను ఊరిలో 1577 వ సంవత్సరమున జన్మించెను. పందొమ్మిదవ యేట జెసూయిట్ సంఘములో చేరెను. చేరిన కొంతకాల మునకే భారతదేశములో క్రైస్తవమత వ్యాపనము చేయ వలెనను కోరిక అతనికి కలిగెను. అందుకు అధికారులుకూడ సమ్మతించిరి. కాగా 1605 లో అతడు మన దేశమునకు

ప్రయాణమై గోవా చేరుకొనెను. అటుపిమ్మట అతడు కొచ్చిన్‌లోనున్న మత పాఠశాలలో చేరి మతప్రచారకుడుగా శిక్షణ పొందెను.

ఆ నాళ్లలో మధుర, తంజావూరు, జింజి మున్నగు రాజ్యములను నాయకరాజులు పరిపాలించుచుండిరి. నాయకరాజుల సామంతులనదగు పాళెగాండ్రు కూడ కొన్ని చోట్ల అధికారము వహించియుండిరి. వస్తుతః నాయకరాజులు విశాలహృదయులు; మతసహనము గలవారు. కనుకనే వారి యేలుబడిలో క్రైస్తవమత ప్రచారకులు మధుర తంజాపురాది ప్రాంతములందు మతప్రచారము చేయగలిగిరి. కాని కొందరు పాళెగాండ్రు మతప్రచారకులను ముప్పుతిప్పలు పెట్టిరి. ప్రజలలో కూడ కొందరు ప్రచారకులను బాధించినట్లు తెలియుచున్నది. ఇందుకు మతప్రచారకులు అవలంబించిన విధానమే కారణమని చెప్పవలసియుండదు. కాని అది ఒక కారణమని మాత్రము చెప్పవచ్చును.

ఆ రోజులలో పోర్చుగీసువారన్నచో ప్రజలకు ఎక్కడలేని ద్వేషభావముండెను. వారిని తెలుగువారు బుడతకీచులనియు, తమిళులు పరంగివారనియు వ్యవహరించిరి. బుడతకీచులు మాంసాహారులు; మద్యపాన నిరతులు. నిమ్నజాతివారగు పరవలతో కలసిమెలసి తిరుగుచుండిరి. అట్టి బుడతకీచు ఘాదిరీలను చూచి ప్రజలు ఏవగించుకొనిరి. వారి సిరిసంపదలు, ఆచార వ్యవహారములు, వేషభాషలు మున్నగునవి ప్రజలను ఆకర్షించలేవు. పైపెచ్చు తాత్త్విక రహస్యములను చర్చించు అధికారము వారికి లేదనియు తలచిరి. క్రైస్తవ మతమును స్వీకరించినవారు కూడ తమ ప్రాచీనాచార వ్యవహార

ములను విస్తరించి పరదేశీయులగు బుడతకీచుల వలె తిరుగ జొచ్చిరి. మొత్తముమీద బుడతకీచులన్నను, క్రైస్తవ మతాంతరు లన్నను ఆనాటివారికి ఆదరభావము లేకుండెను. దురదృష్ట వశమున ఈ యేవగింపు క్రైస్తవ మతముమీదికి ప్రాకిపోయెను. కాగా ప్రజలు క్రైస్తవ మతానుయాయులను బాధింపసాగిరి. ఆ బాధలను సహింపలేక పలువురు తమ ఆస్తిపాస్తులను విడిచి పెట్టి పరస్థలములకుపోయి తలదాచుకొనిరి. కాని మధుర రాజ్యమున మాత్రము క్రైస్తవమతప్రచారకుల స్థితిగతులు బాగుగనే యుండెను.

క్రీ శ. 1572 నుండి 1595 వరకు మధుర నేలిన వీరప్ప నాయకుని కాలమున ఫర్నాండెస్ అను జెసూయిట్ ఫాదిరీ మధుర కేతెంచెను. వీరప్పనాయకుని సమ్మతిని పొంది అతడు మధురలో మతప్రచారము ప్రారంభించెను. ఆ నగరమున అతడొక చర్చి కట్టెను. ఒక వైద్యశాలను నిర్మించెను. 1592 వ సంవత్సరమున మధుర మిషన్ అనునొక సంఘమును కూడ స్థాపించెను. అగ్రవర్ణముల వారిని మతాంతరులుగా చేయుటకు ఫర్నాండెస్ అనల్పమగుకృషి చేసెను. రమారమి పదునాలుగు సంవత్సరము లతడు పట్టువిడువక ప్రచారము చేసె ననియు, కాని అగ్రవర్ణముల వారొక్కరైనను క్రైస్తవ మతమును స్వీకరింపలే దనియు తెలియుచున్నది. ఇందుకు కారణము ఫర్నాండెస్ కృషి లోపము కాదు. బుడతకీచులపై ప్రజలకు గల విపరీత అసహ్యమే కారణ మనవచ్చును.

కొచ్చిన్‌లోనున్న రాబర్ట్ డి నొబిలి యీ విషయాదిక మును తెలిసికొనెను. ఫాదిరీల వేషభాషలందును, ఆచార వ్యవహారములందును మార్పు ఏర్పడినగాని వారి మతప్రచా

రము విజయవంతము కాజాలదని తలచెను. మద్యమాంస ములను విసర్జింపవలెను. భారతీయుల వలె వేషధారణ చేయ వలెను. ప్రజలు మాటలాడు భాషలలోనే ప్రచారము చేయవలెను. అనగా తమిళము, తెలుగు మున్నగు భాషలు నేర్వవలెను. దేవభాషయగు సంస్కృతమును కూడ అభ్య సింపవలెను. అంతేకాక భారతీయులనే మతప్రచారకులుగా నియమింపవలెను. అప్పుడు తప్పక క్రైస్తవ మతము ప్రచుర ప్రచారము గడింపగలదని నొబిలి తలచెను.

నొబిలి తన అభిప్రాయములను ఉన్నతాధికారులకు తెలియజేసెను. వారి ఆమోదముద్ర లభించిన పిదప, అనగా 1606 వ సంవత్సరమున, అతడు మతప్రచారకుడుగా మధురా నగరమునకు పయన మయ్యెను. అప్పటి కాతడు 29 యేండ్ల యువకుడు.

ఆశయములను ఆచరణమునందు పెట్టగల కార్యశూరుడు రాబర్ట్ నొబిలి. మధురను చేరినతోడనే అతడు తమిళము నేర్వదొడగెను. ఒక బ్రాహ్మణ పండితునియొద్ద ఆంధ్ర, సంస్కృత భాషాధ్యసనము చేయసాగెను.

ఆ రోజులలో పాశ్చాత్యులు బ్రాహ్మణులయొద్ద సంస్కృత భాషాధ్యయనము చేయుటకు ఎంతో శ్రమపడవలసి వచ్చెడిది. నొబిలి వ్రాసిన ఒక లేఖనుండి (22-4-1609) కొన్ని వాక్య ముల నిట ఉదాహరించుచున్నాను. '.....నా గురువు మంచి పండితుడు. ఆయన నాకోసము శాస్త్రము లన్నిటిని వ్రాసి పెట్టెను. ఇది రహస్యముగానే జరుగవలెను. ఈ విషయము కనుక ఇతర బ్రాహ్మణులకు తెలిసినచో, వారు ఆయన కంటి

గ్రుడ్లు పెరికివైచెదరు. ఇదియే తక్కువ శిక్ష.' కనుక నొబిలి ఎంతో కష్టపడి సంస్కృతము నేర్చెనని చెప్పనక్కరలేదు.

తన ఆచార వ్యవహారములను కూడ నొబిలి మార్చుకొనెను. ఆహారవిధానమును కూడ మార్చుకొనెను. బ్రాహ్మణులు నివసించు నొక వీధిలో నివాసము నేర్పరుచుకొనెను. ఒక చిన్న గుడిసెలో కాలము గడపసాగెను. మద్యపానమును మానెను. మాంసాహారమును విసర్జించెను. కాయగూరలనే తినుటకు అలవాటు చేసికొనెను. ముండ్లు గరికెలతోగాని చెంచాలతోగాని తినుట మానివైచెను. క్రింద కూర్చుండి అరటియాకులో భోజనము చేయసాగెను. రోమ్‌నుండి వచ్చిన బ్రాహ్మణ సన్న్యాసినని నొబిలి తన్ను చూడవచ్చిన వారితో చెప్పుచుండెడివాడట! అందులకు అనుగుణముగా అతడు కాషాయాంబరములు దాల్చెను. పావుకోళ్లు వేసి కొనెను. జందెము కూడ వేసికొనెను. కాని సన్న్యాసులు జందెము వేసికొనరని తెలిసికొనిన పిమ్మట జందెమును తీసి వైచెను. దండ కమండలములను సమకూర్చుకొనెను. కొంత పరివారమును కూడ సమకూర్చుకొనెను. సపరివారుడై కాలి నడకను సంచారము చేయుచుండెడివాడు.

రాబర్ట్ నొబిలి రాకతో (1606) మధుర మిషను చరిత్రలో నూతనాధ్యాయము ప్రారంభమయ్యెనని చెప్పనచ్చును. అతని కృషివలననే మధురలో క్రైస్తవ మతమునకు విశేష వ్యాప్తి లభించెను. ఏ ఫాదిరీ కూడ సాధించనంత మహత్తర విజయమును అతడు సాధింపగలిగెను.

తొలుత ఫర్నాండెస్‌తో కూడి అతడు మతప్రచారము చేయజొచ్చెను. కాని తన ఆశయముల కనుగుణముగా

ప్రచారము చేయ నభిలషించి ఫర్నాండెస్‌తో గల సంబంధమును తెగత్రెంపులు చేసికొనెను. అటుపిమ్మట స్వతంత్రుడై ప్రచారము చేయదొడగెను.

నొబిలి నిరాడంబర జీవితము, వేషభాషలు మొదలగునవి చూపరులను బహుధా ఆకర్షించెను. అతడు రోమ్‌నగరపు బ్రాహ్మణు డనియే వారెల్లరు నమ్మిరి. గృహకృత్య నిర్వాహణమునకును, వంటవార్పులకును నొబిలి బ్రాహ్మణులనే యేర్పాటు చేసికొనెను. ఐరోపీయులయు, పంచములయు సాంగత్యమును విసర్జించెను. కొంతకాలము—అహోరాత్రము—అతడు తన కుటీరములోనే కాలక్షేపము చేసెను. తన్ను చూడ వచ్చిన వారితో తాత్త్వికచర్చలు సలిపెడివాడు; తీరిక చిక్కినప్పుడెల్ల గ్రంథావలోకనము చేసెడివాడు; గ్రంథరచనము చేయు చుండెడివాడు. అచిరకాలమునసే అతడు సంస్కృతాంధ్ర భాషలు చక్కగా మాటలాడ నేర్చెను. దేశభాషలందే చర్చలు సాగించుటచే అతడు అనాయాసముగ మధురానగర వాసుల ఆదరాభిమానములు చూరగొనెను. అంతేకాక అతనిని ప్రజలు ఆదరపురస్సరముగ 'తత్త్వబోధక స్వామి' అని వ్యవహరించిరి.

రోజులు గడచుకొలది అతని పేరుపెంపులు మధురలో బాగుగా వ్యాపించెను. అతడు కొన్ని అద్భుతములు కూడ చేసినట్లు చెప్పుదురు. శిలువ సాహాయ్యమున దయ్యములను వదిలించెడివాడట! అగ్రవర్ణములవారు, ప్రభుత్వోద్యోగులు, పాళెగాండ్రు మొదలయినవారు పలువురు నొబిలియొద్ద ఉపదేశము పొందుటకు కూడ సన్నద్ధులయిరి.

కాలక్రమమున నొబిలి ప్రచారమునకు వశంవదులై బ్రాహ్మణులు కూడ క్రైస్తవమును స్వీకరించిరి. తొలుత ఈ మతస్వీకారము రహస్యముగానే జరిగెను. పిమ్మట బహిరంగముగా జరుగజొచ్చెను. నొబిలికి సంస్కృతాంధ్రములు నేర్పిన ఆ బ్రాహ్మణ పండితుడు కూడ క్రైస్తవుడయ్యెనట!

నొబిలి ప్రతిభావిశేషములను విని అప్పటి పోర్చుగల్ పరిపాలకుడగు మూడవ ఫిలిప్పు నొబిలిని ప్రశంసించుచు ఫర్మానా ఒకటి పంపెను.

ఇది యిట్లుండగా ఫర్నాండెస్ ఫాదిరీ నొబిలి అవలంబించిన ప్రచారవిధానము క్రైస్తవమత సిద్ధాంతములకు అనుగుణముగా లేదని పై అధికారులకు తెలియజేసెను. అయినను నొబిలి తన విధానమును మార్చుకోలేదు. ఈ విషయమై అధికారులు విచారణ జరిపించిరి.

తుదకు నొబిలి అనుసరించిన విధానము సరికాదనియే అధికారులు నిర్ణయించిరి. అందువలన 1613 వ సంవత్సర ప్రాంతమున నొబిలి మతప్రచారమును విరమింపవలసివచ్చెను. అయినను అందుల కతడు నిరుత్సాహము చెందలేదు.

అటుపిమ్మట అధికారుల నిర్ణయము సరికాదని అతడు పోపుకు ఫిర్యాదుచేసెను. ఏమయిననేమి, యీ వివాదమును పురస్కరించుకొని నొబిలి పది సంవత్సరములు పోరాడవలసి వచ్చెను. తుట్టతుదకు—అనగా 1623-వ సం॥న పోపు నొబిలి అనుసరించిన విధానమున దోషమేమియు లేదని నిర్ణయించెను.

నొబిలి అంతిమ విజయము సాధించెనన్న మాటయే కాని, అతని పేరు పెంపు లా పదిసంవత్సరములలోను క్రమక్రమముగా

తగ్గజొచ్చెను. అందువలన మధురలో ప్రచారము కొనసాగిం చుట కష్టమని తలచి 1623 వ సం॥న అతడు మధురానగర మును విడనాడి చెందామంగలమను పాళెమునకు పోయెను. ఆ పాళెపునాయకుని సమ్మతితో నొబిలి మరల మతప్రచారము నారంభించెను.

నానాటికిని క్రైస్తవ మత ప్రచారకులయందును తన్మతాం తరులయందును ప్రజలకు ద్వేషభావము ఎక్కువ కాదొడగెను. తత్ఫలితముగా ఫాదిరీలు పలుబాధలు పడిరి. మధుర నేలిన ఆ తెలుగు దొరలు మతసహనము గలవారగుటచే, మధుర రాజ్యమునందలి ఫాదిరీలకు కొంతవరకు ప్రభుత్వరక్షణ లభిం చెను. ముఖ్యముగా ముద్దుతిరుమల శౌరి నాయకుని కాలమున ఫాదిరీలు మతప్రచారము చేసికొనుటకు సంపూర్ణ స్వాతం త్ర్యము బడసియుండిరి. కాని రామనాథపురమున అప్పటి పరిపాలకుడగు కిళవన్ (వృద్ధ) సేతుపతి కాలమున ఫాదిరీలు పలు యిక్కట్టులకు లోనయినట్లు తెలియుచున్నది.

కనుక 1622 న సం॥నకు పిమ్మట నొబిలి మత ప్రచారము అంత సార్థకము కాలేదని నుడువనగును. 1648 లో ఆరోగ్యము చెడుటచే అతడు తొలుత సింహళములోను, పిమ్మట మదరాసు లోని మైలాపూరులోను కొంత కాలము గడపెను. తత్త్వ బోధకస్వామి అని విశేష విఖ్యాతి గడించిన అతడు 1660 లో కాలధర్మను చెందెను.

ఉప సంహారమున రాబర్ట్ డి నొబిలి వ్రాసిన లేఖలను గురించి ఒకటి రెండు మాటలు చెప్పుట సమంజసము. ఈ లేఖ లను పురస్కరించుకొని మధుర, తంజావూరు, జింజి నాయక రాజులకాలపు రాజకీయ, సాంఘిక నైతిక, మత పరిస్థితులను

మనము తెలిసికొనవచ్చును. ఇందుకు ఒక్క నొబిలి లేఖలే కాక జెసూయిట్ మిషనరీల లేఖలన్నియు తోడ్పడగలవు. వీనిని ఫ్రెంచినుండి ఆంగ్లములోనికి అనువదించి ప్రకటించిన శ్రీ ఆర్. సత్యనాథ అయ్యరుగారు (అణ్ణామలై విశ్వవిద్యాలయమున చరిత్ర రాజనీతి శాస్త్రముల ఆచార్యులు) ఎంతయు ప్రశంసనీయులు.

వీరమాముని

క్రీస్తుశకము 15, 16, 17 శతాబ్దములందు దక్షిణాపథములో చాలభాగము 'మేరుసమాన ధైర్యయశస్థిలకు'లని పేరు పెంపులు గడించిన నాయకరాజుల పరిపాలనాధికారమున నుండెను. నాయకరాజులు తెలుగువారు. తెలుగు భాషా వాఙ్మయములకు దక్షిణ భారతమున బహుళ ప్రచారము కలిగినది వీరికాలములోనే. ఆ నాళ్లలో పలువురు తమిళులు తెలుగుభాష నభ్యసించిరి. క్రైస్తవ మతవ్యాపనోద్వేషముతో ఏతెంచి తమిళ నాడులో స్థిరనివాసము లేర్పరుచుకొనిన ఫాదిరీలు కూడ రాజభాషయగు తెలుగు నభ్యసించిరి. తంజావూరు నేలిన మహారాష్ట్ర నృపతులును, తెలుగు భాషా సాహిత్యములను పోషించుటయే కాక తెలుగున రచనలు కూడ చేసిరనగా, తెలుగు భాషావాఙ్మయముల యెడ అలనాటి ప్రభువులకును, ప్రజలకును గౌరవ ప్రపత్తు లుండె ననుట స్పష్టము.

వస్తుతః నాయకరాజులు మత సహనముగల విశాల హృదయులు. అందువలననే ఫాదిరీలు నిరాటంకముగా మత

ప్రచారము చేసికొనగలిగిరి. కాని మలిన మనస్కులైన కొందరు పాళెగాండ్రును, బుడతకీచు లనిన ద్వేషభావము కలిగిన కొందరు ప్రజలును వారిని ముప్పుతిప్పలు పెట్టిరి.

నాయకరాజులకు పిమ్మట తంజావూరు మహారాష్ట్రుల వశమయ్యెను. మహారాష్ట్రులు క్రైస్తవ మతానుయాయులను, ప్రచారకులను ద్వేషించిరి. తత్ఫలితముగా తంజావూరు తత్పరి సరములందున్న క్రైస్తవులు పలువురు తంజపురమును విడనాడి యితర ప్రాంతములకు పోయి తలదాచుకొనిరి.

తంజావూరు జిల్లాలోని కొల్లిడం నది యొడ్డున నున్న ఏలాక్కురిచ్చి అను నొక కుగ్రామము క్రైస్తవ కాందిశీకులకు ఆశ్రయ మొసగెను. ఏలాక్కురిచ్చికి పలువురు క్రైస్తవులు తరలి వచ్చిరి. వారిలో ఒక ఘాదిరీ కూడ నుండెను. అత డచ్చట ఒక ఆలయము నిర్మించి అందు దేవమాత యగు మేరి విగ్రహమును ప్రతిష్ఠించెను. 'ఆశ్రయ మిచ్చుతల్లి' అని భక్తు లా దేవిని ప్రస్తుతించిరి. ఆమె చల్లని చూపులే ఆ గ్రామమునకు ఏడుగడ అను నుద్దేశమున ఆ ఘాదిరీ తిరుక్కావలూర్ అని ఆ గ్రామమునకు నామకరణము చేసెను. నేటికిని తిరుక్కావలూ రనియే ఏలాక్కురిచ్చి గ్రామమును ప్రజలు వ్యవహరించుచున్నారు. తుదకు తమిళవాఙ్మయమున కూడ తిరుక్కావలూరు చోటు చేసికొనెను.

కాలక్రమమున ఆ ఘాదిరీకి తిరుక్కావలూరనిన అంతులేని గౌరవభావము కలిగెను. తిరుక్కావలూర్ కలంబగమ్ అను కృతిలో 'తిరుక్కావలూరు సుందరోద్యానమున పచ్చికగా జన్మించి మధుపమువలె తిరుగుచు, మధువును గ్రోలుచు, తీయని' పాటలు పాడవలెనని అత డభిలషించెను.

మతబోధచేయు నభిలాషతో తమిళనాడున స్థిరనివాస మేర్పరుచుకొనిన ఆ ఫాదిరీ జన్మభూమి ఇటలీదేశము. ఒక్క తిరుక్కావలూరు నందేకాక, తమిళభాషాసాహిత్యములందును అతనికి ప్రగాఢమగు నభిమాన మేర్పడెను. తమిళమున నిఘంటువు నిర్మించియు, వచనరచనలు వెలయించియు, మహా కావ్యము నొకటి రచించియు, తమిళ భాషాధ్యయనము చేయ నభిలషించు పాశ్చాత్యులకు నిఘంటువులు సమకూర్చియు తమిళభాషా వాఙ్మయములకు తుదలేని మహోపకార మొనర్చిన ఆ ఫాదిరీ నిజమునకు ఋషితుల్యుడే! నాడును నేడును కూడ తమిళు లతనిని వీరమామునివర్ అని సభక్తికముగా వ్యవహరించుట గమనింపదగు నంశము.

వీరమామని బహుభాషావేత్త. తమిళముతో పాటు అతడు తెలుగు కన్నడములను, హిందూస్తానీ పారశీకములను, సంస్కృతమును నేర్చినట్లు తెలియుచున్నది. తెలుగున కొన్ని గ్రంథములను, ఒక వ్యాకరణమును రచించె ననియు తెలియుచున్నది.

వీరమామని అభిజాత్యసంపన్నుడు. 1680 వ సంవత్సరము నవంబరు 8-న అతడు కన్‌టాల్పోబెస్కి, ఎలిజబెత్ బెస్కి దంపతులకు జన్మించెను. తలిదండ్రు లతనికి జోసెఫ్ కాన్‌స్టన్‌టైన్ బెస్కి అని పేరిడిరి. కాని తరువాతి కాలమున తమిళము మీది అభిమానము కొలది బెస్కి ధైర్యనాథుడని తన పేరును మార్చుకొనెను. బెస్కి వంశనామమును విసర్జించెను. అంత టితో అత డాగలేదు! వేషభాషలను, ఆచార వ్యవహారము లనుకూడ మార్చుకొనెను. బెస్కి విద్వత్తును, వేషధారణ మును చూచి ప్రజ లతనిని వీరమామని అని వ్యవహరింప

జొచ్చిరి. తుద కీ పేరే తమిళసాహిత్యమునందును, తమిళ నాడునందును నిలిచిపోయెను.

వీరమామని వేషపు తీరును కన్నులకు కట్టునట్లుగా ఒక సహృదయు డిట్లు అభివర్ణించెను:

'ఈ దేశమునకు వచ్చినప్పటినుండియు ఆయన మాంసాహారమును విసర్జించి శాకాహారమును స్వీకరింపసాగెను. వంటకు ఇద్దరు తమిళులను నియోగించుకొనెను. రోజున కొక్క పూట మాత్రమే ఆయన భోజనము చేయుచుండెడివాడు. మధమున ఉన్నప్పు డాయన నుదుట గోపిచందనపు బొట్టు పెట్టుకొను చుండెను. సూర్యకాంతి పట్టుకుల్లాయి, నీర్కావి గుడ్డలు, తిరునెల్వేలి అంచులుగల ఉత్తరీయము మున్నగువానిని ధరించు చుండెను. కాళ్లకు పావుకోళ్లుండును. పర్యటనకు బయలు దేరుసపుడు ఆయన చలువ వలువలును, లేత కావిరంగుగల శాటిని, తెల్లని తలపాగను ధరించును. చేత జపమాలయు దండమును, చెవులకు ముత్యాల కుండలములును, వ్రేలికి తంబాకు ఉంగరమును, కాళ్లకు చెప్పులు నుండును. పల్లకిలో మెత్తని పరపు మీద వ్యాఘ్రచర్మము పరుపబడియుండును. ఉభయ పార్శ్వములందు విజాయరలు వేయుచుండగా, ఇరువురు నమలికన్నుల విసనకట్రలు వీచుచుండగా, స్వర్ణకలశముగల కావిరంగుగుడ్డగొడుగు పట్టుకొని ముందొకరు పోవుచుండగా అప్పు డాయన పల్లకి నెక్కి వెడలును. దిగినచోట వ్యాఘ్ర చర్మాసనముపై కూర్చుండెడివాడు.'

పుట్టుక చే పరదేశీయుడైనను, ప్రదర్శించిన భాషాభిమానము వలనను, అవలంబించిన ఆచార వ్యవహారముల వలనను బెస్కి-

తమిళము డయ్యెను. అదియే అతని లక్ష్యమై యుండె ననియు వ్యక్త మగుచున్నది.

అధ్యాపక వృత్తితో బెస్కీ జీవితము ప్రారంభ మయ్యెను. కాని మూడు సంవత్సరములు మాత్రమే అత డా వృత్తియం దుండెను. ఆ మూడేండ్లలోను ఫ్రెంచి, హీబ్రూ, గ్రీకు, లాటిన్, పోర్చుగీసు మున్నగు భాషలు నేర్చెను. క్రైస్తవ మతవ్యాప్తి నిర్వహణమునకే జీవితము సంకిత మొనర్పనెంచిన బెస్కీ 1706 నుండి నాలుగేండ్లు తత్త్వతర్క శాస్త్రము లభ్యసించి వానిని ఆపోశనము పట్టెను. కడపట అతడు బిషప్ పదవి నందెను. 1710 లో అతడు మనదేశమునకు వచ్చెను. అప్పటి కతడు ముప్పదేండ్ల యువకుడు!

గోవాలో కొన్నాళ్లు విశ్రాంతి తీసికొని అటుపిమ్మట బెస్కీ దక్షిణాపథమునకు బయలుదేరెను. అంబలక్కాడు, మణ ప్పాడు, తూత్తుక్కుడి మొదలగు ప్రదేశములందు మతప్రచా రము చేసెను. తూత్తుక్కుడిలోనే అతడు తమిళము నేర్చె ననియు, ఆనాళ్లలో సుప్రసిద్ధ పండితకవిగా పేరొందిన సుప్ర దీపకవియే అతని గురు వనియు తెలియుచున్నది.

బెస్కీ ఒకవైపు మతప్రచారమును, మరొకవైపు భాషాధ్య యనమును సాగించుచున్న ఆ రోజులలో తమిళనాడు రాజకీయ కలహాములచే అట్టుడికి నట్లుడికి పోవుచుండెను. మధురను రాణి మీనాక్షియు, తంజావూరును మహారాష్ట్రులును పరిపాలించుచుండిరి. అక్కడక్కడ కొందరు పాళెగార్లు ప్రబలులై యుండిరి. ఆర్కాటు నవాబుల అధికారము నానాటికిని దక్షిణాపథమున ప్రబల మగుచుండెను. మహా రాష్ట్ర నృపతుల యుద్ధములు, ఆర్కాటు నవాబుల దండ

యాత్రలు, కొందరు పాళెగార్ల వికటాట్టహాసము—మున్నగునవి తమిళ దేశపు ప్రశాంత వాతావరణమును కలుషిత మొనర్చెను.

ఆ అప్రశాంత వాతావరణములో కూడ బెస్కి- మత ప్రచారమును మానలేదు; భాషాధ్యయనమును విడువలేదు. మీదు మిక్కిలి అతడు కాందిశీకులై వచ్చిన క్రైస్తవ మతానుయాయుల నాదరించెను. వారికి గృహ వసతి కల్పించెను. శిథిలములయిన క్రైస్తవాలయములను పునరుద్ధరించెను.

మేఘావృతమయిన ఆకాశము మున్నెన్నడో తాను త్రాగిన నీటిని క్రక్కుటచే సెలయేరు వర్ణడుచున్నది. అటులనే విద్వాంసులు తాము చదివిన గ్రంథములను ఇతరుల కోసము చక్కగా వ్యాఖ్యానము చేయుచున్నారని వీరమామని 'తేంబావణి' అను కావ్యము సందొకచోట పేర్కొనెను. వీరమామని సాహిత్య సమాలోచనము చేయుచునప్పు డీ విషయము సత్యమని స్ఫురించును. మతవ్యాప్తిని మనసులో ఉంచుకొనియే బెస్కి- భాషాధ్యయన మొనర్చినను, ఆతడు సృష్టించిన సాహిత్యము మాత్రము అన్ని మతములవారి యందును విజ్ఞాన వ్యాప్తికి తోడ్పడుచున్నదనుట అత్యుక్తి కాదు.

వీరమామని యీ క్రింది గ్రంథములు రచించెను:

(1) తిరుక్కావలూర్ కలంబగమ్.

(2) తేంబావణి.

(3) కిత్తేరియమ్మాళ్ అమ్మానై.

(4) అన్నైయళుంగల్ అంతాది.

(5) అష్టైకక్కలమాలై.

(6) తొన్నూల్ విళక్కం.

(7) చతు రగరాది.

(8) వేడియర్ ఒళుక్కమ్.

(9) వేద విళక్కమ్.

(10) పరమార్థ గురు కథై.

(11) ప్రాచీన తమిళ వ్యాకరణము (లాటిన్ భాషలో)

(12) వ్యావహారిక తమిళ వ్యాకరణము.

(13) తిరుక్కుఱళ్ (లాటిన్ అనువాదము).

వీనిని వచనరచనలు, నిఘంటువులు, లక్షణ గ్రంథములు, కావ్యములు—అని నాలుగు విధములుగ విభజింపనగును.

వచనరచనలు :

కడమ భాషలలోవలె తమిళమునందును వచన వాఙ్మయము క్రైస్తవ మతబోధకుల కృషివలన సంపన్న మయ్యె ననుట సమంజసము. వచనవాఙ్మయ మాకర్షించినంతగా మరియొక సాహిత్య ప్రక్రియ సామాన్య ప్రజను ఆకర్షింపలేదు. ఈ సత్యము కనుగొన్న వీరమామని సామాన్యులకు సైతము సుబోధకమగు సరళ శైలిలో తమిళమున పరమార్థ గురుకథను రచియించెను. ఈ పుస్తకము పుదుచ్చేరిలో ముద్రింపబడెను. హాస్యరస ప్రధానమయిన యీ కథ బహుళ వ్యాప్తి నందుటయేకాక తెలుగు, కన్నడము, ఆంగ్లము, ఫ్రెంచి, జర్మను మున్నగు ప్రాచ్య పాశ్చాత్య భాషలలోనికి కూడ అనువదింప

బడెను. 1861 లో ముద్రితమయిన పరమానంద గురువుల కథలు బహుశః పరమార్థ గురుకథకు వెలసిన తెలుగునేత అనదగునేమో!

క్రైస్తవ మతబోధకుల ఉపయోగార్థము వీరమామిని 'వేదియర్ ఒళుక్క'మును రచించెను. ఇది కూడ తరువాతి కాలమున తెలుగు కన్నడములందు పరివర్తింపబడెనట! బైబిలులో చెప్పబడిన ధర్మములను వివరించుచు అతడు వేద విళక్కమును సంతరించెను. ఈ మూడు వచన రచనలును తమిళ వచన వాఙ్మయమున వెలసిన తొలిరచనలు.

నిఘంటువులు:

జైనబౌద్ధుల యుగముసందే తమిళమున నిఘంటువులు వెలసెను. దివాకరం, పింగలం, చూడామణి మొదలగునవి ప్రాచీన నిఘంటువులు. కంఠస్థము చేయుటకు వీలుగా, ఈ నిఘంటువులు సూత్రరచనా విధానమున సాగెను. ఇవి కవి పండితులపాలిటి కల్పవృక్షములు; కాని సామాన్యులకు వీని వలన అంతగా లాభము చేకూరలేదు. అందును తమిళము నభ్యసించు పాశ్చాత్యుల కీ నిఘంటువులవలన అణుమాత్ర మైనను లాభము లేకుండెను. అకారాద్యక్షర క్రమమున తొలిసారిగా తమిళమున నిఘంటువును సంతరించిన చిరయశస్సు వీరమామునికే చెందుచున్నది. ఈ నిఘంటువునకు చతురగ రాది అనిపేరు. ఇదియే తరువాతి నిఘంటు నిర్మాతలకు మార్గ దర్శక మైనది.

దివాకరం, పింగలం, చూడామణి మొదలగు ప్రాచీన నిఘంటువులలో ఉన్న శబ్దములను గ్రహించి వీరమామిని

వానిని అకారాదిగా చతురగరాదిలో నొసగెను. ఇందులో నానార్థపరిచ్ఛేదము, పర్యాయపద పరిచ్ఛేదము, సమాన పరిచ్ఛేదము అను నాలుగు పరిచ్ఛేదములు గలవు.

తమిళము నభ్యసించు లాటిన్ భాషాభిజ్ఞుల ఉపయోగార్థమై వీరమాముని తమిళము—లాటిన్ నిఘంటువు నొకటి సంతరించెను. ఇందు 9,000 తమిళ శబ్దములకు లాటిన్‌లో అర్థము లొసగబడినవి. ఆనాళ్లలో బుడతక్రీచుల ప్రాభవ మెక్కువగా ఉండుటచే వారి ఉపయోగార్థమై వీరమాముని పోర్చుగీసు—తమిళము—లాటిన్ నిఘంటువును కూడ సంతరించెను. ఇందులో 4,000 పోర్చుగీసు మాటలకు తమిళములోను, లాటిన్‌లోను అర్థము లియ్యబడెను. వీరమాముని పాండితీ ప్రతిభల నవగతము చేసికొనుట కీ నిఘంటుత్రయము చాలును. నిఘంటు రచనా విషయమున ఆ నాళ్లలో తమిళములకు తమిళులుకూడ చేయని మహోపకారమును వీరమాముని చేసెనని నుడువ దగును.

లక్షణగ్రంథములు:

తమిళమునందలి ప్రశస్తమగు ప్రసిద్ధ లక్షణ గ్రంథములైన తొల్కాప్పియం, నన్నూల్ మున్నగువానిని వీరమాముని లెస్సగ అభ్యసించెను. అటుపిమ్మట తొన్నూల్ విళక్కమను సమగ్రమగు వ్యాకరణము రచియించెను. సంజ్ఞా, శబ్ద, గుణ, ఛందోలంకార ప్రకరణము లిందు గలవు. తొల్కాప్పియ మునగాని నన్నూలునందు గాని చెప్పబడని పలు వ్యాకర ణాంశము లీ తొన్నూల్ విళక్కంలో వివరింపబడినవి. ఇదియే దీనియందలి విశిష్టత. ముఖ్యముగా గుణ ప్రకరణము

గమనింపదగినది. సాహిత్య శాస్త్రమునకు సంబంధించిన విషయము లిం దుదాహృతము లయ్యెను. వ్యాసము, కవిత, కథ, నవల, నాటకము, ఉపన్యాసము మున్నగు సాహిత్య ప్రక్రియలకు లక్షణములు నిబంధింపబడెను. ఈ గుణ ప్రకరణమును పరిశీలించునప్పుడు వీరమామని సాహిత్య పరిజ్ఞానము, దూరదృష్టి మున్నగునవి స్పష్టము లగును.

ఇవికాక, వీరమామని తమిళ లక్షణ శాస్త్రమును వివరించుచు లాటిన్‌లో కూడ మూడు గ్రంథములు వ్రాసెను. ఇవి ప్రాచీన తమిళ వ్యాకరణము, వ్యావహారిక తమిళ వ్యాకరణము, క్లావిస్ అనునవి.

భాష ప్రగతి శీలాత్మక మగుటచే, కావ్య భాషకును వ్యావహారిక భాషకును నడుమ కొన్ని భేదము లేర్పడుట సైజము. దీనిని గుర్తించి వీరమామని తమిళ కావ్య భాషకును, సజీవ భాషకును విడి విడిగా లక్షణ గ్రంథములు రచియించెను. ఇవి లాటినులో ఉండుటచే, తద్భాషాభిజ్ఞుల ఉపయోగార్థమై వీనిని వీరమామని సంతరించెననుట స్పష్టము. ఛందశ్శాస్త్రమును వివరించునదే క్లావిస్.

కావ్యములు:

శిలప్పదికారము, మణిమేకలై, జీవకచింతామణి, కంబరామాయణము మొదలగునవి తమిళ మహా కావ్యములలో చాల ప్రసిద్ధములు. ఏ భాషయందైనను ప్రాచీన సాహిత్యము—ముఖ్యముగా కావ్యశాఖ—మతము నంటిపట్టుకొనియే వర్ధిల్లె ననుట సుస్పష్టము. అటులనే తమిళమునందును జైన బౌద్ధ శైవ వైష్ణవ మత పరములుగా ప్రాచీన కావ్యములు

సంతరింపబడెను. తమిళ వాఙ్మయమునందలి తోతుపాతులను తెలిసికొనిన వీరమామునికి ఈ విషయము తెలియక పోలేదు. క్రైస్తవమత పరముగా తమిళమున ఒక మహాకావ్యమును సంతరించవలెనని అత డభిలషించెను. తత్ఫలమే తేంబావణి అను మహా కావ్యము.

తేంబావణి అనగా వాడనిమాల అని అర్థము. ఏసు క్రీస్తును పెంచి పెద్దచేసిన జోసెఫ్‌కథ యిందలి యితివృత్తము. ఇది 36 ఆశ్వాసముల కావ్యము. ఇందు 3615 వృత్తములు గలవు. జీవక చింతామణిని, కంబరామాయణమును దృష్టిలో నుంచుకొని వీరమామును, యీ కావ్యమును తీర్చిదిద్దినట్లు పండితులు చెప్పుదురు. ఈ మహాకావ్యమునే కాక అతడు తిరుకావలూర్ కలంబగమ్, కిత్తేరియమ్మాళ్ అమ్మానై అను లఘు రచనలు కూడ చేసెను.

తమిళ వాఙ్మయమున నాడును నేడును కూడ ప్రసిద్ధిచెందిన నీత్యుద్బోధక గ్రంథము తిరుక్కు-అళ్. ఈ గ్రంథమునందలి వైశిష్ట్యమును తొలిసారిగా పాశ్చాత్య విద్వత్ప్రపంచమునకు తెలియజేసిన ఖ్యాతియు వీరమామునికే చెందుచున్నది. తిరుక్కు-అళులోని ధర్మ, అర్థ ఖండములను వీరమామును లాటిన్ భాషలోని కనువదించెను. ఈ అనువాదము కుఅళును తమ తమ భాషలలోనికి అనువదించుకొనిన ఐరోపీయ విద్వాంసులకు చాల సహాయపడెను.

తన విద్వత్తును, తన జీవితమును తమిళ భాషా సాహిత్యము లకు మీదుగట్టిన వీరమామును 1757 వ సంవత్సరమున అంబల కాడులోని క్రైస్తవ మఠమున నిర్యాణము చెందెను. డాక్టర్

ఆర్. పి. సేతుపిళ్లై పేరొక్కనినట్లు 'ఆయన తమిళ ఋషులలో ఒకడుగా పరిగణింపబడుచున్నాడు.' నిజమునకు వీరమాముని ఋషితుల్యుడు!

బెంజమిన్ షూల్జి

మన దేశమున క్రైస్తవమతమును ప్రచారము చేయు నభిలాషతో తన్మత ప్రచారకులు భారతీయ భాషాధ్యయనము చేసిరని పండితుల అభిప్రాయము. మత ప్రచారము విజయ వంతము కావలెనన్నచో, దేశ భాషలలోనే ప్రచారము చేయవలెనని తలచి దూరదృష్టిగల ఫాదిరీలు కొందరు మన దేశ భాషలు నేర్వసాగిరి. అప్పటిలో వారి దృష్టి కేవలము భాషాధ్యయనమునందే లగ్నమైయుండెను. కాని కాలక్రమ మున వారిలో కొందరి దృష్టి వివిధ భాషా సాహిత్యముల మీదికి కూడ ప్రసరించెను. తత్ఫలితముగా తెలుగు, తమిళము మొదలగు భారతీయ భాషలలో వచన రచనలు, అకారద్యక్షర క్రమముగ కూర్పబడిన నిఘంటువులు, వ్యాకరణ గ్రంథములు, భాషాతత్త్వమును వివరించు రచనలు పెక్కులు వెలుగులోనికి వచ్చెను. దేశ భాషలందు క్రైస్తవ మత వాఙ్మయము కూడ వెలసెను. మొత్తముమీద, ఇతర భాషలవలె తెలుగు భాషా వాఙ్మయములు కూడ ఫాదిరీల కృషివలన సుసంపన్నము లయ్యే ననుట స్పష్టము.

భాషా సాహిత్యము లందేకాక ముద్రణ కళయందును ఫాదిరీలు అపూర్వమగు కృషి సలిపిరి. మన దేశమున ముద్రణ

యంత్రముల స్థాపనమునకును, పుస్తక ప్రచురణమునకును వారే కారకులు. క్రైస్తవ మత గ్రంథములను ముద్రించు నుద్దేశముతోనే వారు ముద్రాక్షరశాలలు నెలకొల్పి రనుట నిర్వివాదము.

1746 వ సంవత్సరమున కలకత్తాకు సమీపమున నున్న శ్రీరాంపురమునకు ఏతెంచిన డా॥ కేరీ, డా॥ మార్షమన్, వార్డు మున్నగు మత ప్రచారకులు ఆ ఊరిలో ఒక మిషనును స్థాపించిరి. వ్యయ ప్రయాసల కోర్చి వారు సంస్కృతము, తెలుగు, బెంగాలీ మొదలగు భాషలలో ముద్రణాక్షరములు పోత పోయించిరి; ముద్రణాలయములు నెలకొల్పిరి.

తెలుగున క్రైస్తవ మత వాఙ్మయ మన్నను, పుస్తక ప్రచురణ మన్నను రెవరెండు బెంజమిన్ షూల్జి పేరు తొలుదొలుత స్ఫురణకు వచ్చును. అతడు డేనిష్ మిషనరీకి చెందిన ఫాదిరీ. 1719 వ సంవత్సరమున అతడు మన దేశమునకు వచ్చెను.

బెంజమిన్ షూల్జి బహు భాషావేత్త. ఆనాళ్లలో అతని నలె తెలుగు భాషయందు ఆదరాభిమానములు ప్రదర్శించిన ఫాదిరీ మరియొకడు లే డనుట అత్యుక్తి కాదు. తెలుగున అతడు కావించిన పరిశ్రమము కొండాడదగినదే! షూల్జి తెలుగులో ఈ క్రింది రచనలు చేసెనని తెలియుచున్నది.

1. సత్యమైన వేదంలోవుండే జ్ఞాన వుపదేశాలయొక్క సంక్షేపం (1746).

2. మోక్షానికి కొంచ్చుపాయ్యె దోన (1746).

3. బుద్ధి కలిగిన నూరు జ్ఞాన నచనాలయొక్క చిన్న పుస్తకం (1747).

4. ఒక గురువు ఐదు బ్రాహ్మలయొక్క... పెద్దస్వామి మీద ప్రసంగించిన తర్కమిదె (1747).

5. దేవునియొక్క నమస్తమైన వాక్యము సువిశేషము... మమ్మును రక్షించ్చె కర్త అయిన యేసుక్రీస్తుయొక్క శుభ నమాచారము.

ఇవి 1746-1747 సంవత్సరముల మధ్య ముద్రితము లయ్యేను. షూల్జి వీనిని జర్మనీలోని హాలీ పట్టణమున అచ్చొత్తించెనట!

పై పుస్తకములనే కాక, బెంజమిన్ షూల్జి బైబిలును కూడ తెలిగించెనని విదిత మగుచున్నది. బైబిలు ఆంధ్రాను వాదకులలో అతడు ప్రముఖుడు. కాని శోచనీయము! షూల్జి చేసిన తెలుగు నేత వెలుగు చూడకయే నశించెను.

తెలుగున బైబిలు వెలసి నేటికి నూరేండ్లు నిండినవి. అది క్రైస్తవ మత సిద్ధాంతములను వివరించు గ్రంథమే యైనను, దానికి ఆంగ్ల సారస్వతమున సాహిత్య గౌరవము కూడ గలదు. బైబిలు గ్రంథానువాదము తెలుగున షూల్జి రాకకు పూర్వమే- అనగా 1719-వ సంవత్సరమునకు మునుపే - ప్రారంభ మయ్యేను.

బైబిలును తెలుగుచేయ నభిలషించిన వారిలో ఆద్యుడు బర్తలోమ్యూ జీగెన్ బాగ్ అను ఫాదిరీ. అతడు కూడ డేనిష్ ఫాదిరీయే. ఈ తెలుగుసేత తమిళ నాడులోని తరంగంబాడి (ట్రాంకుబార్) అను చోట ప్రారంభ మయ్యేను. ఆ నాళ్లలో తరంగంబాడి డేనుల అధీనమున నుండెను.

జీగెన్‌బాగ్ 1705 లో తరంగంబాడి చేరెను. క్రైస్తవ మతము బహుళ వ్యాప్తి నందవలెనన్నచో, బైబిలు భారతీయ భాషలలోనికి పరివర్తింపబడవలె నని అతడు తలచెను. కాగా, అతడు 1712 లో, క్రొత్త నిబంధనను తెలుగు చేయ మొదలిడెను. కాని అనువాదము ముగియకమునుపే అతడు 1719 లో మరణించెను.

అటుపిమ్మట బెంజమిన్ షూల్జి తరంగంబాడికి ఫాదిరీగా నియుక్తుడై వచ్చెను. అతని మతాభిమానము, కార్య దీక్షయు ప్రశంసార్హములు! 'దైవస్తుతి'ని (Lord's Prayer) ఎనిమిది భాషలలోనికి అనువదింపజేసి ఆ అనువాదములను తాటియాకులపై వ్రాయించి వానిని ప్రజలకందజేసెను. అంతటితో నిలువలేదు షూల్జి! జీగెన్‌బాగ్ అనువదింప బూనుకొనిన క్రొత్త నిబంధనను పూర్తిచేసెను. పిమ్మట ప్రాత నిబంధనను కూడ తెలుగు చేసెను. అటు పిమ్మట ఆ వ్రాత ప్రతిని 1732-వ సంవత్సరమున పరిశీలనార్థము హాలీ విశ్వవిద్యాలయమునకు పంపించెను. కాని అది హాలీనుండి షూల్జి చేతికి తిరిగి రాలేదు. ఆ వ్రాత ప్రతిని విశ్వవిద్యాలయము వా రెచ్చట ఉంచిరో, నేటిదాక ఆ విషయ మెవరికిని తెలియ రాలేదు. కాని సి. పి. బ్రౌన్, షూల్జి కావించిన బైబిలు తెలుగు సేతను గురించి ముచ్చటించుచు, అది హాలీలోని ఆర్ఫన్ హౌస్ గ్రంథాలయమున ఉండి యుండవచ్చునని తలచెను. దానిని మదరాసులోని బైబిలు సొసైటివారికి ఒప్పగించుట మంచి దనియు బ్రౌన్ నుడివెను. ఏమయిన నేమి, షూల్జి చేసిన బైబిలు ఆంధ్రానువాదము వెలుగులోనికి రాలేదు.

షూల్జి 1728 లో తెలుగు భాష కొక వ్యాకరణము వ్రాసె ననియు, దాని పేరు 'వరూగియన్ గ్రామర్' అనియు తెలియు చున్నది. తెలుగు అక్షరామ్నాయమును గురించి కూడ అత డొక వ్యాసము వ్రాసినట్లు తెలియుచున్నది. వీనిని పురస్క రించుకొని చూడగా ఆనాళ్లలో బెంజమిన్ షూల్జివలె తెలుగు భాషలో పరిశ్రమించిన తెల్లవారొరు మరియొకరు లే రని స్పష్ట మగుచున్నది.

ఎల్లిస్

డాక్టరు కేరీ తన సంస్కృత వ్యాకరణమునకు పీఠిక వ్రాయుచు భారతీయ భాషలనుగురించి యిట్లు పేర్కొనెను: 'హిందూస్తానీ, తమిళము, గుజరాతీ, మలయాళము మున్నగు నవి సంస్కృతభాషాజన్యము లనుట స్పష్టము. కాని హిందూ స్తానీ, తమిళములందు అన్యభాషాశబ్దము లనేకములు కానవచ్చు చున్నవి. బెంగాలీ, ఒరియా, మహారాష్ట్రము, కన్నడము, తెలుగు మొదలగు భాషలలోని శబ్దములలో ముక్కాలు ముప్పీసము సంస్కృత భాషాశబ్దములే.' డాక్టరు కేరీ ఒక తెలుగు వ్యాకరణమును కూడ ప్రకటించెను. అందలి పీఠికలో 'భారతీయ భాషలన్నియు సంస్కృత భాషాజన్యములే' అని తన అభిప్రాయమును పునరుద్ఘాటించెను. ఏతావతా, భారతీయ భాషలకును సంస్కృతమునకును జన్యజనక సంబంధమున్నట్లు అతడు విశ్వసించెను.

ఆనాటి పాశ్చాత్య పండితులలో పలువురీ అభిప్రాయమునే సమర్థించినట్లు తెలియవచ్చుచున్నది. డాక్టరు విల్కిన్స్ అను మరియొక పండితుడు సంస్కృత వ్యాకరణ మొకటి వ్రాసెను. అందులో ఆయన 'మహారాష్ట్ర గుజరాతీ భాషలలోవలె, తమిళము తెలుగు కన్నడము మలయాళము మొదలగు భాషలందును సంస్కృత శబ్దములు కోకొల్లలు. తెలుగునగాని తమిళమునగాని సంస్కృతభాషా సాహాయ్యము నపేక్షింపక ఒక్క వాక్యమైనను వ్రాయుటకు వీలుపడదు' అనెను.

సంస్కృత ప్రాకృతములనుగూర్చి అమూల్యమగు వ్యాస మొకటి వ్రాసిన కోల్‌బ్రూక్ అనునతడు కూడ దాక్షిణాత్య భాషలు ప్రాకృత భాషలకు చెందినవై యుండనోపునని అభిప్రాయపడెను. కనుక భాషా తత్త్వశాస్త్రమున పరిశ్రమించిన ఆనాటి పాశ్చాత్య పండితు లెల్లరును సంస్కృతమునకును దక్షిణదేశ భాషలకును సన్నిహిత సంబంధము గలదని విశ్వసించి రనుట నిశ్చయము.

ఏకాలమందైనను, సమకాలికుల అభిప్రాయములను త్రోసిరాజని ఒక క్రొత్త సిద్ధాంతమును స్థాపింపదలచుట ప్రయాసతో కూడిన పని. ఇందులకు సాహసముతోపాటు ప్రత్యర్థులను సమ్మతింపజేయు పాండిత్యము కూడ ఉండవలెను. అప్పుడుగాని ఆ నూతన సిద్ధాంతము ప్రచారములోనికి రాజాలదు.

ద్రావిడభాషా తత్త్వశాస్త్ర విషయమై తన సమకాలికులతో ఏకీభవింపక ఒక నూతన సిద్ధాంతమును స్థాపించిన యశస్సు ఆ నాళ్లలో ఒక్క ఎల్లిస్ దొరకు చెందుచున్నది. ద్రావిడ

భాషాతత్త్వ శాస్త్రమనగానే డాక్టరు కాల్డ్‌వెల్ పేరు స్మరణకు వచ్చుట పరిపాటి. నిజమునకు ఆయన రచించిన ద్రావిడ భాషల తులనాత్మకపరిశీలన గ్రంథము భాషాతత్త్వ శాస్త్రము నధ్యయనము కావించువారికి బహుధా తోడ్పడు గ్రంథము. కొందరు కాల్డ్‌వెల్‌ను భాషాతత్త్వశాస్త్ర పితామహునిగా అభి వర్ణింతురు. కాని యీ విశేషగౌరవము ఎల్లిస్ దొరకు సంక్రమింపవలె ననుట సమంజసము.

'తమిళముగాని, తెలుగుగాని, వాని తోబుట్టు భాషలుగాని సంస్కృతభాషాజన్యములు కావు. కాని వీనికి మెరుగులు పెట్టుటకు సంస్కృతము తోడ్పడగలదు. అంతమాత్రమున ఈ భాషల మనుగడకు సంస్కృత మావశ్యక మనరాదు. తమిళము, తెలుగు మొదలగునవి ఒక ప్రత్యేక భాషాకుటుంబ మునకు చెందినవి. తరువాత్రి కాలమునసే సంస్కృతభాషా శబ్దములు వీనిలో ప్రవేశించి కలసిమెలసిపోయినవి. అంతే కాని సంస్కృతమునకును, వీనికిని దగ్గరిచుట్టరికము లేదు.' అని 1818 సం॥ నకు పూర్వము ఎల్లిస్ పేర్కొనెను. ఇట్లు పేర్కొనినవారిలో అతడే ఆద్యుడు. అతడు మరణించు నాటికి కాల్డ్‌వెల్ ఐదేండ్ల బాలుడు. కాగా ద్రావిడభాషా తత్త్వశాస్త్రమున, కాల్డ్‌వెల్ కావించిన మహత్తరమగు కృషికి ఎల్లిస్ సిద్ధాంతము ప్రాతిపదిక అనుట సముచితము.

ఎల్లిస్ సిద్ధాంతముతో ఏకీభవింపనివారు కొందరుండ వచ్చును. కాని అతడు పేర్కొనినట్లు తెలుగు ద్రావిడ కుటుంబమునకు చెందిన భాష; కాని కాలక్రమమున సంస్కృ తమునుండి జిగిని బిగిని సంతరించుకొని పరిపుష్టము చెందెను. సమస్త భాషలకును సంస్కృతమే జనని అని విశ్వసింపబడు

చున్న ఆనాళ్లలో దక్షిణదేశ భాష లొక ప్రత్యేక కుటుంబ మునకు చెందినవను విషయమును పండిత లోకమునకు తొలి సారిగా తెలియజేసిన ఎల్లిస్ సంస్మరణీయుడు. అతని పూర్తి పేరు ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్.

1796 లో సివిల్ ఉద్యోగిగా ఎల్లిస్ మనదేశమున కేతెంచెను. తదాదిగా అతడు సంస్కృతాది భారతీయ భాషాధ్యయన మునకును, ప్రాచీన భారతదేశ చరిత్ర పరిశీలన మునకును తన జీవితకాలమును వినియోగించెను. తెలుగు, తమిళము, మలయాళము మొదలగువానిని నేర్చుటయేకాక అతడు ఆయా భాషాలనుగురించి ప్రశస్తములగు వ్యాసములు కూడ సంతరించెను. తద్రచనము లాతని బహుముఖ ప్రతి భను వ్యక్తము చేయుచున్నవి.

1816 లో వెలుగులోనికి వచ్చిన ఎ. డి. కాంబెల్ తెలుగు వ్యాకరణములో ఎల్లిస్ తెలుగు భాషనుగురించి వ్రాసిన వ్యాసము తొలుదొలుత ప్రకటింపబడెను. అందది 31 పుట లాక్రమించెను. ధాతుమూలకు తాను వ్రాసిన వివరణము నందు బ్రౌను దొర, యీ ప్రశస్తరచనమును గురించి ప్రస్తావించి యుండుట గమనింపదగు నంశము. శ్రీ నిడుదవోలు వేంకట రావుగా రీ వ్యాసమును మదరాసు విశ్వవిద్యాలయమువారి ప్రాచ్యభాషా పరిశోధన పత్రికలో ప్రకటించిరి.[1]

సంస్కృతాద్యార్యభాషలనుండి దక్షిణదేశ భాష లెట్లు భిన్నము లగుచున్నవో, ఆ విషయమును ఉదాహరణ పూర్వక

---

[1] చూడుడు: Annals of Oriental Research of the University of Madras, Volume XII, 1954-1955.

ముగా ఎల్లిస్ పై వ్యాసమున వివరించెను. తెలుగు ధాతువుల స్వభావమును కూడ వివరించెను. పట్టాభిరామశాస్త్రిగారు సంకలనము చేసిన తెలుగు ధాతుమూలనుండి కొన్ని ధాతువులను గ్రహించి, వానిని సంస్కృతధాతువులతో సరిపోల్చి సంస్కృతాంధ్ర ధాతువులు విభిన్నము లని విపులముగ వివరించెను. అంతేకాక వాక్యనిర్మాణము కూడ సంస్కృతము నందలి సంప్రదాయమునకును దక్షిణదేశ భాషలందలి వాక్య రచనా విధానమునకును పోలికలు లేవని నిరూపించెను. ఎల్లిస్ వ్యాసమునం దుదాహృతములయిన కొన్ని తెలుగు వాక్యముల నిట నుదాహరించుచున్నాను.

'కుమారులు స్వేచ్ఛగా నిద్రించుచున్నారు. నరకములో నుండే వారున్నూ మిక్కిలి యఱచుచున్నారు. గాయకులు మిక్కిలి పాడుచున్నారు. రోగముచేత కొట్టబట్టవారున్నూ బొగా చచ్చుచున్నారు.'

'వానికి బహు ధనము ఉన్నది.'

'ఎవని గురించి గొల్ల ఆడవారి గుంపు తమకము పెళ్లి, లేనితప్పులు ఎంచెనో, అలిగెనో, ఓర్చుకపోయెనో, ఇంపాయెనో, చేదోర్చెనో, కాచియుండెనో, బొంకెనో, పొగడెనో, కోరెనో, తిట్టెనో, ఆ హరి పెద్దలకు హాయి నిచ్చుగాక!'

తమిళ భాషను గురించి కూడ ఎల్లిస్ ఒక వ్యాసము వ్రాసెను. నే డిది అలభ్యము. కాని తమిళ ఛందస్సును గూర్చి అతడు వ్రాసిన వ్యాసము మాత్రము లభించినది. ఇది వ్రాతలో నూరుపుటల రచన. మలయాళ భాషను గూర్చి అతడు రచించిన వ్యాసము ఇండియన్ ఆంటిక్వరీ

యేడవ సంపుటములో ముద్రితము. కన్నడ భాషనుగురించి కూడ ఎల్లిస్ వ్రాసెనేమో, తెలియరాలేదు. ఈ వ్యాసము లన్నియు ద్రావిడభాషా తత్త్వశాస్త్రము నభ్యసించువారికి శిరోధార్యము లనదగును.

పై వ్యాసములనే కాక భూస్వామ్యమును గురించి ఎల్లిస్ అమూల్యమగు రచన ఒకటి చేసెను. అందలి ప్రశస్త్యము గుర్తించి అప్పటి మదరాసు ప్రభుత్వమువారు దానిని 1818 లో ప్రకటించిరి. అది ప్రామాణిక రచనముగా పరిగణింపబడుచున్నది.

తమిళ వేదమని ప్రస్తుతింపబడు తిరుక్కు-ఱళ్ను ఆంగ్లము లోని కనువదింపదలచిన తొలి యైరోపీయుడు ఎల్లిస్ దొరయే. తొలుత పద్యానువాదమును పిమ్మట పరిమేళగర్ అను ప్రాచీన పండితుడు రచించిన వ్యాఖ్యానమును, అటుపిమ్మట సంగకాలపు తమిళ కావ్యములనుండియు మరి యితర ప్రాచీన కావ్యముల నుండియు ఉదాహరణముల నొసగుచు ఎల్లిస్ తిరుక్కు-ఱళ్ను ఆంగ్లము చేసెను. కుఱళ్లునందలి ధర్మఖండములోని తొలి పదునెనిమిది అధ్యాయములను మాత్రమే అతడిటుల అనువదింపగలిగెను. వానిలో పదుమూడు అధ్యాయములను ఒక గ్రంథముగ మదరాసు విశ్వవిద్యాలయమువారు ప్రకటించిరి. అటనట కొన్ని శబ్దములకు ఎల్లిస్ ఒసగిన వివరణయు, అతడు చేసిన సూచనలును ప్రశంసార్హములు. అతని తమిళ పాండిత్యమున కీ అనువాదము నికషోపల మనదగును.

తమిళములో ఎల్లిస్ కవిత్వము చెప్పె ననియు విదితమగుచున్నది. 'నమశ్శివాయ' అను మకుటముతో అతడు రచిం

చిన పద్యములు లభించినవి. ఒక పద్యమునందలి భావమును పరికింపుడు.

'సర్వశక్తి సంపన్నుడ వీవు! సర్వలోకాధిపతి వీవు! ఆనందము రూపుగట్టిన పరబ్రహ్మమవునీవు! భువి నేలెడి యీ రాజులు తమ ప్రజలనుండి బలిమిమై కప్పము గొనుచున్నారు. మరి నీవో! రాజాధిరాజవు! అయినను కప్పమడుగవు. అందువలన మాటలతోకాక, నా హృదయమునందు ప్రభవించి పొంగి పొరలుచున్న భక్తిని నీ పవిత్ర చరణసన్నిధిని కానుకగా సమర్పించుచున్నాడను.'

సాహిత్యరంగమున ఎల్లిస్ కావించిన కృషి అనల్పము. అత డనేక రచనలు చేసియుండనోపును. కాని అవి వెలుగు లోనికి రాలేదు. దురదృష్టవశమున ఎల్లిస్ రచన లన్నియు అగ్ని హోత్రుని పాలయ్యెను. నెలల తరబడిగా నిప్పు చేయుటకును, కోళ్లు మొదలగువానిని కమర్చుటకును తుద కా కాగితము లుపయోగపడెను! తమిళ వాఙ్మయమును పెంచి పెద్దచేసిన మధురానగరమునం దీ విషాదసంఘటన జరుగుట అత్యంత శోచనీయము! కాని యీ ఘటనద్వారా అతని రచనావ్యాసంగ మెట్టిదో లోకమునకు తెలియవచ్చెను.

ఇక దిజ్మాత్రముగ ఎల్లిస్ జీవిత విశేషాదికమును పరిశీలింతము.

ఎల్లిస్ 1780 వ సంవత్సర ప్రాంతమున జన్మించెను. మన దేశమునకు వచ్చునప్పటి కాతడు పదునారేండ్ల యువకుడు. 1806 లో అతడు మచిలీపట్నం జిల్లా జడ్జిగా నియమితు డయ్యెను. అటుపిమ్మట—అనగా—1809 లో మదరాసు రాజ

ధాని లాండ్‌కస్టమ్స్ కలెక్టరుగా నియమింపబడెను. 1810 లో మదరాసు కలెక్టరు పదవి నలంకరించెను. నాటినుండియు అతడు రమారమి ఇరువదేండ్లు సంస్కృతాదిభాషాధ్యయనము చేసెను. ఒకవైపు ఔద్యోగిక ధర్మములను నిర్వర్తించుచు మరొకవైపు విద్యారంగమున కూడ ప్రముఖపాత్ర వహించెను. 1816 లో అతడు మదరాసునందలి ఫోర్టు సెయింటు జార్జి కళాశాల పర్యవేక్షణమండలి అధ్యక్షుడుగా నియమితుడయ్యెను. ఈ మండలి 1812 లో ఏర్పడెను. మదరాసు రాష్ట్రమునందలి ప్రధాన భాషలలో సివిల్ ఉద్యోగులకు తర్ఫీదు ఇచ్చుట, న్యాయస్థానములందు నియమింపబడు అధికారులకు (మున్సిలు) శిక్షణ ఇచ్చుట—మొదలగునవి ఈ మండలి నిర్వహింపవలసిన కార్యములు. దీనిని స్థాపించుటకు కృషిచేసిన వారిలో ఎల్లిస్ స్మరణీయుడని విదితమగుచున్నది.

ఎల్లిస్ కృషిని కొనియాడుచు ఒక సహృదయుడిట్లు పేర్కొనెను: 'చులకనగా చూడబడుచున్న సంస్కృతము, తెలుగు, మలయాళము మున్నగు నీ దేశభాషల నభ్యసించెను. తమిళ లక్ష్యలక్షణ శాస్త్రముల నభ్యసించెను. మదరాసులో విద్యాసంఘమును స్థాపించుటకు కృషిచేసి, ఆ సంఘమును నెలకొల్పి, దానిని పాండ్యనివలె ఎల్లిస్ సంరక్షించెను.'

ఏ విషయమునైనను ఎల్లిస్ క్షుణ్ణముగా తెలిసికొనుచుండెడివాడు. దక్షిణదేశ భాషలను గురించి అతడనేక విషయములు సేకరించెను. వానిని గ్రంథరూపమున ముద్రించుటకు మునుపు తనకుగల సంశయములను తీర్చుకొన నభిలషించి మధురా నగరమునకు పయనమై వెడలెను.

మధుర జిల్లా కలెక్టరగు ఆర్. పీటరు నివాసమున ఎల్లిస్ బసచేసెను. ఒకనా డతడు రామనాథ పురమునకు పోయెను. అట పొరపాటున ఎల్లిస్ విషము మ్రింగి దుర్మరణము చెందెను. ఈ విషాద సంఘటన 1819 వ సంవత్సరము, మార్చి పదియవ తేదీని సంభవించెను.

బహుభాషాభిజ్ఞుడుగా, భాషాతత్త్వశాస్త్రవేత్తగా ఎల్లిస్ చిరస్మరణీయుడు. తెలుగు భాషాతత్త్వమును ప్రథమముగా పాశ్చాత్య పండితలోకమునకు పరిచయము కావించిన ఎల్లిస్ చిరస్మరణీయు డనుట చర్వితచర్వణమే కాగలదు!

జె. సి. మారిస్

భాషాధ్యయనమునకు శబ్దశాస్త్రమగు వ్యాకరణ మెంత అవసరమో, పద పదార్థములను తెలియజేయు నిఘంటువు కూడ అంత అవసరము. ఔద్యోగికముగా నైన నేమి, క్రైస్తవమత ప్రచారోద్దేశముతో నైననేమి మన దేశమునకు వచ్చి మన దేశభాషల నభ్యసించిన పాశ్చాత్యులలో పలువు రీ సత్యమును గుర్తించిన వా రగుటచే, ఆయాభాషలలో వారు లక్షణగ్రంథములను, నిఘంటువులను సంతరింపజొచ్చిరి. కాని వీనిలో కొన్ని ప్రామాణికములు కావు. అయినను, వారి ప్రయత్నము మాత్రము కొనియాడదగినది. వా రొనర్చిన కృషియు కొనియాడ దగినదే!

నిఘంటువులు మనకు కొత్తవి కావు. తెలుగులోవలె, తమిళమునందును, ప్రాచీనులు వెలయించిన నిఘంటువులు

పద్యరూపమునన్నే ఉన్నవి. ఇతర భాషలలోను ప్రాచీన నిఘంటువులు పద్యాత్మకము లనియే తెలియుచున్నది. కనుక అకారాద్యక్షర క్రమమున నిఘంటువును కూర్చుటకు మనకు మార్గదర్శకు లీ పాశ్చాత్యపండితులే అనుట అసంమంజసము కాదు. అంతేకాక, మన ప్రాచీనులు చిన్నచూపు చూచిన వాడుక భాషకు నిఘంటువులలో పెద్ద పీటవేసినవారు కూడ, ఈ పాశ్చాత్య పండితులే అనియు నుడువదగును. నిజమునకు జీవద్భాషయగు వ్యావహారిక భాషనే వీరు మిక్కిలి ఆదరించిరి.

కవిత, వచనము మొదలగు సాహిత్య ప్రక్రియలందును పాశ్చాత్యులు రచనలు వెలయించిరి. కాని అవి యన్నియు ప్రచుర ప్రచారము నందుకొనలేదు. అయినను తమిళము నందు మాత్రము వీరమామును వంటి పండిత ప్రకాండులు కొందరు చేసిన రచనలు తమిళుల ఆదరాభిమానములను చూరగొనినవి. ఈ కారణమున తమిళనాడున క్రైస్తవ మత మునకు సంబంధించిన సారస్వతము బహుళ వ్యాప్తికి వచ్చెను. డాక్టర్ విన్స్లో తన ఆంగ్ల-తమిళ నిఘంటువునకు (1862) వ్రాసికొనిన ఉపోద్ఘాతమునందలి యీ క్రిందివాక్యములను పరిశీలించిన, ఈ విషయము సుస్పష్టము కాగలదు.

'....In one respect the Tamil has an advantage over the other vernaculars of India. It has a greater amount of christian literature. As the number of Native christians speaking Tamil is two or three times greater than of those speaking any other vernaculars . . . .'

తమిళనాడున క్రైస్తవ వాఙ్మయమునకు ప్రచారము లభించిన కారణమున, పాశ్చాత్యపండితులు ప్రవేశపెట్టిన ఒక నూతన రచనావిధానముకూడ తమిళమున చోటు చేసికొనెను. ఈ

రచనావిధానమున ఇంగ్లీషు పలుకుబడి యెక్కువగా కాన వచ్చుచున్నదనుట సత్యదూరము గాదు. ఈ విషయమై సి. పి. బ్రౌనుదొర యిట్లు నుడివెను:

'In Tamil and Telugu, as well as in Greek and Latin, christianity will gradually produce a some what new dialect; in Tamil it is already perceptible . . .'

ఆ నాళ్లలోనే పాశ్చాత్యులు ప్రవేశపెట్టిన ఆ రచనా విధానమునకు తమిళమున స్థానము లభించినను, తరువాతి కాలమున ఆ విధాన మంతగా అభివృద్ధి చెందలేదనియే చెప్ప వలసియున్నది. తమిళభాషా విషయమే యిట్లుండగా, పాశ్చాత్యులు వెలయించిన తెలుగు రచనలను గురించి నుడువ నవసరము లేదు. వారు సృష్టించిన శైలి విలక్షణమైనదే కాని అందులో తెలుగు పలుకుబడి చాల తక్కువ. ఈ కారణమువలన కొబోలు పాశ్చాత్య పండితులు సంతరించిన తెలుగు రచనలు అంతగా వ్యాప్తిలోనికి రాజాలకపోయెను.

ఇతర సాహిత్య ప్రక్రియల మాట యెట్లున్నను, నిఘంటు రచనా విధానమునందు మాత్రము పాశ్చాత్య విద్వాంసులు కావించిన భాషాపరిశోధనయు, చేసిన కృషియు నిరుపమానములు. తెలుగులో సి. పి. బ్రౌను నిఘంటువులు, తమిళమున విన్స్లో నిఘంటువు, కన్నడమున కిట్టెల్ నిఘంటువు, మలయాళమున గుండర్ట్ నిఘంటువు మున్నగునని ఆయా భాషలకు అమూల్య భూష లనుటలో సందేహము లేదు.

బ్రౌనుకు పూర్వమే పాశ్చాత్యులు కొందరు తెలుగున నిఘంటువులు వెలయించిరి. క్రీ. శ. 1700 ప్రాంతమున పరాసు మిషనరీలు ఒక తెలుగు నిఘంటువును (Dictionaire

Telougu) తయారుచేసినట్లు తెలియుచున్నది. వీరే ఒక తెలుగు వ్యాకరణమును కూడ సంతరించిరట. కాని గ్రంథకర్తృ నామములు మాత్రము తెలియరాలేదు. ఇవి రెండును ప్రామాణికములు కాకపోయినను, నిఘంటువు మాత్రము గుడ్డిలో మెల్ల అనవచ్చును. అటు పిమ్మట విలియం బ్రౌను Vocabulary of Gentoo And English అను నిఘంటువును 1807 వ సంవత్సరమున వెలయించెను. ఇదియే పాశ్చాత్య నిఘంటు పద్ధతిని వెలువడిన తొలి తెలుగు నిఘంటువు. ప్రైనందిన జీవితమున వినవచ్చు పెక్కు మాటలిందు చేర్చ బడెను. వాడుకభాషలోని మాటలను స్వీకరించుటయే కాక, ఉచ్చారణ విషయమునందును విలియం బ్రౌను వ్యావహారిక భాషలోని ఉచ్చారణ పద్ధతినే ఆశ్రయించెను. అందువలన ఈతని నిఘంటువులో ఇ ఈ ఎ ఏ లకు బదులు యి యీ యె యే లును, ఉ ఊ ఒ ఓ లకు బదులు వు వూ వొ వో లును, ఋ వర్ణమునకు బదులు రి యును వాడబడినవి. విలియం బ్రౌను నిఘంటువు సమగ్రము కాకపోయినను, ఆ కాలమున తెలుగు నభ్యసింప నభిలషించిన తెల్లవారి కిది సహాయపడె ననుటలో సందేహము లేదు.

పిమ్మట 1816 లో మామిడి వెంకయ్యగారు ఆంధ్ర దీపికను సమకూర్చిరి. కాని యిది 1848 లో ముద్రణ భాగ్యము నందెను. ఆ నాళ్లలో పాశ్చాత్యపండితులలో సుప్రసిద్ధులై యుండిన కాంబెల్, ఎల్లిస్, బ్రౌను మొదలగు వారందరు వెంకయ్యగారి విద్వత్తును, ఆయన నిఘంటువును బహుధా ప్రశంసించియుండుట ఎంతేని హర్షింపదగు నంశము. అనంతరము ఎ. డి. కాంబెల్ సంతరించిన నిఘంటువు వెలుగులోనికి వచ్చెను.

దీనికి పిమ్మట వ్యాప్తిలోనికి వచ్చిన నిఘంటువే జాన్ కర్నక్ మారిస్ (John Carnac Morris) సంతరించిన ఇంగ్లీషు—తెలుగు నిఘంటువు. ఇది రెండు సంపుటములుగా వెలువడెను. మొదటిది 1835 లోను, రెండవది 1839 లోను వెలువడెను. మొదటి సంపుటము నందలి ముఖపత్ర మిట్లు కలదు:

A

DICTIONARY,

English and Teloogoo

By

J. C. MORRIS, F. R. S.

of the Madras Civil Service

Vol. 1

Madras

Printed At The Asylum Herald Press,

1835

A తో ప్రారంభమై To knuckle (లొంగు) తో ముగిసిన యీ సంపుటమునందు 586 పుటలు గలవు. ఇది ఫోర్టు సెయింటు జార్జి గవర్నరుగా నుండిన రైట్ ఆనరబుల్ యస్. ఆర్. లూషింగ్‌టన్ దొరకు అంకిత మీయబడినది. ద్వితీయ సంపుటమునందు 532 పుటలు గలవు. కాగా ఇది 1,118 పుటల నిఘంటువు.

ఈ నిఘంటువునకు మారిస్ వ్రాసిన మున్నుడినుండి తెలియవచ్చుచున్న కొన్ని ముఖ్యాంశములను మాత్రము ఇట ఉదాహరించుచున్నాను. మదరాసులోని ఫోర్టు సెయింటు జార్జి కాలేజీ బోర్డువారి కోరికను మన్నించి, యీ నిఘంటువు కూర్పబడెను. బోర్టువారి సిఫారసును పురస్కరించుకొని దొరతనమువారే దీనికి సంబంధించిన సర్వస్వామ్యములు కొనిరి. తెలుగు నభ్యసింపదలచిన పాశ్చాత్యుల కొరకేకాక, ఆంగ్లము నభ్యసింప నభిలషించిన భారతీయులకు కూడ తోడ్పడ గల ఇంగ్లీషు తెలుగు నిఘంటు వొకటి చిరకాల వాంఛితమై యుండెను. మారిస్ కావించిన పెక్కండ్ల పరిశ్రమకు ఫలముగ వెలసిన యీ నిఘంటువు ఆ వాంఛను కొంతకు కొంత అయినను తీర్చగలదని భావింపబడెను.

నిత్యజీవితమునకు సంబంధించిన మాట లెన్నో ఇందు చోటు చేసికొనెను. అంతేకాని యూరపులోని చెట్టు చేమలు, ఫలములు, పరికరములు మొదలగువాని పేళ్లు భారతీయులకు నూతనము లగుటచే, అవి యిందు పరిహరింపబడెను. డాక్టర్ జాన్సన్ ఇంగ్లీషు నిఘంటువు ననుసరించి కూర్పబడిన యీ నిఘంటువునందు తొలుత ఇంగ్లీషు మాటలకుగల వివిధములగు అర్థముల నొసగి, పిమ్మట వానికి తెలుగునగల పర్యాయపదము లొసగ బడినవి. ఇట్లొనర్చుటలో నిత్యజీవితములో తరుచుగా వినవచ్చు మాటలకు ప్రాధాన్య మీయబడినది. ఇంగ్లీషు మాటలకు సరియైన తెలుగు మాటలు అలభ్యములగు పట్టుల ఆ యింగ్లీషు మాటల నెటుల అర్థము చేసికొనవలెనో, ఉదాహరణ పూర్వకముగా వివరింపబడినది. ఒకే మాటకుగల అర్థభేదమును సూచించుటకు కూడ ప్రయత్నము చేయబడినది.

వాడుకలో లేకపోయినను కవి ప్రయోగములుగల తెలుగు మాటలను కొన్నిటిని మారిస్ తన నిఘంటువునందలి తొలి పుటలలో చేర్చెను. కాని అనవసరముగా గ్రంథము పెరిగి పోవునను భీతిచే, తరువాత ఈ ప్రయత్నము నాతడు విరమించు కొనెను. కాలేజీలో ప్రధానాంధ్రోపాధ్యాయుడు, (Teloogoo Master, ఆనాళ్లలో తెలుగుమాస్టరనుటయే వాడుక), పండితుడు నగు రావిపాటి గురుమూర్తిశాస్త్రి నిఘంటు రచనా వసరమున మారిస్‌కు మిక్కిలి తోడ్పడెను.

కనుక మారిస్ కూర్చిన యీ నిఘంటువు కేవలము పద పదార్థములను తెలియజేయు నిఘంటువు కాదని పై మాటల నుండి విదితము కాగలదు. నిజమునకు మారిస్ పెక్కుచోట్ల ఉదాహరణము లొసగియున్నాడు. ప్రయోగము లొసగి అర్థభేదమును చక్కగ తెలియజేసెను. వేమన పద్యములను కూడ అటనట ఉదాహరించినాడు. అవసరమని తోచి నప్పుడు హిందువుల ఆచార వ్యవహారములను కూడ వివ రించినాడు. కొన్నిచోట్ల మారిస్ శకటరేఫమును, అరసున్న లను కూడ వాడినాడు. (ఉదా: నెఱవేఱు, వయస్కుఁడు). మారిస్ ఒసగిన కొన్నిప్రయోగములందు మదరాసు తెలుగు మాటలు కానవచ్చుచున్నవి. అతని వాక్యనిర్మాణమునందును మదరాసుతెలుగు పలుకుబడి కనబడుచున్నది. తెలుగు మాటలలోని దంత్య తాలవ్యభేదమును గుర్తించిన మారిస్ పంచప్రాణములు, జంతువు మొదలగువానిని పంచప్రాణ ములు, జంతువు...అని వ్రాసెను. ఇక ఈ విషయాదిక మును ఉదాహరణ పూర్వకముగా పరిశీలింతము.

Desire=కోరిక, అపేక్ష, అభిలాష, అభీష్టము, కాంక్ష, ఆశ, ఇష్టము, వాంఛ.

Childish desires=పిల్లల కోరికలు, కొంతలు.

Crane=కొక్కు, కొంగ, కొక్కరాయి, కొక్కెర, బకము.

(కొక్కు అనుసది తమిళశబ్దము. కొక్కునకు తెలుగు నిఘంటువులలో కానవచ్చు అర్థము పందికొక్కు).

An appointment=ఒప్పాచారము, ఒడంబడిక, ఏర్పాటు, కరారు.

(ఒప్పందము వాడుకలో ఉన్నది. కాని ఒప్పాచారము మాత్రము నేటి వ్యవహారమున లేదు).

Unpaid or Compelled labour=వెట్టి, అమంజి.

(తెలుగు నిఘంటువులంచు అమంజి రూపము కనబడదు. కాని 'అమిజి' ఉన్నది. నేటికిని మదరాసులో తమిళులును, కొందరు తెలుగువారును 'బేవారసుగా' అనుటకు 'అమింజి'ని వాడుచున్నారు. అమంజి, అమింజి—ఈ రెండును తమిళమున సరియైన రూపములే కనుక మన తెలుగు నిఘంటువులందలి అమిజి, అమింజిగా ఉండవలెనని తలచుచున్నాను).

Child—బిడ్డ, పిల్ల, పాప, శిశువు, కడుపు.

'కడుపు' నకు మారిస్ యిచ్చిన యీ క్రింది వివరణ పరిశీలింపదగినది:

This word is used only in such phrases as నీ కడుపుకాల =May your child die; నీ కడుపు చల్లగా ఉండని=May your children live happily.

ఇక కొన్ని వాక్యములు.

Prosperity is not without many fears and distastes = భాగ్యముతో అనేక భయములున్ను, వ్యాకులములున్ను లేకుండా వుండేది లేదు.

It is just to distinguish between an action done from inadvertence, and that which is done from design = తెలియక చేసిన పనిన్ని విచేచించి తెలుసుకోవలసినది న్యాయము.

కొన్నిచోట్ల వాక్యనిర్మాణము సరిగా లేకున్నను ఇంగ్లీషు జాతీయములను ఎటుల తెలుగు చేయవలెనో, తెలుగు మాటలకు సమానార్థకములగు ఇంగ్లీషుమాట లెవ్వియో మున్నగు వానిని తెలిసికొనుటకు పాశ్చాత్యులు సంతరించిన, యీ నిఘంటువులు మనకు విశేషముగ తోడ్పడుచున్న వనుటలో సందేహము లేదు.

ఈ ఒక్క నిఘంటువునే కాక మారిస్ 'Telugu Selections, with translations and Grammatical Analyses . . .' అను పాఠ్యపుస్తకమును కూడ సంతరించెను. ఇది ఆ దినములలో సుప్రసిద్ధమైన పాఠ్యగ్రంథమట! మారిస్ తెలుగులో పరీక్షాధికారిగా కూడ నుండెననియు తెలియుచున్నది. ఇక ఆతని జీవితవిశేషాదికమును పరికింతము.

బొంబాయి సివిలుసర్వీసునకు చెందిన జాన్ మారిస్‌కు రెండవ కుమారుడుగా మారిస్ 1798 వ సంవత్సరము అక్టోబరు 16 వ తేదీని జన్మించెను. జాన్ మారిస్ కొంత కాలము తూర్పు ఇండియా కంపెనీ డైరెక్టరుగా కూడ పని చేసెను.

మారిస్ తొలుత రాయల్ నేవీలో చేరెను. అటుపిమ్మట అతడు హెయిల్‌బరీలోని తూర్పు ఇండియా కంపెనీ వారి కళాశాలలో శిక్షణ పొంది 1818 లో మదరాసు సివిలు సర్వీసులో చేరెను. అతని అన్నదమ్ములు కూడ సివిలుసర్వీసు లోనే ఉద్యోగస్థులుగ నుండిరి. మారిస్ కొంతకాలము మచిలీపట్టణమునందును, కోయంబుత్తూరునందును ఉద్యోగము చేసెను. 1823 లో పక్షవాతమువచ్చి అతనికి కాళ్లు పడి పోయెను. తత్ఫలితముగ అతని బుద్ధికుశలత నిరర్థకమై పోవునేమో అని పలువురు తలచిరట. కాని అదృష్టవశమున అటుల జరుగలేదు. పక్షవాతమునుండి కోలుకొనిన పిమ్మట ఆతని జీవితకాలము మదరాసు సెక్రటేరియేటులోనే గడచెను.

1832 లో మారిస్ ఇండియా ప్రభుత్వమునకు తెలుగు అనువాదకుడుగా నియమితు డయ్యెను. 1839 లో సివిల్ ఆడిటర్ పదవి నలంకరించెను. ఆ రోజులలో అది బాధ్యతా యుతమైన పదవి యట!

ఔద్యోగికముగా మారిస్ చేసిన సత్కార్యములలో ఒకటి, మదరాసు ప్రభుత్వ బ్యాంకుస్థాపనము. అది 1834 వ సంవత్సరమున స్థాపింపబడెను. అతడే దానికి మొదటి కార్య దర్శియు, కోశాధికారియును. ఆ మరు సంవత్సరమున అతడు సూపరింటెండెంటుగా నియమింపబడెను. కాని కాలక్రమ మున ఆ బ్యాంకు కొందరు వ్యక్తుల అధీనములోనికి వచ్చెనట.

విశ్రాంతి లభించినప్పుడెల్ల మారిస్ తెలుగు, హిందూస్తానీ భాషలందు కృషిచేయుచుండెడివాడు. హిందూస్తానీలో కూడ పాండిత్యము గడించినను, తెలుగులోనే అతనికి ఎక్కువ అభి

నివేశము ఉండెనని సువిదిత మగుచున్నది. కనుకనే ఆ నాళ్లలో అతడు తెలుగుపండితుడని పేరుపెంపులు గడించెను. అతడు చాలకాలము 'జర్నల్ ఆఫ్ లిటరేచర్ అండ్ సైన్సు' అను పత్రికకు సంపాదకుడుగ నుండెను. కనుక ఒక్క సాహిత్యమునందే కాక విజ్ఞానశాస్త్రమునందును మారిస్‌కు అభిరుచి ఉండెనని నుడువదగును. ఆనాటి చెన్నపురి సమాజమున అతనికి గౌరవ ప్రపత్తు లధికముగా ఉండెననియు, 1846 లో మదరాసును వీడి స్వదేశమునకు మరలునపుడు మదరాసు ప్రముఖులు ఆయనకు ఒక యోగ్యతా పత్రమును బహూకరించిరనియు తెలియుచున్నది.

లండనులో స్థిరపడినపిమ్మట మారిస్ వాణిజ్య రంగమున పరిశ్రమింపజొచ్చెను. స్టీమర్లు నడుపు నొక కంపెనీని అతడు స్థాపించెను. కాని అది చాలకాలము సాగలేదట. అటు పిమ్మట తూర్పు ఇండియా కంపెనీ డైరెక్టరు పదవికి అతడు ప్రయత్నించె ననియు, కాని విఫలమనోరథు డయ్యె ననియు తెలియుచున్నది. అప్పు సొప్పులను తీర్చి నిమిత్తమై తన ఆస్తిపాస్తులను ఒకరి స్వాధీన మొనర్చి మారిస్ 1858 వ సంవత్సరము ఆగస్టు రెండున మరణించెను. సెయింట్ హెలియర్స్ అనుచోట ఆతని భౌతిక శరీరము ఖననము చేయబడెను.

బ్రౌను, కిట్టెల్, విన్స్లో ప్రభృతులవలె విశేష విఖ్యాతి నార్జింపకున్నను, తెలుగుభాషకు సేవచేసిన తెల్లవారిలో జె. సి. మారిస్ ఒక డనుట అతిశయోక్తి కాదు. ఆతని నిఘంటువు తెలుగు సభ్యసింపదలచిన పాశ్చాత్యులకు మిక్కిలి తోడ్పడెను. అది ఆనాళ్లలో ప్రామాణికమైన నిఘంటువుగా పరిగణింప బడెనని Dictionary of National Biography (Vol. XIII)

నుండి విదిత మగుచున్నది. మొత్తముమీద, పాశ్చాత్యపండిత లోకములో తెలుగుభాషావ్యాప్తికి తోడ్పడిన చిరస్మరణీయుడు జె. సి. మూరిస్!

విలియం కేరీ

'తెలింగ (తెలుగు), కర్నాటిక్ (కన్నడం), తమిళం, మలయాళం, సింగాలీస్ (సింహళం)—ఈ అయిదు భాషలలోను తెలుగు బహుధా పరిణతి చెందిన భాషగా కనబడుచున్నది. ఇది కష్టమయిన భాషయే అయినను, నేర్వదగిన భాషలలో ఒకటి. ఇందు విభక్తి వైవిధ్యము గలదు. ఈ కారణమున ఈ భాషలో సులభముగా, సుందరముగా, ఎక్కువ తక్కువలు లేకుండగను భావప్రకటన చేయుటకు ఎక్కువ అవకాశము గలదు.'

కలకత్తాలోని ఫోర్టు విలియం కాలేజీలో సంస్కృత, వంగ, మహారాష్ట్ర భాషలలో ఆచార్యపదవి నలంకరించిన పండితుడు, బైబిలు అనువాదమును నలుబది భాషలలో ప్రచురించుటకు తోడ్పడిన బహు భాషాభిజ్ఞుడు నగు డాక్టర్ విలియం కేరీ చేసిన తెలుగు భాషా ప్రశంస ఇది. 1814 లో ఆయన ప్రచురించిన తెలుగు వ్యాకరణమునందలి మున్నుడిలో, ఈ ప్రశంస అందాలు దిద్దుకొన్నది. తెలుగుభాషను గురించి ఇంతగా ప్రశంసించిన ప్రముఖ పాశ్చాత్య పండితులలో బహుశః కేరియే ప్రథము డనదగును.

తెలుగు నభ్యసింపవలె ననుతలంపుతో కేరి భారతావనికి రాలేదు. తొలినాళ్లలో మన దేశమునకు వచ్చిన పాశ్చాత్య పండితులవలె, అతడును క్రైస్తవ మతమును ప్రచారము చేయు నభిలాషతోనే మన దేశమునకు వచ్చెను. కాని బహుభాషా నిలయ మగు మనదేశములో మత ప్రచారము చేయుటకు విదేశ భాషయగు ఆంగ్లము అంతగా తోడ్పడ దను సత్యమును గ్రహించి, కేరీ భారతీయ భాషాభ్యసనము చేసెను. సంస్కృత భాషా సారస్వతములను సుధించినగాని భారత దేశమునందలి వివిధ భాషలలోను తగినంత పరిజ్ఞానము గడించుటకు వీలు కాదను సత్యమును కూడ గ్రహించినవా డగుటచే, అతడు తొలుత సంస్కృత భాషాధ్యయనమునకు పూనుకొనెను. కాల క్రమమున, బెంగాలీ, మరాఠీ, తెలుగు మొదలగు పెక్కు భాషలలో పాండిత్యము గడించుటయేకాక, ఆయా భాషలకు సంబంధించిన వ్యాకరణ గ్రంథములు కూడ రచించెను. భారతీయ భాషలనే కాక గ్రీక్, లాటిన్, హీబ్రూ మున్నగు పాశ్చాత్య భాషలను కూడ అతడు అభ్యయన మొనర్చెను. ఆ నాళ్లలో విలియం కేరీ వంటి బహు భాషావేత్త మఱొకరు లే రనుట నిజమునకు దగ్గరగా నుండును.

కేరీ తన తెలుగు వ్యాకరణమునకు వ్రాసిన మున్నుడిలో తెలుగు, తమిళము మున్నగు దాక్షిణాత్య భాషలను గురించి ముచ్చటించుచు ఇట్లనెను: 'The languages of India are principally derived from the Sanscrit. The structure of most of the languages in the middle and north of India, is generally the same, the chief difference in them lies in the termination of the nouns and verbs; and in those deviations from Sanscrit orthography which custom has gradually established in the

countries where they are spoken....' తన సంస్కృత వ్యాకరణమునందు కూడ కేరి పై యభిప్రాయమునే ప్రకటించెను. కనుక, అతని దృష్టిలో భారతీయ భాష లన్నియు సంస్కృత జన్యము లనుట నిస్సంశయము. ఈ అభిప్రాయమును ఒక్క కేరీయే కాదు, ఆ నాటి పాశ్చాత్య పండితులు పలువురు బలపరచియుండుట గమనింపదగు విషయము.

డాక్టర్ విల్కిన్స్, కోల్ బ్రూక్ ప్రభృతులు కూడ భారతీయ భాషలకు సంస్కృతము జనని అనియు, సంస్కృత భాషా సాహాయ్యము లేకుండ ఈ భాషలలో ఒక్క వాక్యమైనను వ్రాయుటకు వీలుపడదనియు పేర్కొనిరి. ఈ సిద్ధాంతములను సహేతుకముగా ఖండించి, తెలుగు, తమిళము మొదలగు దక్షిణ దేశభాషలు సంస్కృత భాషాజన్యములు కావనియు, అవి ఒక ప్రత్యేక భాషా కుటుంబమునకు చెందిన వనియు తొలు దొలుత పేర్కొనినవాడు ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్. ఎల్లిస్ సిద్ధాంతమునకు సమగ్ర స్వరూపము నొసగినవాడు డాక్టర్ కాల్డ్ వెల్. అంతేకాదు, దక్షిణ దేశ భాషా కుటుంబమునకు ద్రావిడభాషా కుటుంబమని నామకరణము చేసినవాడు కూడ కాల్డ్ వెల్ పండితుడే.

ఒకవైపు మత ప్రచారము, ఇంకొకవైపు భాషాధ్యయనము, మరొకవైపు గ్రంథరచనము, వేరొకవైపు గ్రంథ ముద్రణము, మఱియొకవైపు ఉద్యోగధర్మ నిర్వహణము—ఇంత బహుముఖమైన వాక్యక్రమమును కడు సమర్థతతో నిర్వహించుటయేకాక విజయములు కూడ సాధించిన కేరీ నిజముగానే ప్రశంసార్హుడు! ఈ విషయాదికమును స్మరణకు తెచ్చుకొన్నప్పుడు, అతడెంత అదృష్టవంతుడో! అనిపించును. కాని దుఃఖ పూరితమైన

ఆతని జీవితమును గుర్తునకు తెచ్చుకొన్నచో, గుండె దిటవ్రతో ఆ బహుముఖమైన కార్యక్రమమును అత డెట్లు నిర్వహింప గలిగెనో! అను ఆశ్చర్యము కలుగకపోదు. జీవితములో అడుగడుగున అత డెన్నో కష్టముల నెదుర్కొనెను.

ఒకసారి కేరీ పండితుని అచ్చుకూటము అగ్ని ప్రమాదము నకు లోనయ్యెను. కాగితములకట్టలు, బల్లలు, కుర్చీలు మొదలగు వానితో పాటు పెక్కేండ్లు పరిశ్రమించి తయారు చేసిన వివిధ భాషా వ్యాకరణముల ముద్రిత ప్రతులు, రామాయ ణానువాదము మొదలగునవి కూడ పరశురామ ప్రీతి అయ్యెను. అందుల కాతడు కంట తడిపెట్టక పోలేదు; కాని నిరుత్సాహము చెందలేదు. మరియొకప్పుడు మకుటనకొలది సృష్టించు కొన్న సుందరోద్యానము వెల్లువలకు రూపు లేకుండ పాడయ్యెను. అప్పుడును నిరుత్సాహము చెందలేదు. పై పెచ్చు, అకుంఠిత మయిన కార్యదీక్షతో, అచంచలమయిన విశ్వాసముతో కేరీ మరల తన పనిపాటులలో నిమగ్నుడయ్యెను.

విలియం కేరీ మన దేశమునకు 1794 లో వచ్చెను. అప్పటి కతడు ముప్పది మూడేండ్ల యువకుడు. మరణించునాటి కతని వయస్సు డెబ్బదిమూడేండ్లు. ఈ నలుబదేండ్ల సుదీర్ఘకాలము లోను, అతడు మరల తన దేశమగు ఇంగ్లాండునకు వెళ్లలేదు. వెళ్లవలెనను తలంపు కూడ అతనికి కలుగలేదు. ఒకచోట కేరీ వ్రాసికొనినట్లుగా, అతని తలంపులన్నియు భారతావనియందే లగ్నమై యుండెను. మత ప్రచారముమీది ఆసక్తితో అతడు మన దేశమునకు వచ్చెను. ఆ అభిలాషతోనే అతడు భారతీయ భాషల నభ్యసించెను. అయినను భారత దేశమును తన

రెండవ స్వదేశముగా భావించి, నలుబదేండ్లు భారతీయ భాషా సపర్య చేసిన కేరీ భాషా జిజ్ఞాసువులకు ఆదర్శప్రాయుడు!

నార్త్ ఆంప్టన్‌లోని పౌలర్స్‌బరీ అనుకొక గ్రామములో ఎడ్మండ్ కేరీ దంపతులకు 1761 ఆగస్టు 8 న కేరీ జన్మించెను. ఎడ్మండ్ కేరీ ధనికుడు కాడు. సామాన్య గృహస్థు. నేతవృత్తి నాధారము చేసికొని అతడు కాలము వెళ్లదోయుచుండెను. అప్పటి రాజకీయ మత పరిస్థితులు అంత తృప్తికరముగా లేవు. మత సిద్ధాంతములు వివాదగ్రస్తములై ఉండెను. బాల్యమున కేరీ అల్లరి చిల్లరిగా తిరిగెను. తొలుత అతడొక చర్మకారుని యొద్ద పనికి కుదురుకొనెను. కాని ఆ రోజులలోనే అతని మనస్సు మత ప్రచారమున లగ్నమయ్యెను. ఒకవైపు మత సిద్ధాంతములను గురించి తలపోయుచునే, అతడు గ్రీక్, హీబ్రూ మున్నగు భాషలను అభ్యసింపసాగెను. కాలము గడుచు కొలది, అతనిలో మత ప్రచారవాంఛ బలీయమయ్యెను. అదియే తన జీవిత లక్ష్యమని అతడు భావించెను. అందుల కనుగుణముగా, బాప్టిస్ట్ చర్చివారు మత ప్రచార మొనర్చుటకు కేరీ అర్హుడనియు నిర్ణయించిరి. మన దేశమునకు వచ్చిన మొట్టమొదటి బాప్టిస్ట్ మిషనరీ అతడే!

డాక్టర్ థామస్ అనునొక బాప్టిస్ట్ ఆహ్వానముపై అతనితో పాటు కేరీ సకుటుంబముగా మన దేశమునకు బయలుదేరెను. థామస్ స్నేహపాత్రుడు. అతని ప్రధానవృత్తి వైద్యము. కేరీకి పూర్వమే అతడు కలకత్తాకు వచ్చి, అచట బెంగాలీ నేర్చుకొనెను. బైబిలులోని కొన్ని భాగముల నతడు బెంగాలీ లోనికి అనువదించెను కూడ. కాని అతడు వట్టి దూబరా మనిషి. అందువలన చేసిన అప్పులు తీర్చలేక, అతడు అపకీర్తి

పాలయ్యేను. అతని సలహా ననుసరించియు, ఆ నాటి పరిస్థితులను పురస్కరించుకొనియు కేరీ తొలుత కలకత్తాలో గాక తన్నగరమునకు నలుబదిమైళ్ల దూరములో నున్న ఒక గ్రామమున దిగెను. అటుపిమ్మట తన నివాసమును శ్రీరాంపురమునకు మార్చుకొనెను.

థామసు నొద్ద కేరీ బెంగాలీ నేర్చుకొనెను. కాని మత ప్రచారము చేయు నవసరమున, సంస్కృత భాషాధ్యయనము చేసినగాని బెంగాలీలో పాండిత్యము గడించుటకు వీలుపడదను విషయమును గ్రహించి, సంస్కృతము నేర్చుకొన మొదలిడెను. బైబిలును సంస్కృతము చేయదలచి, కేరీ గీర్వాణ భాషలో గట్టి కృషి చేసెను. బెంగాలీలో తగినంత పరిజ్ఞానము కలిగిన పిమ్మట, అతడు థామసు ప్రారంభించిన బైబిలు అనువాదమును పూర్తి చేయుటకు పూనుకొనెను. కొన్నాళ్లకది పూర్తి అయ్యేను. దానిని బెంగాలీ పండితులకు చూపించి, వారి ఆమోదమును పొందిన పిమ్మటనే అతనికి తన రచనపై నమ్మక మేర్పడెను. పిమ్మట ఆ అనువాదమును ముద్రించుటకుగాను అచ్చుకూటు మొకటి ఆవశ్యక మయ్యేను. కేరీ ఒక ముద్రణ యంత్రమును కొని, అచ్చుకూటము నెలకొల్పి, అచ్చుపనులలో నిమగ్నుడయ్యేను. కాని 1799 లో కురిసిన వానలకు ఫలితముగా అతని కృషి నిష్ఫల మయ్యేను. అచ్చుపడిన ఫారములు మున్నగునవి వెల్లువలో కొట్టుకొని పోయెను.

ఇట్లుండగా, అప్పటి గవర్నరగు లార్డ్ వెల్లెస్లీ ఒక ప్రకటన కావించెను. 'దేశ భాషలలో తగినంత పరిజ్ఞానము సంపాదించిన సివిల్ ఉద్యోగులకే బాధ్యతాయుతములగు పదవులు లభింపగలవు' అనునది ఆ ప్రకటనలోని ముఖ్య విషయము.

తత్ఫలితముగా, సివిల్ ఉద్యోగులకు దేశభాషలు బోధించు నుద్దేశముతో కలకత్తాలో ఫోర్టు విలియం కాలేజి స్థాపింప బడెను. ఆ కళాశాలలో కేరీ సంస్కృత వంగ భాషోపన్యాసకు డుగా నియమింపబడెను. అప్పటి అతని జీతము నెలకు 500 రూప్యములు. కొన్నాళ్లకు అతడు మరాఠీ కూడ బోధింప జొచ్చెను. మరి కొన్నాళ్లకు, నెలకు వెయ్యి రూపాయల జీతముమీద అతడు ఆచార్యపదవిలో నియమితు డయ్యెను. ఆ నాళ్లలో అంత పెద్ద జీతముతో రాజభోగముల ననుభ వించుచు జీవితము గడపనచ్చును. పై పెచ్చు, కేరీ ప్రభుత్వ అనువాదకునిగా కూడ నియమితు డయ్యెను. ఇందువలన అతనికి సంవత్సరమునకు 300 పౌనుల ఆదాయము లభించెను. జీతము ఎక్కువగుకొలది, అతని దృష్టి యంతయు శ్రీరాం పురము మీదనే లగ్నము కాదొడగెను. ముద్రణాలయమును విస్తరించు కార్యక్రమమునకును, బాప్టిస్ట్ సంస్థను అభివృద్ధి చేయుటకును అతడు జీతములోని అధికభాగమును వినియో గించెను.

స్వయముగా తాను భాషాధ్యయనము చేయునప్పటికంటె, ఇతరులకు భాషా బోధన కావించునప్పుడే వ్యాకరణములయు, నిఘంటువులయు ఆవశ్యకతను కేరీ బాగుగా గుర్తించెను. కనుకనే అతడు తొలుత బెంగాలీ వ్యాకరణమును, బెంగాలీ నిఘంటువును సంతరించుటకు పూనుకొనెను. కాల క్రమమున మరాఠీ (1805), సంస్కృతము (1806), పంజాబి, (1812), తెలుగు, (1814), భూటానీస్, (1826) మొదలగు భాషలకు వ్యాకరణములను, మరాఠీ (1810), బెంగాలీ, (1818), భూటా నీస్ (1826) మున్నగు భాషలలో నిఘంటువులను ప్రచురించెను.

1813 లో కేరీ తన ఆప్తమిత్రుడగు ఫుల్లరున కొకజాబు వ్రాయుచు అందులో ఇట్లు పేర్కొనెను: 'ఇప్పుడే నా తెలుగు వ్యాకరణపు ప్రెస్సు కాపీ పూర్తి అయినది. పంజాబీ వ్యాకరణపు తుదిపుట అచ్చులో ఉన్నది. కర్ణాట వ్యాకరణపు ప్రెస్సుకాపీ కూడ తయారయినట్లే. కాశ్మీర్, పుష్టో, బిల్లోచి భాషల వ్యాకరణముల రచనకు కావలసిన విషయములను సేకరించితిని. ఒరియా వ్యాకరణమును మొదలిడితిని. బర్మన్ వ్యాకరణమును ఒక్కసారి సరిచూచి ప్రకటించు భారము నాపై గలదు.'

ఇటుల వివిధ భాషలలో వ్యాకరణ గ్రంథముల ముద్రణ ముతో పాటు, బైబిలు అనువాదముల ముద్రణమును కూడ కేరీ నిర్వహించుచుండెను. తొలుత క్రొత్త నిబంధనను సంస్కృతము, ఒరియా, హిందూస్తాని, గుజరాతీ భాషలలో నికి అనువదించి, ఆ అనువాదములను ప్రకటించెను. అటు పిమ్మట క్రొత్త నిబంధనను తెలుగు, కన్నడము, చైనీస్, పంజాబీ, బర్మన్ మొదలగు భాషలలోనికి అనువదింప బూనుకొనెను. ఇట్లనుటచే పైభాష లన్నియు కేరీకి తెలిసియుండెనని భావింప రాదు. కాని పెక్కు భారతీయ భాషలలో అతనికి పరిజ్ఞానము గలదు. ఈ బహుముఖమైన అనువాద కార్యక్రమమునందు అతడు పలువురు పండితుల సహాయమును పొందె ననుట సుస్పష్టము. కాని ఆ అనువాదముల ముద్రణ భారమును కేరీ స్వయముగా నిర్వహించినట్లు తెలియుచున్నది.

ఆ నాళ్లలో మన దేశమునందలి వివిధ భాషలకును ముద్రణాక్షరములు లేకుండెను. కనుక శ్రీరాంపురం ప్రెస్సు వారొక ఫౌండ్రీని స్థాపించి ముద్రణాక్షరములు పోత పోయించిరి.

కాని 1812 మార్చిలో ప్రెస్సులో ఏర్పడిన అగ్ని ప్రమాదము వలన, కేరీ కృషి చాలవరకు నిష్ఫల మయ్యె ననియే నుడువ వలసి యున్నది. మూడున్నర టన్నుల సీసము కరిగిపోయెను. అచ్చు ఫారములు, కేసులు, కుర్చీలు, కాగితములు, వ్రాత ప్రతులు మొదలగునవి దగ్ధ మయ్యెను. 10,000 పౌనులు నిలువచేయు వస్తువులు నష్ట మయ్యెనని అంచనా కట్టిరి. ఈ నష్టమునకు కేరీ అంతగా విచారించలేదు. కాని పెక్కేండ్లు కష్టపడి తయారు చేసిన వ్రాత ప్రతులు నశించుటను చూచి మాత్రము అతడు మిక్కిలి విచారించెను. ఈ ప్రమాదము జరిగిన పిమ్మట కేరీ ఫుల్లరు కిట్లు లేఖ వ్రాసెను: 'ఇక ఎట్టి ప్రమాదము సంభవింపకున్నచో, పది పదునైదు దినములలో ఒక భాషలో అచ్చుపనులు ప్రారంభింతును. మరొక భాషలో అచ్చుపనులు ప్రారంభించుటకు ఇంకొక నెల పట్టవచ్చును. ఆరు నెలల కాలములో పరిస్థితు లన్నియు చక్కబడవచ్చునని ఆశించుచున్నాను.' ఫుల్లర్ ఒక్కడే ఇంగ్లాండులో 10,000 పౌనులు సేకరించి కేరీకి సహాయము చేసెను.

భారత దేశములో క్రైస్తవ మతమును, క్రైస్తవ వాఙ్మయమును వ్యాప్త మొనర్చుటకు కంకణము కట్టుకొన్న కేరీ తల్లక్ష్య సాధనకై అహోరాత్రములు కృషి యొనర్చెను. మత ప్రచారముతోపాటు, అతడు చర్చీ, పాఠశాలలు మొదలగు వానిని నెలకొల్పసాగెను. శ్రీరాంపురమునకు సమీపమున ఒక చోట ఐరోపీయ బాలుర కొక పాఠశాలను, భారతీయుల కొక పాఠశాలను స్థాపించెను. ఐరోపీయ బాలురకు హీబ్రూ, సంస్కృతము లేక పర్షియన్ భాషలు బోధింపదలచెను. బెంగాలీ ద్వారా భారతీయులకు విద్యా ప్రదానము

జరిగెను. భోజనవసతి కూడ కల్పింపబడుటచే, ఈ పాఠశాలలు ప్రజల ఆదరమును చూరగొనెను. భారతీయుల పాఠశాలలో క్రైస్తవేతరులు కూడ కొందరు చేరినట్లు విదిత మగుచున్నది. ఈ కార్యక్రమమున కేరీకి డాక్టర్ మార్ష్‌మన్ అను నాతని తోడ్పాటు పరిపూర్ణముగ లభ్య మయ్యెను.

అటుపిమ్మట కేరీ, మార్ష్‌మన్‌లు ఒక కళాశాలను స్థాపించిరి. అందులో క్రైస్తవేతరులు కూడ చేర్చుకొనబడిరి. క్రైస్తవ మతమునందు గాఢానురక్తిగల క్రైస్తవులకు తన్మత వాజ్ఞ్మయమును బోధించుటయు, విద్యార్థుల కందరకు ఉన్నత విద్యా సౌకర్యము కల్పించుటయు తమ లక్ష్యములని కేరీ పేర్కొనెను. బెంగాలీ ద్వారా విద్యాబోధన జరిగెను. సంస్కృత భాషా సారస్వతములకు ప్రాధాన్య మొసగబడెను. ఈ కళాశాలకు డెన్మార్క్ పాలకుడు ఆర్థికముగా సహాయము సలుపుటయేకాక, డిగ్రీలు ఇచ్చునట్టి విశేషాధికారమునుకూడ ఆ కళాశాల వారికొసగెను.

స్వయం కృషిచే పైకి వచ్చిన కేరి సహనముతో ఎన్నో కష్టముల నెదుర్కొనెను. తా నేర్పరచుకొన్న లక్ష్యములను సాధించు నిమిత్తము ఆ కష్టపరంపరను లెక్కసేయక అతడు ఆత్మ ప్రత్యయముతో కృషి యొనర్చెను. అతని జీవితము సందలి తుదిభాగము కూడ కష్టములతోనే గడచెను. శ్రీరాంపురం వారికిని, ఇంగ్లాండులోని బాప్టిస్ట్ వారికిని నడుమ నైమనస్యము లేర్పడెను. తత్ఫలితముగా, కేరీకి ఆర్థిక సహాయము లభింపలేదు. అందులకు తోడుగా, ఫోర్టు విలియం కాలేజీలో ఆచార్య పదవుల సంఖ్యను తగ్గించుటతో, అతనికి తక్కువ జీతము రాదొడగెను. అంతేకాదు, అనువాదక పదవిని రద్దు చేసిరి. అందువలన ప్రతి సంవత్సరము లభించుచున్న 300

పౌనుల ఆదాయము లేకుండ పోయెను. కళాశాలకై అమెరి కాలో సేకరింపబడిన ద్రవ్యము కూడ అతని చేతి కందలేదు. ఈ వివిధ కారణములవలన కేరీ ఆర్థికముగా దెబ్బతినెను.

బాల్యమునుండియు పువ్వు లన్నను, పూల మొక్కలన్నను కేరీకి ప్రీతి మెండు. రాయల్ హార్టీ కల్చరల్ సొసైటి, లండను లోని లిన్నియన్ సొసైటి మొదలగు సంస్థలలో అతడు సభ్యుడుగా నుండెను. వ్యయ ప్రయాసల కోర్చి అత డొక సుందరో ద్యానమును నిర్మించెను. దానిని ప్రాణపదముగా చూచు కొనెడి వాడని వేరుగ నుడువ నవసరము లేదు. కాని దురదృష్ట వశమున, అది రెండుతడవలు వెల్లువలకు పాడయ్యెను.

ఇటుల ఆపదలందు ధైర్యము వహించియు, కష్టములను సహనముతో ప్రతిఘటించియు డెబ్బదిమూడు గ్రీష్మములు గడపిన డాక్టర్ విలియం కేరీ 1834 వ సంవత్సరము జూను 9 న మరణించెను.

Blank Page

172

హైదరాబాదులో సి. ఎల్. ఎస్.

ఇకమీదట మీకు కావలసిన ఇంగ్లీషు, తెలుగు
పుస్తకము లన్నిటికొరకు హైదరాబాదులోనున్న
మా నూతన బుక్‌షాప్‌కు వ్రాయండి.

సి. ఎల్. ఎస్. బుక్‌షాప్

స్టేషన్ రోడ్, నాంపల్లి
హైదరాబాద్ 1

CLS

TELUGU FEAST
By Dr. C. R. Sarma

Check List

Book Number	CP03F196	Date	111512020
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	CI, 171		
Missing Pages	NO		
Prepared	Sandhya	Scanned	Shaheena.
PS		Pages	178